ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

29-6-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 148 పేజీలు: 10+4 వెల: 8.00


యాంకర్ స్వేచ్ఛది బలవన్మరణం కాదు, హత్య? 3

కోర్టు బల్డింగ్‌పై నుంచి దూకిన కుటుంబం, భార్య మృతి, భర్త పరిస్థితి విషమం, పిల్లలకు గాయాలు 7



## సిగ్నల్ ఫ్రీ దిశగా
# హైదరాబాద్
### గచ్చిబౌలిలో అందుబాటులోకి పిజెఆర్ ఫ్లైఓవర్

రాజధానిలో వ్యూహాత్మకంగా రహదారుల అభివృద్ధి

2 ఎకరాల చెరువును నాగార్జున అప్పగించారు

**నగర అభివృద్ధికి సహకరించని కేంద్రం: సిఎం రేవంత్**



శనివారం హైదరాబాద్‌లో ఫ్లై ఓవర్‌ను ప్రారంభిస్తున్న సిఎం రేవంత్. చిత్రంలో మంత్రులు తదితరులు

**సైబరాబాద్ ప్రతినిధి, జూన్ 28 ప్రభాతవార్త:** హైదరాబాద్‌ను సిగ్నల్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. మహానగరంలో వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఫ్లైఓవర్‌లు నగర వాసులకు ఒక్కొక్కటిగా అందుబాటులోకి వస్తున్నాయి. ఇందులో భాగంగానే ఔటర్ రింగు రోడ్డు నుంచి గచ్చిబౌలి కొండాపూర్ మార్గంలో 182.72కోట్ల వ్యయంతో 6 లైన్లగా 1.2 కి.మీ దూరంలో నిర్మించిన ఫ్లైఓవర్‌ను ముఖ్యమంత్రి శనివారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరానికి దాదాపు పాతికసంవత్సరాల పాటు దివంగత పీజేఆర్ చేసిన సేవలకు గుర్తుగా ఈ ఫ్లైఓవర్‌కు ఆయన పేరు పెట్టామన్నారు. >>2

## ఫ్యూచర్ సిటీ భూసేకరణ త్వరగా పూర్తి: సిఎం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 28:** ఫ్యూచర్ సిటీ భూ సేకరణ తొందరగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. డేటా సెంటర్ల ఏర్పాటు పైన ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, డేటా సెంటర్లకోసం కావాల్సిన స్థలం సిద్ధం చేయాలని సూచించారు. శనివారం పరిశ్రమల శాఖ పైన జూబ్లీ హిల్స్ నివాసంలో సిఎం సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి >>2



అంతర్జాతీయ స్పేస్ స్టేషన్‌లో ఉన్న శుభాంశు శుక్లాతో శనివారం మాట్లాడుతున్న ప్రధాని మోడీ

# సరిహద్దుల్లేని వసుధైక ప్రపంచం

16 ఉషోదయాలు, 16 సూర్యాస్తమయాలు చూశాం: ప్రధాని మోడీతో శుభాంశు శుక్లా

మాతృభూమికి దూరంగా ఉన్నా, కోట్లాది భారతీయుల హృదయాల్లో మీరున్నారు: ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ,జూన్ 28:** మాతృభూమికి మీరు దూరంగా ఉన్నా మీరు 140 కోట్ల మంది భారతీయుల హృదయాల్లో నిలిచి ఉన్నారని రోదసిలో ఉన్న వ్యోమగామి శుభాంశు శుక్లాతో మాట్లాడుతూ ప్రధాని మోడీ వ్యాఖ్యానించారు. మీపేరులోనే ముందు శుభంఉందని, మీ రోదసీ యాత్ర కూడా ఒక కొత్తశకానికి శుభారంభం అని ప్రధానిమోడీ ప్రశంసించారు. శనివారం అంతర్జాతీయ >>2

## 'రా' చీఫ్‌గా పరాగ్ జైన్ 7

ఆపరేషన్ సిందూర్‌లో పరాగ్ కీలక పాత్ర

రేపటితో ముగియనున్న రవిసిన్హా పదవీకాలం



## సమాజానికి పునాదులు వేసిన సంఘ సంస్కర్త పివి 6

సిఎం, డి.సిఎం సహా పలువురు నేతల నివాళులు



పివి ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న డి.సిఎం భట్టి, మంత్రి పొన్నం

నీతి ఆయోగ్ ర్యాంకింగ్స్‌లో
## గద్వాల్ నం. 5 2

రూ. కోటి బహుమతి



# బలవంతుడినో.. బలహీనుడినో!

ప్రజలకు తెలుసు.. నా వ్యాఖ్యలు సీరియస్‌గా తీసుకోవద్దు..

కాంగ్రెస్ క్రమశిక్షణ విచారణలో కొండా మురళి

చైర్మన్ మల్లు రవికి 15 పేజీల వివరణ అందజేత



గాంధీభవన్ వద్ద మీడియాతో కొండా మురళి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్28:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత కొండా మురళి తన వివాదాస్పద వ్యాఖ్యలపై పార్టీ క్రమశిక్షణ కమిటీ ముందు హాజరై వివరణ ఇచ్చారు. ఇటీవల కొందరు పార్టీ నేతలను ఉద్దేశించి ఆయన చేసిన వ్యాఖ్యలపై ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు అధిష్ఠానానికి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పీసీసీ క్రమశిక్షణ కమిటీ ఆయనకు నోటీసులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో కొండా మురళి శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌కు 60 వాహనాల్లో భారీగా తన మద్దతుదారులు, కార్యకర్తలతో తరలివచ్చారు. అయితే వారిని గాంధీ భవన్ గేటు వద్దే పోలీసులు నిలిపివేశారు. కొండా మురళిని మాత్రమే గాంధీభవన్‌లోకి అనుమతించారు. క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి ముందు హాజరై తన వాదనను వినిపించారు. కమిటీకి 15 పేజీలతో కూడిన నివేదికను అందజేశారు. గత కొద్ది రోజులుగా తెలంగాణ కాంగ్రెస్‌లో వివిధ జిల్లాల్లో నాయకుల మధ్య అంతర్గత పోరు కొనసాగుతోంది. ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో మంత్రి కొండా సురేఖ, ఆమె భర్త మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి ఒక వర్గంగా.. మిగిలిన ఎమ్మెల్యేలు మరో వర్గంగా విడిపోయి ఒకరిపై ఒకరు >>2

# జూరాలకు ముప్పులేదు..

నిర్విరామంగా పనిచేస్తున్న 58 గేట్లు

జలాశయం వద్ద మరో బ్రిడ్జి

నెట్టెంపాడు డిసెంబర్‌లోగా పూర్తి

**మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి జూరాల, ర్యాలంపాడు సందర్శించిన మంత్రి ఉత్తమ్**



శనివారం జూరాల ప్రాజెక్టును సందర్శిస్తున్న మంత్రులు ఉత్తమ్, వాకిటి శ్రీహరి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 28, ప్రభాతవార్త:** గత దశాబ్ద కాలంలో తెలంగాణలో జరిగిన పాలనలో ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్వహణ పూర్తిగా నిరక్ష్యం చేయబడిందని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ప్రస్తుతం వచ్చిన కొత్త ప్రభుత్వం, గత పాత తప్పిదాలను సరిచేసే దిశగా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టిందని తెలిపారు. అధికారంలోకి వచ్చిన కేవలం 18 నెలల్లోనే ఇరిగేషన్ లో ఆపరేషన్ మెయింటెనెన్స్ పట్ల ప్రత్యేక దృష్టి సారించి,ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. శనివారం జోగులాంబ గద్వాల జిల్లాలో రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పశుసంవర్ధక, యువజన మరియు క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి ప్రియదర్శిని >>2

## 1న బిజెపి రాష్ట్ర అధ్యక్షుని ఎన్నిక



నేడు నోటిఫికేషన్

రేసులో అరవింద్, ఈటల, లక్ష్మణ్, అరుణ

**హైదరాబాద్, జూన్ 28 ప్రభాతవార్త:** రాష్ట్ర బిజెపి అధ్యక్షపదవికి ఈ సారి పోటీ ఎక్కువైంది. పార్టీ నేతలు ఎవరికి వారే పైరవీలు చేసుకుంటున్నారు. అధిష్టానం ఎవరివైపు చూపుతుందో అన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. బిజెపి అధ్యక్ష పోటీకి సంబంధించిన ఆదివారం నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. సోమవారం నుంచి నామినేషన్లను స్వీకరించనున్నారు. జులై 1వ తేదిని >>2

33 మందికి అదనపు
## కలెక్టర్లుగా పదోన్నతి

**హర్షం వ్యక్తం చేసిన డిప్యూటీ కలెక్టర్ల సంఘం**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్28:** రాష్ట్ర ప్రభుత్వం సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్స్‌ను అదనపు కలెక్టర్లుగా పదోన్నతి కల్పించింది. ఈ మేరకు రెవెన్యూ సెక్రటరీ డిఎస్ లోకేశ్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి పొందిన వారిలో ఎం. సత్యవాణి, బిఎస్ లత, మధుసూదన్ నాయక్, డి.వేణుగోపాల్, జి.సంధ్యారాణి, పద్మజారాణి, ఖీమ్యానాయక్, ఎం.డేవిడ్, భవాణీ శంకర్, వై.వి గణేష్, శ్యామ్ ప్రసాద్ లాల్, పి.శ్రీనివాస్‌రెడ్డి, జి.వీరారెడ్డి, రఘురామ్ శర్మ, పి.చంద్రయ్య, కె.చంద్రమోహన్, కనుగుల శ్రీనివాస్, పర్సా రాంబాబు, సైదినేని కిరణ్‌కుమార్, బి.హరిసింగ్, జి.ముకుందరెడ్డి, ఎ.భాస్కరరావు, కె.సీతారామారావు, ఎనుగు >>2






న్యూఢిల్లీలో ఆదివారం జరిగిన విద్యానంద్ జీ మహారాజ్ శతాబ్ది ఉత్సవాలలో జైన ఆధ్యాత్మిక గురువుకు అభివాదం చేస్తున్న ప్రధాని మోడీ

# 'ధర్మ చక్రవర్తి' ప్రధాని మోడీ

### బిరుదు ప్రదానం చేసిన జైన ఆచార్యులు

**న్యూఢిల్లీ,జూన్ 28:** జైన సన్యాసి ఆచార్య శ్రీ 108 విద్యానంద్ జీ మహారాజ్ శతాబ్ది ఉత్సవాలు సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి 'ధర్మ చక్రవర్తి' బిరుదును శనివారంనాడు ప్రదానం చేశారు. ఆచార్య శ్రీ 108 విద్యానంద్ జీ మహారాజ్‌కు ఏడాది పొడవునా నిర్వహించే జాతీయ నివాళికి నాంది పలుకుతూ ఈ శతాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. జైన నేత ఆధ్యాత్మిక, పండిత వారసత్వాన్ని స్మరించుకునేందుకు కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, ఢిల్లీలోని భగవాన్ మహావీర్ అహింసా భారత్ ట్రస్టు సహకారంతో ఈ శతాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ధర్మ చక్రవర్తిబిరుదును ప్రధాని స్వీకరిస్తూ, తనను తాను ఈ బిరుదుకు అర్హుడనని భావించడం లేదని, అయితే సాధువుల నుంచి ఏది స్వీకరించినా దానిని ప్రసాదంగా స్వీకరించాలనేది మన సంస్కృతి అని చెప్పారు. ఈ ప్రసాదాన్ని తాను వినయంగా స్వీకరిస్తూ తల్లి భారతికి అంకితమిస్తున్నానని అన్నారు. ఆచార్య విద్యానంద్‌జీ 1987 జూన్ 28న ఆచార్య బిరుదును అందుకున్నారని ప్రధాని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ఇది కేవలం గౌరవం కాదని, జైన సంస్కృతిని సంయమనం, కరుణతో అనుసంధానించే పవిత్ర ధార అని అన్నారు.

# అదనపు కలెక్టర్లుగా పదోన్నతి

>> నరసింహారెడ్డి, ఎస్.మోహన్‌రావు, కె.చంద్రారెడ్డి, టి.పూర్ణ చంద్ర, కె.విద్యాసాగర్, వి.లక్ష్మీనారాయణ, ఆర్.డి మాధురి, బి.రోహిత సింగ్, జి. లింగ్యానాయక్, మహ్మద్ అసుదుల్లా ఉన్నారు. రెవెన్యూ చరిత్రలోనే తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వం సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్స్(అదనపు కలెక్టర్లు)గా నియామకాన్ని చేపట్టిందని డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు వి.లచ్చిరెడ్డి, కె.రామకృష్ణ తెలిపారు. 33 మందికి అదనపు కలెక్టర్లుగా పదోన్నతి కల్పిస్తూ జీవో విడుదల చేయడం పట్ల తెలంగాణ సివిల్ సర్వీసెస్ ఎక్జిక్యూటీవ్ బ్రాంచ్ డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.చంద్రమోహన్, జనరల్ సెక్రటరీ కె.భాస్కరరావు హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డికి, ఇతర ప్రభుత్వ పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు. రెవెన్యూ వ్యవస్థలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ పోస్టునే చివరిదిగా ఉండేదని ఈ సందర్భంగా లచ్చిరెడ్డి, రామకృష్ణ తెలిపారు. ఇదే విషయమై డిప్యూటీ కలెక్టర్ల సంఘంగా ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి దానిని సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్(అదనపు కలెక్టర్) గా 33 పోస్టులను సాధించామన్నారు. చరిత్రలోనే తొలిసారిగా 33 మందికి అదనపు కలెక్టర్లుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసిందన్నారు. ఇది రెవెన్యూ చరిత్రలో నిలిచి పోయే అంశంగా పేర్కొన్నారు.

**పలువురు ఐఎఎస్‌లకు అదనపు బాధ్యతలు**

తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. పలువురు ఐఏఎస్ అధికారులకు అదనపు బాధ్యతలు అప్పజెప్పింది. ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ అథారిటీ (ఎఫ్‌సిడిఎ)కమిషనర్ కె.శశాంకకు టీజీఐఐసీ వీసీ, ఎండీగా అదనపు బాధ్యతలు ఇచ్చారు. ఇప్పటి వరకు అక్కడ అదనపు బాధ్యతలు నిర్వహించిన డాక్టర్ ఇ.విష్ణువర్దన్‌రెడ్డి రిలీవ్ అయ్యారు. టూరిజం డవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండి వల్లూరి క్రాంతికి గనులు, భూగర్భ శాఖ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటి వరకు అక్కడ అదనపు బాధ్యతలు నిర్వహించిన శశాంక రిలీవ్ అయ్యారు. సెర్ప్ అడిషనల్ సీఈఓ కాత్యాయనీ దేవికి స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఖమ్మం మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ పి.మహేందర్‌ను ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ అథారిటీ రంగారెడ్డి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా బదిలీ చేస్తూ శనివారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో కెటిఆర్ మంత్రిగా ఉన్నప్పుడు ఆయన వద్ద మహేందర్ ఓస్డీగా పనిచేశారు. ఇప్పుడు ఆయనకు ఫ్యూచర్ సిటీ బాధ్యతలు అప్పగించడం గమనార్హం.

**44 మంది డిఎస్‌పిల బదిలీ**

రాష్ట్ర పోలీసు శాఖలో పలు విభాగాల్లో పనిచేస్తున్న 44 మంది డిఎస్‌పిలను బదిలీ చేస్తూ డిజిపి జితేందర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో శాంతి భద్రతలతో పాటు నిఘా విభాగం, సిఐడి తదితర విభాగాలకు చెందిర వారున్నారు. కొత్తగా పోస్టింగులు పొందిన వారిలో అనేక మంది వెయిటింగ్‌లో వున్న వారే వున్నారు. ఇదిలావుండగా కరీంనగర్‌లో ఏఎస్‌పిగావున్న నగరాలే శుభం ప్రకాష్‌ను వరంగల్ ఏఎస్‌పి గా నియమిస్తూ చీఫ్ సెక్రటరీ రామకృష్ణా రావు శనివారం నాడు ఆదేశాలు జారీ చేశారు. 2022 బ్యాచ్‌కు చెందిన శుభం ప్రకాష్ ఇటీవలే శిక్షణ పూర్తి చేసుకుని ఉద్యోగంలో చేరారు.

# బలవంతుడినో.. బలహీనుడినో!

>> ఫిర్యాదు చేసుకున్న పరిస్థితి. ఈ సమస్యను పరిష్కరించే క్రమంలో ఆ బాధ్యతను క్రమశిక్షణా కమిటీకి కాంగ్రెస్ హైకమాండ్ అప్పగించింది. ఈ నేపథ్యంలో ఈరోజు మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి గాంధీభవన్‌కు చేరుకుని క్రమశిక్షణ కమిటీతో భేటీ అయ్యారు. కడియం శ్రీహరి,రేవూరి ప్రకాష్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డిపై కమిటీకి ఫిర్యాదు చేశారు కొండా. ఉమ్మడి వరంగల్‌లో ప్రతీ నియోజకవర్గంలో జరుగుతున్న అంశాలపై నివేదిక సమర్పించినట్లు తెలుస్తోంది. కడియం, రేవూరి, నాయినిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కొండా మురళి కోరుతున్నారు. విచారణ అనంతరం కొండా మురళి మీడియాతో మాట్లాడుతూ, 'నా వ్యాఖ్యలపై మల్లు రవి గారికి పూర్తిగా వివరణ ఇచ్చాను. కాంగ్రెస్ నేతలంటే నాకు ఎంతో గౌరవం ఉంది. కొందరు నేతలపై నేను చేసిన వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకోవద్దు. నేను బలవంతుడినో, బలహీనుడినో ప్రజలందరికీ తెలుసు. పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలను పట్టించుకోవాలనే ఉద్దేశంతోనే అలా మాట్లాడాను' అని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడమే తన లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. 'గత 40 ఏళ్లుగా బీసీల సంక్షేమం కోసం పోరాడుతున్నాను. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మళ్లీ సీఎం కావాలి. రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలనే తపన మా అందరిలో ఉంది' అని కొండా మురళి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటే తనకు గౌరవం ఉందని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి అన్నారు. కాంగ్రెస్‌లో చేరిన కడియం శ్రీహరి రాజీనామా చేస్తారో లేదో ఆయనే తేల్చుకోవాలి. మళ్ళీ అవసరం వచ్చినప్పుడు వరంగల్‌లో మాట్లాడుతానని కొండా మురళి పేర్కొన్నారు. ఈ విషయంపై క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి స్పందించారు. 'మేము పంపిన నోటీసుకు స్పందించి కొండా మురళి విచారణకు వచ్చారు. ఆయన తనవాదనను మాకు వినిపించారు. రాతపూర్వకంగా వివరణ ఇచ్చారు' అని మల్లు రవి తెలిపారు.

### నీతి ఆయోగ్ ర్యాంకింగ్స్‌లో

# గద్వాల్ నం. 5

### రూ. కోటి బహుమతి

**హైదరాబాద్, జూన్ 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని జోగుళాంబ గద్వాల్ జిల్లాలోని ఘట్టు బ్లాక్ జనవరి–మార్చి 2025 సంవత్సరానికి ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రామ్ కింద గుర్తింపు పొందింది. నీతి ఆయోగ్ విడుదల చేసిన డెల్టా ర్యాంకింగ్స్‌లో 5వ స్థానాన్ని పొందడం ద్వారా జాతీయ గుర్తింపు పొందింది. ఇది తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళలను కవర్ చేస్తూ జోన్ 3లో 2వ స్థానంలో నిలిచింది. దేశవ్యాప్తంగా 500 బ్లాక్‌లను అంచనా వేసే ర్యాంకింగ్‌లను వర్చువల్ ఈవెంట్ సందర్భంగా నీతి ఆయోగ్ ప్రకటించింది. ఘట్టు బ్లాక్ పనితీరుకు నీతి ఆయోగ్ 1 కోటి రూపాయల బహుమతిని ఇచ్చింది. ఆరోగ్యం మరియు పోషకాహారం, విద్య, వ్యవసాయం మరియు అనుబంధ సేవలు, ప్రాథమిక మౌలిక సదుపాయాలు మరియు సామాజిక అభివృద్ధి అనే ఐదు రంగాలలోని 39 సూచికలను ర్యాంకింగ్‌లు మూల్యాంకనం చేసింది. ఘట్టు యొక్క మిశ్రమ స్కోరు 61.24 నుండి 69.43కి పెరిగింది. ఒక త్రైమాసికంలో 8.19 శాతం మెరుగుదల నమోదైంది. రియల్ టైమ్ పర్యవేక్షణ, సమన్వయ ప్రణాళిక, బ్లాక్ అధికారులు, ఫ్రంట్‌లైన్ సిబ్బంది నిబద్ధతతో పని చేయడం ద్వారా ఈ గుర్తింపును సాధించినట్లు రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది.

# భూసేకరణ త్వరగా పూర్తి

>> అజిత్‌రెడ్డి.స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్ కుమార్,డైరెక్టర్ ఆఫ్ ఇండ్రస్టీస్ నిఖిల్ చక్రవర్తి,టీజీఐఐసీ వైస్ చైర్మన్ శశాంక హాజరయ్యారు. ఈ సమీక్షలో సిఎం మాట్లాడుతూ పెట్టుబడుల కోసం రాష్టానికి వచ్చే పారిశ్రామిక వేత్తలు ఎవరూ వెనక్కి వెళ్లడానికి వీలు లేదని స్పష్టం చేశారు. నిమ్జ్‌లో మిగిలిఉన్న భూ సేకరణను తక్షణమే పూర్తి చేయాలని అధికారులకు దిశ్వానిర్దేశం చేశారు. రైతులతో మాట్లాడి భూములు ఇవ్వడానికి ఒప్పించాలని చెప్పారు. ఫ్యూచర్ సిటీలో ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ క్యాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ క్యాంప్లెక్స్ కోసం అంతర్జాతీయ స్థాయి స్పోర్ట్స్ ఆర్కిటెక్చర్స్ ను నియమించుకోవాలని చెప్పారు.. స్పోర్ట్స్ క్యాంప్లెక్స్‌లో క్రికెట్,ఫుట్ బాల్,గోల్ఫ్ వంటి అన్ని క్రీడలు ఉండేలా ప్లాన్ చేయాలని చెప్పారు. మెగా ప్రాజెక్ట్స్ పైన మంత్రి వర్గ ఉపసంఘం ప్రతి 15 రోజులకు ఒకసారి సమావేశం నిర్వహించి ప్రతిపాదిత ప్రాజెక్ట్స్ పైన చర్చించాలని సూచించారు. 2024లో 70 గ్లోబల్ కెపబులిటీ సెంటర్స్ వచ్చాయని, 2025లో ఇప్పటికే 25 గ్లోబల్ కెపబులిటీ సెంటర్స్ వచ్చాయని చెప్పారు..మరిన్ని సెంటర్స్ వచ్చేలా కృషి చేయాలని అందుకు 100 రోజుల ప్రణాళిక సిద్ధం చేసుకొని అధికారులు పని చేయాలని ఆదేశించారు.

## వారం - వర్జ్యం

తేది : 29-06-2025, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, శుక్ల పక్షం
చవితి ఉ.9.18
ఆశ్లేష ఉ.6.35
వర్జ్యం సా.6.58–రా.8.37
దు.సా.4.55–5.47
శుభసమయం : ఉ.9.30–10.10
రాహుకాలం - సా.4.30–6.00

## వార్తాఫలం

**మేషం:** ఆరోగ్య సమస్యలు ఎదురై చికాకులు పెడతాయి. శ్రమకు తగిన ఫలితం అందుతుంది.

**వృషభం:** ఆర్థిక పరిస్థితి సంతృప్తికరంగా వుండును. రుణాలు తీరి ఊరటచెందుతారు.

**మిథునం:** వృత్తి–వ్యాపారాలు అభివృద్ధిచెందుతాయి. నూతన వస్తు, వస్త్రాలుకొనుగోలు చేస్తారు.

**కర్కాటకం :** ఆస్తివివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. ఆరోగ్యంపట్ల జాగ్రత్త అవసరం.

**సింహం:** బంధువుల నుండి ఆసక్తికరమైన విషయాలు తెలుసుకుంటారు. సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

**కన్య :** కొత్త మిత్రుల పరిచయాలు పెరుగుతాయి. దూరప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి.

**తుల :** సంతానం నుండి ధనలాభం పొందుతారు. పనులు విజయవంతంగా పూర్తిచేస్తారు.

**వృశ్చికం:** కళా, రాజకీయ రంగాలలోని వారికి కొంత అనుకూలంగా వుండును. సంఘంలో ఆదరణ పొందుతారు.

**ధనుస్సు:** సంతానం నూతన విద్యలపై ఆసక్తి చూపుతారు. విందు, వినోదాలు, శుభకార్యాలలో పాల్గొంటారు.

**మకరం:** కుటుంబ సభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు. క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు.

**కుంభం:** మాటల చాతుర్యంతో ఎదుటివారిని ఆకట్టుకుంటారు. బంధువులను కలుస్తారు.

**మీనం :** పాతమిత్రుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు. స్థలాలు కొనుగోలుచేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# సిగ్నల్ ఫ్రీ దిశగా హైదరాబాద్

>> హైదరాబాద్ ప్రజల దాహార్తిని తీర్చేందుకు పీజేఆర్ చేసిన కృషి మరువలేనిదని, ఆయన పోరాటాల వల్లే హైదరాబాద్‌కు కృష్ణా, గోదావరి జలాలు వచ్చాయని అన్నారు. ఎప్పుడు పిలిచినా పలికే పేదల నాయకుడిగా ఎంతో గొప్ప పేరు సంపాదించారని, హైదరాబాద్ దోమలగూడలోని పీజేఆర్ ఇల్లు ఒక జనతా గ్యారేజీగా కనిపించేదన్నారు. 1992లో పీజేఆర్ మంత్రిగా ఉండగా నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా పి.వి.నరసింహారావు ప్రధానిగా, రాజీవ్ గాంధీ టెక్నాలజీ పార్క్ పేరుతో హైటెక్‌సిటీకి అంకురార్పన జరిగిందన్నారు. చంద్రబాబు నాయుడు 98లో దీన్ని హైటెక్ సిటీగా మార్చి, అప్పటి ప్రధాని వాజ్‌పేయ్ సహకారంతో మరోస్థాయికి తీసుకువెళ్లారని అన్నారు. గూగుల్, మైక్రోసాఫ్ట్‌తో పాటు ఫార్చున్ 500 కంపెనీలలో 85 కంపెనీలు శేరిలింగంపల్లిలోనే కార్యాకలాపాలు సాగించడం మనకు గర్వకారణం అన్నారు. సోనియాగాంధీ నేతృత్వంలో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడడం ఈ ప్రాంత అభివృద్ధికి బాటలు వేసిందన్నారు. న్యూయార్క్, టోక్యో వంటి నగరాలతో హైదరాబాద్ పోటీపడుతోందని, ఎంత మంది రాక్షసులు అడ్డుపడినా మా యజ్ఞం ఆగదని, రైజింగ్ తెలంగాణ 2047 లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామన్నారు. కోర్టులో ఉన్న ఆటంకాలను అధిగమించి 400 ఎకరాల కంచ గచ్చిబౌలి భూములను అభివృద్ధి చేయడం ద్వారా 5 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించేందుకు ముందుకు వెళ్తున్నామన్నారు. ఇక్కడ పెట్టుబడుల కోసం తాను దేశదేశాలు తిరగి రెండు లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షిస్తే రాజకీయం కోసం దాన్ని అడ్డుకోవాలని చూడడం దుర్మార్గమైన చర్య అని అన్నారు.

**కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రత్యేక కార్యాచరణ**

హైదరాబాద్ నగరంలో కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టామని, 3వేల డీజిల్ బస్సులను నగరం నుంచి అవుట్ రింగ్ రోడ్డు అవతలకు పంపించి వాటి స్థానంలో మరో 3వేల ఎలక్ట్రిక్ బస్సులను తీసుకురాబోతున్నామని తెలిపారు. గత ప్రభుత్వం నగరంలో ఆటోలని నిషేధించగా తాము సిఎన్‌జి, ఎలక్ట్రిక్ ఆటోలకు సహాయం అందించిందన్నారు. ఎలక్ట్రిక్ వాహనాలపై పన్నును పూర్తిగా రద్దు చేసి కాలుష్య రహిత నగరంగా మార్చేందుకు తొలి అడుగు వేశామన్నారు. నాలాల కబ్జాలను హైడ్రా ద్వారా తొలగించామని తద్వారా నగరాన్ని ముంపు బారి నుంచి కాపాడామన్నారు. సినీ నటుడు నాగార్జున స్వయంగా రెండు ఎకరాల చెరువుని అప్పగించి పర్యావరణానికి తోడ్పడ్డారన్నారు. బతుకమ్మ కుంటను బిఆర్ఎస్ నాయకులు ఆక్రమిస్తే వి.హన్మంత్‌రావు 6 ఎకరాల కుంటను కబ్జా నుంచి కాపాడి ఆడబిడ్డలు బతుకమ్మ ఆడుకునేందుకు అందుబాటులోకి తెచ్చారన్నారు. 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని ప్రపంచంలోనే ఇది గొప్ప నగరంగా రూపుదిద్దుకోనుందని అన్నారు. ఇందులో 15వేల ఎకరాలు పార్కుల కోసమే కేటాయించామని తెలిపారు.

**నాలుగు నియోజకవర్గాలుగా శేరిలింగంపల్లి**

గతంలో పీజేఆర్ ప్రాతినిథ్యం వహించిన ఖైరతాబాద్ దేశంలోనే అతిపెద్ద నియోజకవర్గంగా ఉండేదని, అది 2009లో 7 నియోజకవర్గాలుగా మారిందన్నారు. ప్రస్తుతం శేరిలింగంపల్లి కూడా అదిపెద్ద నియోజకవర్గంగా ఉందని ఇది రానున్న రోజుల్లో మరో నాలుగు నియోజకవర్గాలుగా మారుతుందన్నారు. స్థానిక శాసనసభ్యులు అరికెపూడి గాంధీ ఈ నియోజకవర్గ అభివృద్ధి కోసం శక్తివంచనలేకుండా కృషి చేస్తున్నారని ఆయన ఎలాంటి ప్రణాళికతో ముందుకు వచ్చినా తమ మంత్రివర్గం మొదటి ప్రాధాన్యతను ఇచ్చి నిధులు మంజూరు చేస్తుందని హామీ ఇచ్చారు. స్థానిక నాయకులు ఆయనతో సమన్వయంతో పని చేసి నియోజకవర్గం అభివృద్ధిలో భాగం పంచుకోవాలని సూచించారు. నగర అభివృద్ధిపై తనకు పూర్తి అవగాహన ఉందని గత 45 సంవత్సరాలుగా తాను నగరంలోనే ఉంటూ చదువుకోవడంతో పాటు వ్యాపారం సైతం చేశానన్నారు.

**మోడీ ఏమిచ్చారు?**

తెలంగాణ ప్రజలు బిజెపికి 8మంది ఎంపీలను మరో 8మంది ఎమ్మెల్యేలను ఇస్తే కేంద్రం నుంచి బిజెపి నేతలు ఏం తెచ్చారని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. హైదరాబాద్ అభివృద్ధి కోసం గతంలో పివి నరసింహారావు, మన్మోహన్‌సింగ్, వాజ్‌పేయ్ ప్రత్యేక శ్రద్ధ చూపంచి హైటెక్‌సిటీ, మెట్రో రైల్, అంతర్జాతీయ విమానాశ్రయం, అవుట్‌రింగ్ రోడ్ మంజూరు చేశారని, మోడీ హయాంలో ఒక్క ప్రాజెక్ట్ అయిన వచ్చిందా అని ప్రశ్నించారు. ఈ విషయమై తాను ఎలాంటి శషబిషలకు పోకుండా ఢిల్లీకి వెళ్లిన ప్రతీ సారి కేంద్ర ప్రభుత్వాన్ని కలిసి అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని అభ్యర్థిస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఈ విషయమై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని సైతం తన ఇంటికి వెళ్లి తెలంగాణ అభివృద్ధికి తోడ్పడాలని కోరినా ఫలితం లేకపోయిందన్నారు. ప్రతిపక్షంలో ఉన్న బెంగుళూరు, చెన్నైకి మెట్రో రైలు ఇచ్చారని, గుజరాత్‌కు బుల్లెట్ ట్రైన్‌తో పాటు రెండు లక్షల కోట్ల ప్యాకేజీ ప్రకటించారని హైదరాబాద్ నగరానికి మాత్రం మొండి చేయి చూపారన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు సైతం మెట్రో ఇచ్చిన మోడీ తెలంగాణ మెట్రోకు సహకరించడంలేదని దీంతో మన మెట్రో దేశంలోనే 9వ స్థానానికి పడిపోయిందన్నారు. తాము అడిగిన మూసి రివర్ ఫ్రంట్, రీజనల్ రింగ్ రోడ్, మెట్రో రైలు విస్తరణ కోసం సహకారం అందించమని ఎంతగా అభ్యర్థించినా కిషన్‌రెడ్డికి వినబడడంలేదన్నారు. ఎవరూ అడ్డుపడ్డా హైదరాబాద్ అభివృద్ధి కోసం తమ ప్రభుత్వం కంకణబద్ధంగా పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, మేయర్ విజయలక్ష్మి ౣ, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్‌గౌడ్ తోపాటు స్థానిక కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జూరాలకు ముప్పులేదు..

>> జూరాల ప్రాజెక్టు, ర్యాలంపాడు రిజర్వాయర్‌లను సందర్శించి, జూరాల ప్రాజెక్టు ఏర్పడిన సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ జూరాల ప్రాజెక్ట్ సాంకేతికంగా పూర్తి భద్రంగా కొనసాగుతోందని తెలిపారు. 62 గేట్లలో 58 గేట్లు నిర్విరామంగా పనిచేస్తున్నాయని,తాత్కాలికంగా నాలుగు గేట్లకు రోప్ సమస్య తలెత్తినప్పటికీ,దాని వల్ల ప్రాజెక్ట్‌కి ఎలాంటి ప్రమాదం లేదని తెలిపారు. జూరాల డ్యాంపై నుండి భారీ వాహనాలు వెళ్లడాన్ని పూర్వంలోనే నిషేధించేలా సాంకేతిక నివేదికలు ఇచ్చినప్పటికీ,గత ప్రభుత్వ పాలనలో వాటిని పట్టించుకోలేదన్నారు. కానీ ఇప్పుడు సమస్య తీవ్రతను గుర్తించి,జూరాల ఆవరణలో అల్టర్నేట్ రోడ్,వాహనాల వంతెన కోసం రూ.100 కోట్లు మంజూరు చేయడం జరిగిందని వెల్లడించారు. అంతేకాకుండా, జూరాల, మంజీరా,నాగార్జున సాగర్ వంటి ప్రధాన ప్రాజెక్టులన్నింటికీ రొటీన్ మెయింటెనెన్స్ చేపట్టి భవిష్యత్తులో ఎలాంటి ప్రమాదాలూ జరగకుండా ముందుగానే సాంకేతికంగా సమర్థంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జూరాల ప్రాజెక్టును పూర్తిగా రీస్టోర్ చేసి, వాటి సామర్థ్యాన్ని పెంచే దిశగా డిసిల్టేషన్, సెడిమెంటేషన్ తొలగింపు పనులు చేపడుతున్నామన్నారు.జూరాలకు అదనంగా గ్యాంట్రీ కోసం రూ.300 కోట్ల నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ర్యాలంపాడు రిజర్వాయర్ సామర్థ్యాన్ని నాలుగు టీఎంసీల వరకు పెంచేందుకు వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు.ప్రస్తుతం రెండు టీఎంసీల వరకు మాత్రమే నీరు నిల్వ అవుతుంది,మిగతా రెండు టీఎంసీల సామర్థం అమలు అవుతే రైతులకు గణనీయమైన లాభం చేకూరుతుందని అన్నారు. తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం కింద మల్లమ్మకుంట రిజర్వాయర్‌కు భూసేకరణ పనులను వేగవంతం చేయడమే కాకుండా,జూరాల ఎడమ కాలువ ద్వారా ర్యాలంపాడు రిజర్వాయర్ పనులను త్వరితంగా పూర్తి చేస్తామని తెలిపారు. నెట్టెంపాడు భూసేకరణ కోసం ఇప్పటికే ..25 కోట్లు విడుదల చేశామని ,మిగతా మొత్తం త్వరలోనే ఇవ్వబడుతుందని తెలిపారు. నెట్టెంపాడు ప్రాజెక్టుకు రూ.2051 కోట్లు మంజూరు చేసి పనులను వేగంగా జరిపిస్తున్నామని, డిసెంబర్ 2025 లోపల 100శాతం పూర్తి చేస్తామన్నారు. మానవ వనరుల దృష్టికోణం లోనూ, గత ప్రభుత్వ పాలనలో ఒక్క రిక్రూట్మెంట్ కూడా జరగనప్పుడు,నూతనంగా 11,000 మంది ఇరిగేషన్ ఇంజినీర్లను నియమించడం జరిగింది అనీ, ఇది ఈ ప్రభుత్వ విధేయతకు నిదర్శనమని చెప్పారు. రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడల మరియు యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ జూరాల ప్రాజెక్టు ఎంతమాత్రం ఒడిదుడుకులు వచ్చినా తట్టుకుని నిలబడిన విశ్వసనీయ ప్రాజెక్టు అని పేర్కొన్నారు. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రంతో సమన్వయం జరిపి నిల్వ సామర్థ్యాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్, వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డి, నారాయణపేట ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్,అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



నాగ్‌పూర్‌లోని లా కాలేజీలో బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న సిజెఐ జస్టిస్ బి.ఆర్. గవాయ్, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, మహారాష్ట్ర సిఎం దేవేంద్ర ఫడ్నవీస్ తదితరులు

# సరిహద్దుల్లేని వసుధైక ప్రపంచం


>> స్పేస్‌స్టేషన్‌లో ఉన్న వ్యోమగాముల బృంద కెప్టెన్ శుభాంశు శుక్లాతోమోడీ సంభాషించారు. మోడీతో శుభాంశు మాట్లాడుతూ ఇది కేవలం నా సొంత రోదసీ యాత్రకాదని, నా మాతృభూమి నా భారత దేశ రోదసి యాత్ర అని అన్నారు. కొత్త అనుభవాలు అన్నీ కూడా ఎంతో సున్నితంగా ఉన్నాయన్నారు. గడచిన 41 ఏళ్లలో శుక్లా రోదసిలోకి వెళ్లిన రెండో భారతీయుడుగా రికార్డుకెక్కిన సంగతి తెలిసిందే. 41 ఏళ్లక్రితం 1984లో రాకేశ్ శర్మ ఎనిమిదిరోజులపాటు అంతర్జాతీయ స్పేస్‌స్టేషన్‌లో గడిపారు. కొద్దిసేపటిక్రితం ఐఎస్ఎస్ గవాక్షంనుంచి చూస్తే తాము హవాయిమీదుగా వెళుతున్నట్లు కనిపించిందని, 16 సార్లు సూర్యోద యాలు,సూర్యాస్తమయాలు కూడా వీక్షించామని శుభాంశు మోడీకి వివరించారు. మనదేశం ఎంతో వైభవంగా కనిపిస్తున్నదన్నారు. రోదసిలో ప్రతి అంశం భిన్నమైనదేనని మేం ఒక ఏడాదిపాటు శిక్షణ తీసుకున్నామని, విభిన్న వ్యవస్థలగురించి క్షుణ్ణంగా తెలుసుకున్నామని శుభాంశు చెప్పారు. ఇక్కడకు వచ్చిన తర్వాత అన్నీ మారిపోయాయని, చిన్నచిన్న అంశాలు కూడా భిన్నంగా కనిపిస్తున్నాయని అంతరిక్షంలో సాంద్రత అనేది లేదని ఇక్కడ నిద్రపోవడం ఒక సవాల్ వంటిదని ఈ వాతావరణానికి అలవాటుపడేందుకు మరికొంత సమయం పడుతుందని శుభాంశు మోడీకి వివరించారు. మీరు రోదసిలోకి వెళ్లినవెంటనే చూసిన మొదటి దృశ్యం చెప్పాలన ఇకోరిన మోడీకి తనకు భారత్ ఎంతో గొప్పగా కనిపించిందని, ఎంతో పెద్దదిగా కనిపించిందని అన్నారు. అంతరిక్షంనుంచి భూమిని చూస్తే ఎలాంటి సరిహద్దులు కనిపించవని ఏరాష్ట్రం, ఏదేశం ఉన్నట్లు కనిపించదన్నారు. మనమంతా మానవాళిలోభాగమని, పుడమితల్లి మనకు సొంతిల్లు వంటిదని మనమంతా ఈ భూమిపైనే ఉంటున్నామని శుక్లాచెప్పారు. ఐఎస్ఎస్‌లోని ప్రయోగశాలలోకి శుక్లాతోపాటు ముగ్గురు వ్యోమగాములు ప్రవేశించారు. 28 గంటలప్రయాణం తర్వాత వీరంతా ఐఎస్ఎస్‌లోకి చేరుకుని ఒకరినొకరు హత్తుకుని కరచాలనాలుచేసుకున్నారు. శుభాంశు మాట్లాడుతూ మీ ప్రేమ ఆశీస్సులతోనే మేం ఐఎస్ఎస్‌కు చేరుకున్నామని, ఇక్కడ నిలబడటం సులువుగానే ఉందని, నా తల కొంచెం భారంగా ఉండి కష్టంగా ఉందని, అయితే ఇవన్నీ స్వల్ప సమస్యలేనని కోలుకుంటున్నామని శుభాంసు ఐఎస్ఎస్‌నుంచి ప్రధానిమోడీకి హిందీలో వివరించారు. డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్'గ్రేస్'నుంచి నలుగురు సభ్యుల బహుళదేశాల క్రూ ఐఎస్ఎస్ పరిశోధనలకు వెళ్లినసంగతి తెలిసిందే. స్పేస్ఎక్స్ ఫాల్కన్ రాకెట్‌ఫ్లోరిడాలోని నాసా కెన్నెడీ స్పేస్ సెంటర్‌నుంచి ప్రయోగించిన సంగతి తెలిసిందే. రోదసి యాత్రలో భారత్ సరికొత్త అధ్యాయం లిఖించిందని శుభాంశు మీవల్లనే సాధ్యం అయిందని ప్రధాని అభినందించారు. శుభాంశు స్పందిస్తూ ఇకపై ప్రతిరోజూ మీతో మాట్లాడుతుంటానని చెప్పారు. నేను మువ్వన్నెల జెండాను తీసుకువచ్చానని, అలాగే 140 కోట్ల భారతీయుల ప్రేమను కూడా తెచ్చుకున్నానన్నారు. రానున్న 14 రోజులు కూడా మరింత అద్భుతంగా ఉంటాయని శుభాంశు చెప్పారు. సూక్ష్మసాంద్రత ఉన్న ప్రాంతంలో పసికందు తరహాలో నివసించేందుకు ఇపుడిపుడే అలవాటవుతున్నదని శుభాంశు తొలిరోజు తన సందేశంలో చెప్పిన సంగతి తెలిసిందే.

# 1న బిజెపి రాష్ట్ర అధ్యక్షుని ఎన్నిక

>> అధిష్టానం ఫైనల్ చేయనున్నట్లు సమాచారం. కాగా అధ్యక్ష రేసులో ధర్మపురి అరవింద్, ఈటల రాజేందర్, డా.కె.లక్ష్మణ్, పాయల్ శంకర్, డికె అరుణ ఉన్నారు. కాగా బండి సంజయ్ పేర్లు తాను పోటీలో లేనని గతంలోనే పేర్కొన్నారు. అయితే ఆదివారం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలంగాణకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం బేగంపేటలో పలువురు నేతలతో చర్చించే అవకాశం ఉంది. అయితే ఏ సామాజిక వర్గం అనేది కేంద్ర కమిటీ తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం బిజెపి రాష్ట్ర అధ్యక్షుడిగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కొనసాగుతున్నారు. ఆయన కాలపరిమితి పూర్తయింది. కొత్త అధ్యక్షుడి ఎంపిక జరగాల్సి ఉంది. కానీ గత కొంత కాలంగా జాప్యం అవుతూ వచ్చింది. చివరగా ఆదివారం నోటిఫికేషన్ రానుంది. కాగా ఈ సారి బిసి సామాజిక వర్గం నేతలు ఎక్కువగా పోటీ పడుతున్నారు. ఒబిసి సెల్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్మణ్. ఎంపిలు ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్. బిజెఎల్‌పి డిప్యూటీ నేత పాయల్ శంకర్ అధ్యక్ష రేసులో ఉన్నారు. బండి సంజయ్‌కి పార్టీ అప్పగిస్తారని గతంలో చర్చ వచ్చినప్పుడు దీనిపై స్పందించిన ఆయన తాను రేసులో లేనని ప్రకటించారు. ఈటల రాజేందర్, అరవింద్ పేరు కూడా పరిశీలనకు వచ్చాయి. అయితే అరవింద్. తాను అధ్యక్ష రేసులో లేనని గతంలో ఒకసారి క్లారిటీ ఇచ్చారు. మరి ఈసారి పోటీలో ఉంటారా లేదా అన్నది క్లారిటీ రావాల్సి ఉంది. గతంలో ఈటల రాజేందర్‌కు అధ్యక్ష పదవి ఇస్తారని ప్రచారం కూడా జరిగింది. దాదాపుగా ఫైనల్ అయినట్లుపుకార్లు షికారు చేశాయి. కానీ కొన్ని కారణాల వల్ల ప్రకటించలేదు. తాజా పరిస్థితుల దృష్ట్యా ఈటలకు ఇస్తారా? ఇవ్వరా అన్న అంశం చర్చనీయాంశంగా మారింది. తాజాగా కాళేశ్వరం కమిషన్ విచారణ సందర్భంగా ఈటలచేసిన వ్యాఖ్యలు మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. మీడియాతో కాళేశ్వరం అద్భుతమంటూ కుండ బద్దలు కొట్టారు. దీనిపై పార్టీ స్టాండ్ ఏమిటో కేంద్ర మంత్రి బండి సంజయ్ సహా నేతలంతా వరుసబెట్టి క్లారిటీ ఇస్తున్న నేపథ్యంలో ఈటల వ్యాఖ్యలు సంచలనానికి దారి తీశాయి. కానీ బిసి సామాజిక కాలీన రాజకీయాలపై సంపూర్ణ అవగాహన ఉండటం, వివాద రహితుడిగా పేరుండటం ప్లస్‌గా మారనుంది. వెనుకబడిన ప్రాంతమైన అదిలాబాద్ జిల్లాకు చెందిన నాయకుడిగా ఆయనకు చాన్స్ దక్కొచ్చనే చర్చ కూడా ఉంది. ఇక పోతే సీనియర్ నాయకుడు డాక్టర్ కె.లక్ష్మణ్‌కు అవకాశాలు ఎక్కువని అంటున్నారు.

**నేడు రాష్టానికి ఎన్నికల ఇంచార్జ్ శోభకరంద్లాజే**

బిజెపి రాష్ట్ర అధ్యక్ష ఎన్నికలకు ప్రక్రియ ఆదివారం ప్రారంభం కానుంది. ఇందుకోసం రాష్ట్ర ఎన్నికల ఇన్ చార్జిగా ఉన్న కేంద్ర మంత్రి శోభా కరంద్లాజే హైదరాబాద్ రానున్నారు. ఆదివారం నోటిఫికేషన్ జారీ చేస్తారు. సోమవారం నామినేష్ల ప్రక్రియ ఉంటుంది. ఈ క్రమంలో ఆదివారం రాష్టానికి రానున్నకేంద్ర అమిత్ షా సాయంత్రం బేగంపేట విమానాశ్రయంలో స్టేట్ కౌన్సిల్ సభ్యులతో సమావేశమవుతారని తెలుస్తుంది.



పివి జయంతి సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిఎం రేవంత్

# పివికి నివాళి అర్పించిన సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్28:** మాజీ ప్రధాన మంత్రి,భారతరత్న స్వర్గీయ పి.వి.నరసింహారావు జయంతి సందర్భంగా జూబ్లీ హిల్స్ లోని తన నివాసంలో ఆ మహనీయుడి చిత్రపటానికి ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి శనివారం నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పీవీ నరసింహారావు గారి సేవలను ఆయన గుర్తు చేసుకున్నారు. బహుభాషాకోవిదుడి గా, రచయితగా, ఆర్థిక సంస్కరణల పితామహుడిగా ఆయన దేశానికి ఎనలేని సేవలను అందించారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. భారతావనిని ప్రగతిపథంలో నడిపించడంలో పీవీ పాత్ర ఎనలేనిదని ఈ సందర్భంగా సిఎం గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేంద్ రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి పాల్గొన్నారు



## నేటి నుంచి హిమాచల్‌ప్రదేశ్‌లో కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ సదస్సు

### ఢిల్లీకి వెళ్లిన స్పీకర్ ప్రసాద్‌కుమార్, చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 28:** హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాలలో కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (సిపిఎ) ఇండియా రీజియన్, జోనల్-2 కాన్ఫరెన్స్ జరుగనుంది. 29వ తేదీ నుంచి మూడు రోజులపాటు జరిగే ఈ సదస్సులో పార్లమెంట్ స్పీకర్, రాజ్యసభ చైర్మన్, అన్ని రాష్ట్రాల స్పీకర్లు,మండలి చైర్మన్లు పాల్గొననున్నారు. ఈ సదస్సులో పాల్గొనడానికి శనివారం మధ్యాహ్నం 12 గంటలకు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఢిల్లీకి తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, లెజిస్లేచర్ సెక్రటరీ డా. వి నరసింహా చార్యులు, అధికారులు వెళ్లారు. అక్కడి నుంచి హిమాచల్ ప్రదేశ్‌కు ఆదివారం ఉదయం చేరుకోనున్నారు.

### రైలు పట్టాలపై కారు కేసు

## మెంటల్ ఆస్పత్రికి యువతి

**హైదరాబాద్ (యూసుఫ్‌గూడ), జూన్ 28, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి సమీపంలో రైల్వే ట్రాక్‌పై కారుతో హల్‌చల్ చేసిన యువతిని రైల్వే పోలీసులు ఎర్ర గడ్డ మానసిక ఆసుపత్రిలో అడ్మిట్ చేశారు. యువతి మానసిక స్థితిపై తగిన రిపోర్టు లను తీసుకున్నారు. జూన్ 26న నాగులపల్లి నుంచి శంకర్‌పల్లి వెళ్ళే మార్గంలో రైలు పట్టాలపై కారు నడుపుతూ యువతి హల్ చల్ చేసిన విషయం అందరికి తెలిసిందే ఈ మేరకు యువతిపై రైల్వే పోలీసులు కేసు నమేదు చేసి ఉస్మానియా ఆసుపత్రిలో వైద్య పరీక్షలు అనంతరం కోర్టులో హాజరుపరిచారు. ఆ తర్వాత కోర్టు అనుమతితో యువతి మానసికస్థితిపై రిపోర్టు కోసం ఎర్రగడ్డలోని మానసిక ఆసుపత్రికి తరలించారు. యువతి మెంటల్ స్టేటస్‌పై క్లారిటీ వచ్చాక తిరిగి రైల్వే కోర్టులో పోలీసులు ప్రవేశపెట్టనున్నారు. భర్తతో విడిపోవడంతో, తల్లిదండ్రులకు సహకరించకపోవడం ఉద్యోగం కూడా పోవడం మూలంగా మానసికంగా కుంగిపోయి ఆమె ఇలా ప్రవర్తించి ఉండవచ్చని వైద్యులు తెలుపుతున్నారు. ప్రస్తుతం ఆమెతో తల్లిదండ్రులు ఉన్నారని ఆమె మానసికపరిస్థితి గురించి అపుడే ఏమి చెప్పలేమని పేర్కొన్నారు.

## వచ్చే ఎన్నికల తర్వాత జన్ సురాజ్ పార్టీ నుంచే సిఎం

### మళ్లీ నితీష్‌కుమార్ సిఎం కాలేరు.. ప్రశాంత్‌కిశోర్

**పాట్నా, జూన్ 28:** బీహార్‌లో 60 శాతం మంది ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, ఈ ఏడాది ఎన్నికలు పూర్తయిన తర్వాత జనతాదళ్ యునైటెడ్ పార్టీ అధినేత నితీష్‌కుమార్ మరోసారి ముఖ్యమంత్రి కాలేరని ఎన్నికల



వ్యూహకర్త జన్‌సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్‌కిశోర్ అంచనావేసారు. నితీష్ మళ్లీ సీఎం కాలేరని తాను రాతపూర్వకంగా రాసిస్తానని ఆయన ఘంటాపథంగా చెప్పారు. తాను ముఖ్యమంత్రి పదవి రేసులో ఎప్పుడూ లేనని తన పార్టీ ఇప్పటికే బీహార్‌లో పటిష్టంగా ఉందని, ఎన్నికల జాబితాల సవరణ జరుగుతున్నతరుణంలో ఈ జాబితాలు మరింత పారదర్శకంగా జరగాలని తాను కోరుకుంటున్నట్లు తెఇపారు. అంతకుముందు జనతాదళ్, బిజెపి, టిఎంసిలతోకలిసి పనిచేసిన ప్రశాంత్‌కిశోర్ తన సర్వేటీమ్ చేసిన పరిశీలనలో 62శాతం మంది బీహార్‌ప్రజలు మార్పుకోరుకుంటున్నారని అన్నారు. ఎటొచ్చీ తన పార్టీకి ఓటువేస్తారా లేక లాలూప్రసాద్‌యాదవ్ రాష్ట్రీయజనతాదళ్‌కు ఓటువేస్తారా అన్నదే ముఖ్యమని అన్నారు. వచ్చే రెండునెలల్లోనే ఇది కీలక నిర్ణయంగా మారబోతున్నదన్నారు. ఇప్పటికే రెండు పర్యాయాలు ప్లేటు ఫిరాయించిన నితీశ్‌ను ఈసారి విశ్వసిస్తారా అన్నది సందేహమేనన్నారు. కొత్తప్రత్యామ్నాయాన్ని కోరుతున్నారని అన్నారు. నవంబరు తర్వాత అంటే ఎన్నికలు పూర్తయ్యాక నితీష్‌కుమార్ ఎట్టిపరిస్థితుల్లోను సీఎంగా ఉండరని, బీహార్‌కు కొత్త ముఖ్యమంత్రి వస్తారని ప్రశాంత్‌కిశోర్ అన్నారు. ఈసారి ఎన్నికల్లో జెడియు 25 స్థానాలకు మించి గెలవలేదని, మొత్తం 243 స్థానాల్లోకూడా జెడియు వస్తే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని ధీమా వ్యక్తంచేసారు. మీరు రాసిపెట్టుకోండి జనతాదళ్ సొంతబలంమీద కేవలం 25 కంటే తక్కువసీట్లే గెలుస్తుందని అన్నారు. ఎన్నికల తర్వాత జెడియు పరిస్థితిప్రశ్నార్థకం అవుతుందని, నితీష్‌కుమార్‌ను ఆమోదించే ప్రజల రేటింగ్ తగ్గిపోతున్నాని, 60శాతంనుంచి 16 లేదా 17 శాతానికి పడిపోయిందన్నారు. అలాగే వచ్చే సీఎం మాజీ డిప్యూటీసీఎగా ఉన్న తేజస్వి యాదవ్ కూడా కాబోరని బీహార్‌కు వచ్చే ముఖ్యమంత్రి జన్‌సురాజ్‌పార్టీనుంచే అవుతారని ఆయన చెప్పారు. అయితే తాను మాత్రం సీఎం కాబోనని అన్నారు. ఆరేసులో తాను లేనని తాను రాజకీయాల్లోకి వచ్చింది ముఖ్యమంత్రి కావడానికి కాదని, జన్‌సురాజ్ నా తండ్రిపార్టీ ఏమీకాదని, తాను ఆపార్టీకి రాష్ట్ర, లేదా జాతీయ అధ్యక్షుడిని కూడా కాదని బీహార్ వ్యవస్థల్లో మార్పుకోసం తానురాజకీయాల్లోకి వచ్చానని జన్‌సురాజ్ అధినేత అన్నారు. వచ్చేఎన్నికల్లో జెడియు నలందా స్థానం కూడా కోల్పోతుందన్నారు. 1.25 కోట్లమంది ఇప్పటివరకూ జన్‌సురాజ్ పార్టీలో చేరానని, తాను ఎప్పటికీ కింగ్‌మేకర్‌నేనని, బీహార్ ప్రజలను దారిద్ర్యరేఖ నుంచి విముక్తిచేయడమే తన లక్ష్యమన్నారు. బీహార్‌మరింత వృద్ధిలోకి రావాలన్నదే తన అభిమతం అన్నారు.

## విత్తన చట్టం డ్రాఫ్ట్ రూపకల్పన

### విత్తన చట్టం ముసాయిదా కమిటీ కసరత్తు

**హైదరాబాద్, జూన్ 28, ప్రభాతవార్త :** తెలంగాణలో సమగ్ర విత్తన చట్టాన్ని తీసుకొచ్చేందుకు గాను అందుకు అవసరమైన ముసాయిదా చట్టాన్ని సిద్ధం చేసేందుకు విత్తన చట్టం ముసాయిదా కమిటీ కసరత్తు చేస్తోంది. హైదరాబాద్ బషీర్‌బాగ్ లోని వ్యవసాయ శాఖ కమిషనరేట్ కార్యాలయంలో విత్తన చట్టం ముసాయిదా కమిటీ సమావేశమైంది. కమిటీ కన్వీనర్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో విత్తన చట్టం డ్రాఫ్ట్ ఎలా ఉండాలి, ఏ ఏ అంశాలను ఏ విధంగా చేర్చాలి తదితర అంశాలపై చర్చించింది. తెలంగాణాలో సమగ్రమైన విత్తన చట్టం తీసుకొచ్చే క్రమంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఏ ఏ అంశాలు ఉండాలి. డ్రాఫ్ట్. ఎలా ప్రిపేర్ చేయాలనే అంశాలను ఇందులో పాల్గొన్న సభ్యులు చర్చించారు.

ఈ నెల 30వ తేదీన మరోసారి కమిటీ సభ్యులు సమావేశమై డ్రాఫ్ట్ ప్రిపరేషన్ పై నిర్ణయం తీసుకోనున్నారు. అవసరమైతే విత్తన రంగంలో అనుభవం ఉన్న వారి అభిప్రాయాలు, సలహాలు సూచనలు తీసుకోవాలని అభిప్రాయ పడ్డారు. కాగా ఇప్పటికే విత్తన చట్టంపై రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన రైతుల నుండి ముసాయిదా కమిటీ అభిప్రాయాలను సేకరించింది. ఇందులో భాగంగా విత్తన కమిటీ వరంగల్, హనుమకొండ, ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్, గద్వాల్, నిజామాబాద్ జిల్లాలో పర్యటించింది. ఆయా జిల్లాలోని గ్రామాల్లో రైతుల నుండి అభిప్రాయలను సేకరించింది.

తదుపరి వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు, విత్తన కంపెనీలు, డీలర్లతో సమావేశమై వాటి నుండి సలహా, సూచనలు తీసుకుంది. ఇటీవలే విత్తన చట్టం రూపొందించే పనిలో భాగంగా హర్యానాకు స్టడీ టూర్ పై కమిటీ వెళ్లివచ్చింది. అక్కడ విత్తన చట్టం అమలవుతున్న తీరుపై, రైతుల అభిప్రాయాలు, అక్కడి చట్టంలోని అంశాలపై అధ్యయనం చేశారు.

# యాంకర్ స్వేచ్ఛది బలవన్మరణం కాదు.. హత్య?

తల్లిదండ్రుల ఆరోపణ

కుమార్తె మృతికి పూర్ణచందర్‌రావే కారణమంటున్న స్వేచ్ఛ తండ్రి శంకర్

పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని ఫిర్యాదు

దర్యాప్తు చేస్తున్న పోలీసులు



స్వేచ్ఛ (ఫైల్)

**హైదరాబాద్ (చిక్కడపల్లి), జూన్ 28, ప్రభాతవార్త:** ప్రముఖ తెలుగు న్యూస్‌ఛానల్ యాంకర్ స్వేచ్ఛ వోటార్కర్ (40) ఆత్మహత్య కేసులో సంచలన విషయాలు వెలుగు లోకి వచ్చాయి. ఆమె ఆత్మహత్య వెనుక వేరే కారణాలు ఉన్నట్టుగా సమాచారం. భర్తతో డ్రైవర్స్ తీసుకున్న స్వేచ్ఛ వేరే వ్యక్తితో కలసి ఉంటున్నట్లు, వాళ్ల మధ్య నెలకొన్న వివాదాలే సూసైడ్కు కారణంగా తెలుస్తోంది. సదరు టీవీ చానల్లో కీలకమైన హోదాలో ఉన్న పూర్ణచంద్రరావు వ్యవహార శైలితోనే స్వేచ్ఛ మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. కేసును దర్యాప్తు చేస్తున్న చిక్కడపల్లి పోలీసులు స్వేచ్ఛ మొబైల్ ఫోన్లను సీజ్ చేశారు. ఆ మొబైల్ ఫోన్లలో కీలక సమాచారం ఉన్న సమాచారం. ఆమె ఆత్మహత్య వెనుక వేరే కారణాలు ఉన్నట్టుగా సమాచారం. భర్తతో డ్రైవర్స్ తీసుకున్న స్వేచ్ఛ వేరే వ్యక్తితో కలసి ఉంటున్నట్లు, వాళ్ల మధ్య నెలకొన్న వివాదాలే ఆత్మహత్యకు కారణంగా తెలుస్తోంది. సదరు టీవీ చానల్లో కీలకమైన హోదాలో ఉన్న పూర్ణచంద్రరావు వ్యవహార శైలితోనే స్వేచ్ఛ మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. తన కుమార్తె మృతికి ఆమెతో పాటు సహజీవనం చేస్తున్న పూర్ణచంద్రరావు అనే వ్యక్తే కారణమంటూ స్వేచ్ఛ తండ్రి తెలంగాణ శంకర్ ఆరోపించారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి, మానసికంగా వేధించడం వల్లే ఆమె తీవ్ర నిర్ణయం తీసుకుందని ఆయన ఆరోపించారు. ఈ మేరకు చిక్కడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని జవహర్ నగర్‌లోని తన నివాసంలో శుక్రవారం రాత్రి పదకొండు గంటల సమయంలో స్వేచ్ఛ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఐదేళ్ల క్రితం భర్త నుంచి విడాకులు తీసుకున్న ఆమె, తన కుమార్తెతో పాటు పూర్ణచంద్రరావు అనే వ్యక్తితో కలిసి ఉంటున్నారు. 'భర్తతో విడిపో యాక నా కూతురు పూర్ణ చంద్రరావు తోనే ఉంటోంది. పెళ్లి చేసుకుంటానని మాటిచ్చి సహ జీవనం ప్రారంభిం చాడు. పెళ్లి ప్రస్తా వన తెచ్చి నప్పు డల్లా కాలయాపన చేస్తూ వచ్చాడు. ఈ విషయంలో ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరిగేవి' అని ఆయన పోలీసులకు వివరిం చారు. స్వేచ్ఛ ఉరి వేసుకుని చనిపోదని, అంత పిరికిది కాదని, పూర్ణ చందర్ నాయక్ చంపి ఆత్మహత్య గా చిత్రీకరిస్తున్నట్లు ఆమె తండ్రి శంకర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇసుకలో అక్రమంగా డబ్బులు సంపాదించారని, అతనికి అంతకు ముందే పెళ్లి అయిందని, కానీ, విడాకులు తీసుకున్నట్లు అబద్ధం చెప్పి, అప్పటికే విడాకులు తీసుకుని వున్న స్వేచ్ఛతో కలిసి జవహర్ నగర్ పెంట్ హౌస్ లో సహజీవనం సాగించడం ప్రారంభించాడని వివరించారు. కెసిఆర్ దగ్గర బిజీ గా ఉన్నందువల్ల అప్పుడప్పుడు ఇంటికి వస్తున్నట్లు స్వేచ్ఛ కు చెప్పినట్లు తండ్రి శంకర్ చెబుతున్నారు. రెండు రోజుల క్రితం తమ కుమార్తె తనకు ఫోన్ చేసి పూర్ణచందర్‌తో పాటు తాను విడిపోతున్నాం, వెంటనే ఇంటికి రావాలని చెప్పిందని, తొందరగా వస్తా అని చెప్పగా, వెంటనే రావాలని చెప్పడంతో వెళ్ళడం జరిగిందని, మొత్తం తెలుసుకున్నాని, పూర్ణచందర్‌తో స్వేచ్ఛ సహజీవనం చేసిన రోజు వరకు అతడిని చూడలేదని, అంటే జూన్ 26 నాటికి వరకు అతడి మొహం తెలియదని స్వేచ్ఛ తండ్రి శంకర్ వివరించారు. స్వేచ్ఛ శరీరంపై కొట్టిన దెబ్బలు ఉన్నాయని, . గొంతు పిసికే ప్రయత్నం చేసినట్లు ఆనవాళ్ల కనిపిస్తున్నాయని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ముక్కు నుంచి రక్తం ఎక్కువగా కారినట్లు తెలుస్తోంది. ఉరి వేసుకున్నట్లు వున్న విధానం చూస్తే మోకాళ్ల ఎత్తులో కూడా లేని ఫ్యాన్‌కు ఆమె కాళ్లు వెనక్కి మడచి లుంగీతో ఉరి వేసినట్లు అనిపిస్తోంది. గత కొంతకాలంగా పూర్ణచందర్‌రావు, స్వేచ్ఛ మధ్య గొడవలు జరుగుతున్నాయని తల్లి శ్రీదేవి చెప్పారు. మూడు రోజుల క్రితం ఇద్దరూ కలిసి వున్న ఫోటోను స్వేచ్ఛ ఇన్‌స్టాగ్రామ్‌లో తొలిసారిగా పోస్ట్ చేయడంతో గొడవలు కొట్టుకునే స్థాయికి వెళ్లాయని, పూర్ణచందర్‌రావు పెళ్లి విషయం, మొదటి భార్యతో ఉంటున్న విషయం బయట పడిందని, మూడు రోజులు సెలవు కావాలి రీఛార్జ్ కోసం అని స్వేచ్ఛ సెలవు తీసు కున్నట్లు తెలిసింది. తీరా శాశ్వత సెలవుగా మారిపోవడంతో ఆమె సన్నిహితులు జీర్ణించుకోలేకపోతున్నారు. వెంటనే పూర్ణచందర్‌రావుపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. తండ్రి ఫిర్యాదు ఆధారంగా పోలీసులు పూర్ణచంద్రరావుపై కేసు నమోదు చేసి, విచారణ ప్రారంభించారు.

### చాలా స్ట్రాంగ్గా ఉండాలని చెప్పేది : స్వేచ్ఛ కూతురు సేన అరణ్య

'మా అమ్మ నాకెప్పుడూ చాలా స్ట్రాంగ్‌గా ఉండాలని చెప్పేదని యాంకర్ స్వేచ్ఛ కూతుర్తె సేన అరణ్య చెప్పింది. ఆమె ఇవాళ మీడియాతో ఎవరినీ నమ్మొద్దు అని నాకు చెప్పేది అని' గుర్తు చేసింది. ప్రతి రోజు అమ్మ నాకు హగ్ ఇచ్చి స్కూల్‌కు పంపించేది. రోజూలాగే శుక్రవారం కూడా నాకు హగ్ ఇచ్చి స్కూల్ కి పంపించిందని, నేను స్కూల్ నుంచి తిరిగి వచ్చే సరికి అమ్మ ఫ్యాన్‌కు వేలాడి ఉందని వివరించింది.

### స్వేచ్ఛ మొబైల్‌ఫోన్ సీజ్.. అందులోనే కీలక సమాచారం

ఆత్మహత్య ఘటన దర్యాప్తులో భాగంగా పోలీసులు స్వేచ్ఛ చివరగా ఎవరితో మాట్లాడింది, మెసేజ్ చేసిందనే విషయాలపై ఆరా తీస్తూనే ఆమె ఫోన్లో ఉన్న సమాచారాన్ని మొత్తాన్ని పరిశీలించే పనిలో పడ్డారు. పోలీసులు దర్యాప్తు నేపథ్యంలో వారి తల్లిదండ్రుల స్టేట్‌మెంట్‌లను రికార్డు చేశారు. పనిలోపనిగా స్వేచ్ఛ కుమార్తె నుండి కూడా చిక్కడపల్లి పోలీసులు స్టేట్ మెంట్ ను రికార్డు చేశారు.

### పోలీసుల చేతిలో స్వేచ్ఛ సూసైడ్ నోట్?

అయితే కొన్ని నెలలుగా ఆమె మానసిక పరిస్థితి క్షీ ణిం చినట్లు.. ఆమె సన్నిహితులు చెబుతున్నారు. వ్యక్తిగత జీవితం, పని ఒత్తిడి ఆమెను తీవ్ర నిరాశలోకి నెట్టినట్లు ప్రాథమిక సమాచారం. స్వేచ్ఛ రాసిన సూసైడ్ నోట్ ఒకటి పోలీసులకు లభించినట్లు తెలుస్తోంది. అందులో తన మానసిక పరిస్థితిని వివరిస్తూ, బాధలను ఎవరికీ చెప్పుకోలేక ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె పేర్కొన్నట్లు సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

### స్వేచ్ఛ తండ్రి ఫిర్యాదు ఆధారంగా దర్యాప్తు చేస్తున్నాం:చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ రాజూనాయక్

స్వేచ్ఛ తండ్రి శంకర్ ఇచ్చిన ఫిర్యాదును స్వీకరించామని, ఆ దిశగా దర్యాప్తు చేస్తు న్నట్లు చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ రాజూనాయక్ తెలిపారు. స్వేచ్ఛ చివరగా ఎవరెవరితో మాట్లాడింది, వాట్సాప్ సమాచారం, ఇతర అంశాల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

### అంబర్‌నగర్ శ్మశానవాటికలో అంత్యక్రియలు

కాగా అంబర్‌నగర్ శ్మశానవాటికలో స్వేచ్ఛ అంత్యక్రియలు నిర్వహించారు. ముషీరా బాద్‌లోని వైఎస్‌ఆర్ పార్కు సమీపంలోగల స్వేచ్ఛ తల్లిదండ్రులు శంకర్, శ్రీదేవిల ఇంటి వద్దకు పెద్దఎత్తున ప్రముఖులు చేరుకుని నివాళులు అర్పించారు. ఎమ్మెల్యేలు ముఠాగోపాల్, వేముల వీరేశ్, కాలేరు వెంకటేష్, మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే క్రాంతి, తెలంగాణ మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్ భోభారాణి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్వెస్లీ, సీపీఐఎంఎల్ నాయకులు గోవర్ధన్, ప్రదీప్, విరసం విమలక్క, గోరేటి వెంకన్న, పీవోడబ్ల్యూ సంధ్య, ప్రెస్‌అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, మాజీ ఎడిటర్ కె. శ్రీనివాస్, పక్షం ఎడిటర్ వేణుగోపాల్, సజయ, విరాత్‌అలీ, సోమయ్య, ఖాదర్ తదితరులు స్వేచ్ఛ భౌతికకాయ వద్ద నివాళులర్పించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, రాష్ట్ర నాయకులు డిజి నర్సింహారావు, టి. స్కైలాబ్బాబు, జె.బాబూరావు, కోట రమేష్లతో కూడిన ప్రతినిధి బృందం మృతదేహానికి నివాళులర్పించింది. ఆమె మరణంపట్ల అనేక ఆరోపణలు వస్తున్నందువల్ల సమగ్ర విచారణ జరిపి నిజానిజాలు వెలికితీయాలని, అందుకు కారణమైనవారిని కఠినంగా శిక్షి ంచాలని డిమాండ్ చేశారు.

# విద్యుత్ ప్రాజెక్టుల్లో వేగం పెంచాలి

### యూనిట్ల పర్యవేక్షణకు డ్యాష్ బోర్డు

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్, జూన్ 28, ప్రభాతవార్త :** సింగరేణి సంస్థ చేపట్టనున్న విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సూచించారు. సంస్థ ద్వారా 800 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లు, 500 మెగావాట్ల పవన విద్యుత్తు ప్లాంట్, 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ పవర్ ప్లాంట్ నిర్మాణానికి కాల పరిమితిని విధించుకొని సత్వరమే వాటిని చేపట్టాలన్నారు.

హైదరాబాద్‌లో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ లోయర్ మానేరు డ్యాం రిజర్వాయర్‌పై 300 మెగావాట్లు, మల్లన్న సాగర్‌పై 500 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్‌లకు గాను అవసరమైన అనుమతులకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. అలాగే రాష్ట్రంలోని ఐదు జిల్లాలలో సింగరేణి తలపెట్టిన 500 మెగావాట్ల పవన విద్యుత్తు ప్లాంట్లకు సంబంధించిన డిపిఆర్ లను వచ్చే నెలాఖరుకల్లా పూర్తి చేయాలన్నారు.

రామగుండం1 ఏరియాలో నిర్మించ తలపెట్టిన 500 మెగావాట్ల పంపుడ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్ నిర్మాణం పనులు తక్షణమే చేపట్టాలని ఆదేశించారు. అలాగే రాజస్థాన్ విద్యుత్ ఉత్పాదన్ నిగం లిమిటెడ్ తో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు 1500 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్‌ను అక్కడ త్వరితగతిన ఏర్పాటు చేయాలన్నారు. ఈ ఒప్పందంలో భాగంగా ఏర్పాటు చేసే 800 మెగావాట్ల థర్మల్ ప్రాజెక్టు ఏర్పాటుపైనా కూలంకశంగా చర్చించారు. రాజస్థాన్ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు వీలుగా ఈ అంశాన్ని వీలైనంత త్వరగా క్యాబినెట్లో ప్రవేశపెట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

ఈ ప్లాంట్ లతో పాటు, సింగరేణి ఏర్పాటు చేయనున్న గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్, బ్యాటరీ స్టోరేజీ సిస్టం వంటి ఇతర పనులు, ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షి ంచేందుకు వీలుగా డాష్ బోర్డును రూపొందించాలని పేర్కొన్నారు. సింగరేణి సీఎండీ ఎన్ . బలరామ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సంస్థ చేపట్టనున్న సోలార్, ఫ్లోటింగ్ సోలార్, పునరుత్పాదక ప్రాజెక్టులకు సంబంధించి వివరించారు. సింగరేణి సంస్థ ఈ ప్రాజెక్టుల ద్వారా సుమారు 7 వేల మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేయాలనుకుంటుందని చెప్పారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం నుండి రాష్ట్ర ప్రభుత్వ శాఖల నుండి పలు రకాల అనుమతులు ఇప్పించవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్ తదితరులు పాల్గొన్నారు.

### సింగరేణి ప్రమాద బీమా దేశానికి ఆదర్శం

సింగరేణిలో అమలు జరుపుతున్న ఉచిత ప్రమాద బీమా పథకం దేశానికే ఆదర్శమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఇటీవల ప్రమాదంలో మృతి చెందిన సింగరేణి కార్మికుని కుటుంబానికి రూ.1.20 కోట్ల బీమా సొమ్ము చెక్కును అందజేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రామగుండం 1 ఏరియాకు చెందిన సపోర్టుమెన్ పెంద్రి రంజిత్ కుమార్ భార్యకు హైదరాబాద్‌లో శనివారం ఆయన ఈ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మృతుని కుటుంబానికి త్వరలో కారుణ్య నియామక పత్రాలు అందచేస్తామని తెలిపారు.

సింగరేణి సంస్థలో అమలు జరుపుతున్న రూ.1.2 కోట్ల ప్రమాద బీమా పథకం ప్రభుత్వ రంగ సంస్థలకే గాక అన్ని రాష్ట్రాలకు ఆదర్శప్రాయమైందన్నారు. అనుకోని ప్రమాదంలో కార్మికుడు మృతి చెందినట్లయితే అతని కుటుంబం వీధిన పడకుండా ఆర్థిక భరోసా కల్పించడం కోసం ఈ పథకాన్ని అమలు చేయడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్, రెడ్కో వైస్ ఛైర్మన్, ఎండీ శ్రీమతి ఆనీలా తదితరులు పాల్గొన్నారు.




## దివ్యాంగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

### ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

**హైదరాబాద్, జూన్ 28, ప్రభాతవార్త:** అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలప్రకారం వికలాంగుల పెన్షన్ 6000, ఇతర ఆసరా పెన్షన్లు 4000, తీవ్ర వైకల్యం గల వికలాంగులకు 15000/లు వెంటనే అమలు చేయాలని ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు మందకృష్ణమాదిగ అన్నారు. ఈమేరకు శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎఐసిసి ఎన్నికల హామీ ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలలో వికలాంగులకు వెంటనే రాజకీయ రిజర్వేషన్ ప్రకటిస్తూ చట్ట సవరణ ఆర్డినెన్స్ ఆదేశాలు జారీ చేయాన్నారు. అలాగే అన్ని ప్రభుత్వ శాఖలు, సంస్థలలో చట్ట ప్రకారం క్యాడర్ స్ట్రేంత్ ప్రకారం4 శాతం ఉద్యోగాల భర్తీ చేసి వికలాంగుల రోస్టర్ సంఖ్యను 10లోపు సవరించాలన్నారు. అదేవిధంగా యాదగిరి గుట్ట దేవస్థానం ఆధ్వర్యంలో తిరుపతి మాదిరిగా వికలాంగులకు ప్రత్యేకంగా ఆసుపత్రి, శిక్షణా, ఉత్పత్తి పునరావాస సదనాలు ఏర్పాటు చేయాలని ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వికలాంగుల స్వయం సహాయక సంఘాలను అన్ని జిల్లాలలో ఏర్పాటు చేసి పాత సంఘాలను బలోపేతం చేయాలన్నారు. రాష్ట్రంలో ఉన్న వికలాంగులైన అంగన్వాడి టీచర్లు, ఆయాలకు వికలాంగుల పెన్షన్ వర్తింప చేసి ప్రభుత్వ ప్రత్యేక అలవెన్స్ ఇవ్వాలన్నారు. అలాగే అన్ని జిల్లాలో మూసివేయబడ్డ టిసి,పిసిలను పునరుద్ధరంలని వికలాంగులకు అన్ని సంక్షేమ పథకాలలో 6 లక్షల కనీస ఆదాయ పరిమితి పెట్టాలని వికలాంగులకు ఇంటి స్థలం కేటాయించి, ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

### ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం


# ఎమ్మెల్సీ కవిత పిఎకు సిట్ నోటీసులు

**హైదరాబాద్, జూన్ 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో బిఆర్ఎస్ ఎ ంఎల్సి కవిత పిఎ ఒకరు ఫోన్ ట్యాపింగ్‌లో కీలక నిందితుడైన ఎస్ఐబి మాజీ డిఎస్పి దుగ్యాల ప్రణీత్‌రావుతో సంబంధాలున్నట్లు సిట్ అధికారులకు ఆధా రాలు లభించినట్లు తెలిసింది. కవిత పిఎ గతంలో ప్రణీత్ రావుతో మాట్లాడిన సంభాషణల తాలూకు వీడియోలు సిట్ అధికారులకు లభించడంతో ఆయనకు తాజాగా నోటీసులు జారీ చేశారు. సోమవారం నాడు కవిత పిఎను సిట్ అధికారులు విచారించే వీలుంది.

ఫోన్ ట్యాపింగ్ కేసులో అప్పట్లో నాలుగు వేల 200కు పైగా ఫోన్లను ప్రభాకర్ రావు నేతృత్వంలోని ఎస్ఐబి బృందం ట్యాపింగ్ చేసినట్లు సిట్‌కు ఆధారాలు లభించాయి. ఇందులో 618 నంబర్లు అప్పట్లో ప్రతిప క్షంలో వున్న ప్రముఖులవి కాగా మరో వంద మంది బిఆర్ఎస్‌లో వుంటూ అసమ్మతి గళం విప్పిన వారివిగా తేలింది.

వీరిలో 265 మంది వాంగ్మూలం ఇప్పటి వరకు నమోదు చేసిన సిట్ అధికారులు వచ్చే రెండు వారాల్లో అందరి నుంచి వాంగ్మూలం తీసుకునే వీలుంది. వాంగ్మూలం ఇచ్చిన వారిలో పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ ఎంఎల్‌సి బల్మూరి వెంకట్, బిజెపి ఎంపిలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రఘునందన్ రావు సహా రెండు పార్టీలకు చెందిన వారు వున్నారు. బిజెపి ఎంపిలు ధర్మపురి అర్వింద్ సహా మరికొందరు పార్టీ నాయకులు వాంగ్మూలం నమోదు కావాల్సి వుంది. దీంతో పాటు బిఆర్ఎస్ నాయకుల వాంగ్మూలం ఇంకా నమోదు చేయలేదు. కాగా ఈ కేసులో తాజాగా సిట్‌కు లభించిన కీలక సమాచారంలో ప్రణీత్‌రావుతో కవిత పిఎ ఒకరు గతంలో పలుమార్లు ఫోన్ ట్యాపింగ్‌పై మాట్లాడినట్లుగా వుందని తెలిసింది. ఈ క్రమంలోనే ఆయనకు సిట్ అధికారులు నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. కవిత పిఎను విచారించిన తరువాత ఈ కేసులో బిఆర్ఎస్‌కు చెందిన మరికొందరిని సిట్ విచారించే వీలుందని తెలిసింది.

## 'కాంటా లగా' నటి షఫాలీ జరివాలా అనుమానాస్పద మృతి



**ముంబయి, జూన్ 28:** ఒకప్పటి సెన్సేషనల్ సాంగ్ 'కాంటా లగా'తో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న నటి షఫాలీ జరివాలా (42) ఆకస్మిక మరణం తీవ్రకలకలం రేపుతోంది. ఆమె గుండె పోటుతో మరణించారని తొలుత వార్తలు వచ్చినా, ఈ ఘటనపై తాజాగా ముంబయి పోలీసులు స్పందించడంతో కేసు కీలక మలుపు తిరిగింది. షఫాలీ మరణాన్ని అనుమానాస్పద మృతిగా పరిగణిస్తున్నామని, అసలు కారణాలు ఇంకా తెలియరాలేదని ప్రకటించారు. అర్ధరాత్రి సుమారు ఒంటిగంట సమయంలో తమకు సమాచారం అందిందని, వెంటనే అంధేరిలోని షఫాలీ నివాసానికి చేరుకున్నామని తెలిపారు. 'మేము ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించాం. అనంతరం పోస్ట్‌మార్టం నిమిత్తం కూపర్ ఆస్పత్రికి తరలించాం. ఆమె మరణానికి దారితీసిన కచ్చితమైన కారణాలపై ఇంకా స్పష్టత రాలేదని పోలీసులు వెల్లడించారు. ప్రస్తుతం ఫోరెన్సిక్ నిపుణులు షఫాలీ అపార్ట్‌మెంట్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. అదే సమయంలో పోలీసులు ఆమె ఇంట్లో పనిచేసే సిబ్బందిని, వంట మనిషిని ప్రశ్నిస్తున్నారు. ముందురోజు షఫాలీ అస్వస్థతకు గురవడంతో ఆమె భర్త పరాగ్ త్యాగీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే, కుటుంబసభ్యులు ఆమె మరణంపై ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. 'రాత్రి 11:15 గంటలకు షఫాలీని ఆస్పత్రికి తీసుకొచ్చారు. కానీ, అప్పటికే ఆమె ప్రాణాలు కోల్పోయిందని ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. మరోవైపు ఈ ఉదయం షఫాలీ భర్త పరాగ్ త్యాగీ తమ పెంపుడు శునకంతో అపార్ట్‌మెంట్ బయట నడుస్తూ కనిపించడం గమనార్హం. 2002లో విడుదలైన 'కాంటా లగా' రీమిక్స్ వీడియో సాంగ్‌తో షఫాలీ జరివాలా ఒక్క రాత్రిలోనే స్టార్‌గా ఎదిగారు. యువతలో ఆమెకు విపరీతమైన క్రేజ్ వచ్చింది. ఆ తర్వాత సల్మాన్ ఖాన్ నటించిన ముజ్సే షాదీ కరోగి చిత్రంలో చిన్న పాత్రలో మెరిశారు. పలు టెలివిజన్ రియాలిటీ షోలలో పాల్గొన్న ఆమె, హిందీ బిగ్‌బాస్ సీజన్ 13లోనూ పోటీదారుగా అడుగుపెట్టారు. వ్యక్తిగత జీవితంలో ఆమె మొదట మ్యూజీషియన్ హర్మీత్‌సింగ్‌ను వివాహం చేసుకుని, ఆ తర్వాత విడిపోయారు. అనంతరం నటుడు పరాగ్ త్యాగీని పెళ్లి చేసుకున్నారు. షఫాలీ మృతికి అసలు కారణం పోస్ట్ మార్టం నివేదిక వస్తేనే తేలనుంది. పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు.

ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఖరగ్‌పూర్

ప్రకటన నం.: R/05/2025 తేదీ జూన్ 12, 2025

పోస్ట్ డాక్టరల్ ఫెలో (PDF) యొక్క

స్థానానికి పై ఇనిస్టిట్యూట్ ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

విద్యార్హత, వయస్సు సంబంధిత వివరాలకు మరియు అప్‌డేట్స్‌కు http://www.iitkgp.ac.in వీక్షించండి.

ఆన్‌లైన్ దరఖాస్తు యొక్క చివరి తేదీ : 31.07.2025

రిజిస్ట్రార్

CBC 21255/12/0007/2526

DEBTS RECOVERY TRIBUNAL-II HYDERABAD

(1st Floor, Triveni Complex, Abids, Hyderabad-500001)

OA No.400 of 2025

Summons under sub-section (4) of section 19 of the Act, read with sub-rule (2A) of rule 5 of the Debt Recovery Tribunal (Procedure) Rules, 1993.

Indian Bank

VS

M/s Nanatva Infra Projects Pvt Ltd & others

To,

D2) Mr.P.Sudershan Reddy S/o P Lakshmi Reddy, MIG - 71, 4th Floor, 7th Phase, Atma Ram Marg, KPH Colony, Kukatpally, Hyderabad - 500085.

D3) Mr. G. Raghavendra Rao S/o G.Siva Rama Krishnair, MIG - 71, 3RO Floor, 7th Phase, Atma Ram Marg, KPHB Colony, Kukatpally, Hyderabad - 500085.

D4) Mrs. G.Rajya Lakshmi W/o G Raghavendra Rao, MIG - 71, 3RO Floor, 7th Phase, Atma Ram Marg, KPHB Colony, Kukatpally, Hyderabad - 500085.

SUMMONS

Whereas, O.A.No.400 of 2025 is listed before the Hon'ble Registrar on 19.06.2025.

Whereas the Hon'ble Tribunal was pleased to issue summons/notice of the said Application under Section 19(4) of the Act (OA) filed against you for Recovery of Debts of Rs.18,10,62,767.31/- together with current and future Interest and other reliefs.

In accordance with sub-section (4) of Section 19 of the Act, you, the defendant(s) are directed as under:

(i) To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted;

(ii) To disclose particulars of properties or assets other than the properties and assets specified by the applicant under serial number 3A of the original application;

(iii) You are restrained from dealing with or disposing of secured assets or such specified by applicant under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties;

(iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and/or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal;

(v) You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposits such sale proceeds in the account maintained with the bank or financial institution holding security over such assets;

You are also directed to file the written statement with a copy thereof furnished to the applicant and appear before Registrar on **30.07.2025** at **10.30 A.M.** failing which the application shall be and decided in your absence.

**Given under my hand and seal of the Tribunal on this the 19th day of June, 2025.**

REGISTRAR

Debts Recovery Tribunal - II Hyd

# పోలీసులకు సవాల్‌గా మారుతున్న కిరాతక హత్యలు

**డి.మురళీధర్ అమర్‌నాథ్**

రాష్ట్రంలో వరుసగా జరుగుతున్న కిరాతక హత్యలు పోలీసులకు సవాల్‌గా మారుతున్నాయి. ఒకప్పుడు ప్రత్యర్థులను దారుణంగా వేటాడి చంపే విష సంస్కృతి వుండగా నేడు దీనికి భిన్నంగా అక్రమ సంబంధాల హత్యలు, క్షణికావేశంలో అయిన వారిని కడదేరుస్తున్న ఉదంతాలు ఎక్కువవు తున్నాయి. ఈ తరహా హత్యల్లో కొన్ని సుపారీ హత్యలు కూడా వుంటున్నాయి. హత్యలతోపాటు హత్యాయత్నం వంటి తీ వ్రమైన కేసుల్లో నిందితులకు సులభంగా బెయిలు లభిస్తుండడం ఒక ఎత్తయితే చాలా కేసుల్లో నిందితులకు కఠిన శిక్షలు వేయించడంలో పోలీసులు విఫలమవుతుండడం కూడా ఈ తరహా నేరాల పెరుగుదలకు దోహదం చేస్తుందని నిపుణులు అంటున్నారు. దేశవ్యాప్తంగా ఇటీవల సంచలనంరేపిన మేఘాలయలో రఘువంశీ అనే వ్యాపారిని అతని భార్య సోనం అక్రమ సంబంధం కారణంగా హనీమూన్‌కు వచ్చి కిరాయి హంతకులతో హత్య చేయించగా తాజాగా గద్వాల్ జిల్లాలో తేజేశ్వర్ అనే ప్రైవేటు సర్వేయర్‌ను అతని భార్య ఐశ్వర్య ఇదే తరహాలో సుపారీ కిలర్స్‌తో చంపింది. రెండు ఘటనల్లో వారం రోజుల్లోనే నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఇక జీడిమెట్ల పరిధిలో 15ఏళ్ల ఓ మైనర్ బాలిక, 18 ఏళ్ల తన ప్రియుడు, 16 ఏళ్ల అతని తమ్ముడితో కలిసి కన్న తల్లిని ప్రేమకారణంగా చంపిన ఉదంతం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది. ఇటువంటి ఉదంతాలు తెలుగు రాష్ట్రాల్లో ఇటీవల కాలంలో అనేకం వెలుగు చూశాయి. తెలుగు రాష్ట్రాల్లో గత ఏడాది 1900 వరకు హత్యలు జరిగినట్లు పోలీసు గణాంకాలు చెబుతుండగా ఇందులో హత్యలతో కూడిన బందిపోటు దోపిడీల సంఖ్య 150 వరకు వున్నాయి. మిగతా హత్యల్లో అక్రమ సంబంధాల హత్యలు, అయిన వారిని కడతేర్చిన ఉదంతాలు, చిన్నతగాదాల వల్ల జరిగిన ఘటనలు ఎక్కువగా వున్నాయి. కిరాతక హత్యల వరకు వస్తే గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణ ప్రాంతాలలోనే ఎక్కువగా జరుగుతున్నాయి. క్షణికావేశంలో జరిగే హత్యలతో పోలిస్తే పక్కా పథకంతో జరుగుతున్న కిరాత హత్యలు ఇటీవల కాలంలో పెరిగిపోవడం ఆందోళనకరమైన అంశంగా చెప్పాలి. ఒక రకంగా చెప్పాలంటే ఒకరిని చూసి మరొకరు ఇటువంటి దారుణాలకు పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. గద్వాల్‌లో తేజేశ్వర్ హత్యకు మేఘాలయలో రఘువంశి హత్య ప్రేరణగా మారిందని పోలీసులు తెలిపారు. ఈతరహా హత్యల్లో కొన్నింటిని మినహాయించి మెజారిటీ కేసుల్లో దోషులకు శిక్షలు పడడం లేదనే వాదనవుంది. తెలంగాణవరకు వస్తే ఇటీవల కాలంలో సంచలనం రేపిన హత్యల్లో మొదటగా వరంగల్ జిల్లా హనుమకొండలో ఫిబ్రవరి నెలలో జరిగిన యువ వైద్యుడు సుమంత్ రెడ్డి హత్య రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది.



ఆసుపత్రి నుంచి కారులో వస్తున్న అతన్ని గుర్తు తెలియని దుండగులు దాడిచేసి తలపై సుత్తితో కొట్టారు. ఈదాడిలో తీవ్రంగా గాయపడ్డ అతను ఎనిమిది రోజులపాటు మృత్యువుతో పోరాడి మరణించాడు. దీనిపై విచారణ చేబట్టిన పోలీసులు ఈ దారుణానికి వైద్యుడి భార్య ఫ్లోరా మారియా, ఆమె ప్రియుడు శామ్యూల్, వారి సహచరుడు సైబరాబాద్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా వున్న రాజ్‌కుమార్‌లు కారణమని తేలింది. వైద్యుడి భార్య శామ్యూల్‌తో వున్న అక్రమ సంబంధం కారణంగా వైద్యుడు హత్యకు గురయ్యాడు. ఈ కేసులో నిందితులు అరెస్టయ్యారు. దీని తరువాత మహబూబాబాద్ జిల్లా శనిపురంలో హెల్త్ సూపర్ వైజర్ పార్థసారథి హత్య ఇదే తరహాలో జరిగింది. ఇతని భార్య స్వప్న తన ప్రియుడు టీచర్‌గా వున్న విద్యాసాగర్‌తో కలిసి మరో ఇద్దరు కిరాయి హంతకులను నియమించుకుని భర్తను చంపేసి ఏమీ ఎరగనట్లు నటించగా పోలీసుల విచారణలో బండారంరట్టయ్యింది. ఈ ఘటనలో ఐదేళ్లలోపు వున్న ఈ దంపతుల ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. దీని తరువాత నిజామాబాద్ జిల్లా బాన్సువాడలో విఠల్‌రెడ్డి అనే రైతును అతని భార్య కాశవ్వ ప్రియుడితో కలిసి హత్యచేసింది. ఈ దంపతులకు ముగ్గురు అమ్మాయిలు కాగా ఒకరికి వివాహం జరిగింది, మరో ఇద్దరిరి వివాహం కుదిరిన దశలో తల్లి ఇలాంటి నీచానికి దిగింది. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో రజితఅనే మహిళ ప్రియుడి మోజులో 12, 10, ఎనిమిదేళ్ల ముగ్గురు పిల్లలను గొంతు నులిమి చంపేసింది. ఈ కేసులో ట్విస్ట్ ఏమిటంటే రజిత కంటే ఆమె భర్త 20ఏళ్ల పెద్దవాడు. మొదటి భార్య చనిపోవడంతో రజితను రెండవ వివాహం చేసుకున్నాడు. వీరికి పెళ్లయి 14 ఏళ్ళయ్యింది. 15ఏళ్ల క్రితం పదవ తరగతి చదివిన వారు గెట్‌టు గెదర్ పార్టీ చేసుకుంటే నాటి స్నేహితుడు కలవగానే అతనితో గతంలో వున్న పాత జ్ఞాపకాలను నెమరువేసుకుని అతనితోనే కలిసి జీవించాలని అనుకుని భర్తను కడతేర్చేందుకు నిర్ణయించి అన్నంలో విషం కలిపింది. అయితే అన్నాన్ని భర్త తినక పోగా పిల్లలు తిని అపస్మారకస్థితిలో చేరుకోగానేగొంతు నులిమి చంపేసింది. ఇక వీటికి భిన్నంగా ఏడాదిక్రితంవెలుగు చూసిన ఘటన హయత్‌నగర్‌లో రట్టయిన కీర్తి ఉదంతం. 19 ఏళ్ల ఈ యువతి మైనర్‌గా వున్నపుడే బాల్‌రెడ్డి అనే యువకుడితో రంకు నడిపి, ఆనక గర్భందాల్చి శశికుమార్ అనే యువకుడితో కలిసి అబార్షన్ చేయించుకుంది. ఈక్రమంలో శశికుమార్‌కు లొంగిపోయి అతడితోనూ జల్సా చేసింది. చివరకు శశికుమార్ బ్లాక్ మెయిలింగ్‌కు లొంగిపోయి అతనికి భారీగా డబ్బులు ఇవ్వడంతో పాటు కన్నతల్లి రజితను చంపేసి ఆమె శవాన్ని మూడు రోజులపాటు ఇంట్లో వుంచి వాసనరావడంతో రైలు పట్టాలపై పడవేసింది. ఈ కేసులో పోలీసులు తమదైన శైలిలో విచారణ చేసి రజిత హత్య కేసును ఛేధించడంతో పాటు ఆమె హత్యకు కారకులైన కీర్తితో పాటు ప్రియుడు శశి కుమార్‌ను అరెస్టు చేశారు. ఇకతాజా విషయానికి వస్తే జీడిమెట్లలో 15ఏళ్ల ఓ బాలిక ఇన్‌స్టాగ్రాంలో పరిచయమైన 18ఏళ్ల యువకుడితో ప్రేమలోపడి ఇంట్లోంచి పారిపోయి అతడితో జల్సా చేసింది. దీనిపై తల్లి అంజలి కూతురును మందలించింది. దీంతో తల్లిపై రగిలిపోయిన కూతురు ప్రియుడితో పాటు అతని సోదరుడితో కలిసి తల్లిని దారుణంగా హత్య చేసింది. ఈ కేసులో ముగ్గురు అరెస్ట య్యారు. 15ఏళ్ల వయసు గల మైనర్ బాలిక ప్రొఫెషనల్ హంతకురాలిగా మారడం, పోలీసుల విచారణలో ఏమాత్రం భయపడకపోవ డం మానసిక వైద్యులను సైతం ఆశ్యర్యపరిచింది. రాష్ట్రంలో ఇటీవల వెలుగు చూసిన సంచలన హత్యల విషయానికి వస్తే భూపాలపల్లిలో మేడిగట్ట ప్రాజెక్టు సవ్యంగా లేదని మొదటగా ఫిర్యాదు చేసిన సామాజిక కార్యకర్త రాజలింగ మూర్తిని ప్రత్యర్థులు నడిరోడ్డుపై కిరాతకంగా కత్తులతో పొడిచి హత్య చేశారు. భూ వివాదం కారణంగా ఈ హత్య జరిగినట్లు చెబుతున్నా దీని వెనుక రాజకీయ కారణాలున్నాయని వార్తలు వస్తున్నాయి.

**బెయిల్ ఇవ్వకుండా జీవిత ఖైదు శిక్షలు వుండాలంటున్న నిపుణులు** : ఇదిలావుండగా తీవ్రమైన హత్య లకు సంబంధించిన కేసులను ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారణ చేబట్టి నిందితులకు బెయిల్ రాకుండా చూసి ఏడాదిలోపే జీవిత ఖైదు వంటి కఠినశిక్షలు పడితేనే ఇటువంటి దారుణాలు సమాజంలో ఆగుతాయని న్యాయ నిపుణులు అంటున్నారు. ఒకరిని చూసి మరొకరు ఇలా అనేక మంది వరుస హత్యలు చేస్తుండడం వల్ల సమాజంలో చెడు ప్రభావం చూపుతుందని వారంటున్నారు. ఈ తరహా కేసుల్లో నిందితులకు ఎట్టి పరిస్థి తుల్లో బెయిల్ ఇవ్వకూడదని, ఏడాదిలోపే విచారణ పూర్తి చేసి కనీసం పెరోల్ కూడా వీల్లేని జీవిత ఖైదు శిక్షలుపడాలని న్యాయ నిపుణులు చెబుతున్నారు. దీంతో పాటు విట్‌నెస్ ప్రొటెక్షన్ సిస్టం వుండాలని వారంటున్నారు. నిందితులకు శిక్షలు పడాలంటే ఇది ఎంతో ముఖ్యమని, అనేక దేశాల్లో సాక్షులను కాపాడుకునే వ్యవస్థ వుందని, ఇండియాలో ఇది లేకపోవడం నిందితులకు కలిసి వస్తోందని న్యాయ నిపుణులు అంటున్నారు. ఈ వ్యవస్థను వెంటనే ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు. ●

నిపుణులు చెబుతున్న దాని ప్రకారం 80 శాతం వరకు కేసులు కోర్టుల్లో నిలవడం లేదంటే పోలీసుల దర్యాప్తు ఎంత అపసవ్యంగా వుందో ఊహించుకోవచ్చు. ఈతరహా నేరాలకు పాల్పడేవారిని పోలీసులు అరెస్టు చేస్తున్నా నిందితులను పొరుగురాష్ట్రాలలోముఖ్యంగా కర్ణాటకసహా పలు రాష్ట్రాల్లో వున్నట్లుగా కనీసం ఏడాది నుంచి ఏడాదిన్నరపాటు జైల్లో నిర్బంధించలేకపోవడం ఇక్కడి పోలీసు వైఫల్యంగా నిపుణులు చెబుతున్నారు. ఒకరకంగా ఇది చట్టాలలో వున్నలోపాలుగా వారంటున్నారు. హత్యలకు పాల్పడ్డ వారిపై కొంతకాలం పోలీసులు నిఘావుంచి ఆ తరువాత తమ పనుల్లో బిజీగా వుండడం వల్లవీరి గురించి మరచిపోతున్నారు. హత్యకేసులతోపాటుహత్యకు ప్రయత్నించిన కేసుల్లో నిందితులుగావున్న వారిపై పోలీసులు వెంటనే రౌడీషీట్ తెరుస్తూ వారంతా కొన్నిరోజులపాటు ప్రతిరోజు, మూడు నెలల తరువాత వారానికి ఒకసారి, చివరగా ఇంకొంతకాలం తరువాత నెలకోసారి పోలీసు స్టేషన్లకు వచ్చితమ వివరాలు ఇవ్వాల్సి వుంది. అయితే చాలాచోట్ల ఈ ప్రక్రియ సవ్యంగా అమలవడం లేదనే ఆరోపణలున్నాయి. నిందితుల తరపున కొందరు బడా నేతలు పోలీసులకు నజరానాలు ఇస్తూ హత్యకేసుల్లో నిందితులు స్టేషన్లకు రాకుండా చూస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇక చాలా కేసులో కిరాయి హత్యలకు పాల్పడే నిందితులు బడానేతలతో కలిసి పోలీసులకు ఆమ్యామ్యాలు ఇస్తూ దర్జాగా తిరుగుతూ మళ్లీమళ్లీ నేరాలు చేస్తున్నారనే అభియోగాలు కూడా వున్నాయి. ఇక చాలా కేసులుకోర్టులో వీగిపోవడానికి పోలీసుల విచారణ సరిగ్గాసాగడం లేదనే ఆరోపణలువునా న్న కోర్టుల్లో దాఖలు చేస్తున న ఛార్జిషీట్లు సవ్యంగా వుండడం లేదని న్యాయనిపుణులంటున్నారు. నిందితులుగా వున్న వారిపై పోలీసులు కోర్టులకు సమర్పించే ఛార్జిషీట్లు సరిగ్గాలేకపోవడం వల్ల నిందితులు సులభంగా తప్పించుకుంటున్నారని హైకోర్టు సీనియర్ న్యాయవాదులు

---

ఉత్తరప్రదేశ్

# మరో ముందడుగు

**ఎ.వి.వి ప్రసాద్**

మెదడన్నది మనకున్నది.. అది సరిగా పనిచేస్తే విశ్వరహః పేటికా విపాటనం తప్పదు.. అన్నాడో కవి. మన శుభాంశు శుక్లా ఇప్పుడు చేస్తున్నది అదే. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లోకి అడుగిడిన తొలి భారతీయుడు అతడు. విశ్వ రహస్యాలను ఛేదించడం కోసం అతడిని ఇస్రో అంతరిక్షంలోకి పంపించింది. ఇదొక సాహస వైజ్ఞానిక ప్రయోగం. ఆకాశానికి నిచ్చెనలు వేసే ప్రయోగం. ఆ నిచ్చెనను మనిషి అధిరోహించే ప్రయత్నం. రోదసిలోకి మనిషిని పంపించే ప్రయోగాలు చాలా దశాబ్దాలనుంచే జరుగుతున్నాయి. 40 సంవత్సరాల క్రితమే రాకేశ్‌శర్మ అనే వ్యోమగామిని రోదసిలోకి పంపిన చరిత్ర మనకుఉంది. అయితే అది సోవియట్ రష్యా ప్రయోగం. మన అంతరిక్ష పరిశోధనలకు అది తొలిఅడుగు. అన్నీ అనుకొన్నట్లు జరిగితే మరో పదేళ్లలోపునే భారత్‌సొంత అంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసే ప్రయత్నం కూడా ఫలిస్తుంది. దానికి ముందుగా పడిన అడుగే శుక్లా అంతరిక్షయానం. 1984లో రాకేశ్ శర్మ సూయిజ్ టి 11ద్వారా అంతరిక్ష యానం చేసిన నాటికి, నేటికి వైజ్ఞానిక పరిశోధనలు చాలా ముందడుగు వేశాయి. అప్పట్లో రాకేశ్ శర్మ రష్యా రాకెట్ ద్వారా అంతరిక్షంలోకి వెళ్లారు. ఆ రోజుల్లో ఏదో ఒక ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి పంపడమే అద్భుతంగా ఉండేది. ఇప్పుడు మానవ సహిత ఉపగ్రహాలను పంపేఏర్పాట్లు ఊపందుకున్నాయి. తర్వాత మరో గ్రహంలో (ముందుగా చందమామ) నివసించే అవకాశం కూడా అందవచ్చు. మన గగన్‌యాన్ దారి అదే. దానికి శుక్లా అంతరిక్ష యానం ఒక శుభసూచకం. గత బుధవారం ( 26, జూన్) అమెరికాలోని కెనడీ అంతరిక్ష కేంద్రం నుంచి రోదసీ యానం మొదలు పెట్టిన శుక్లా, మరో ముగ్గురు గురువారం సాయంత్రానికి ఐఎస్ఎస్‌లోకి ప్రవేశించారు. నిజంగానే అదొక అద్భుత విజయం. మన వైజ్ఞానిక పురోగతికి అదొక మెచ్చు తునక. అమెరిన్ వ్యోమగామి, నాసాకు చెందిన పెగ్గీ విట్సన్ కమాండర్‌గా ఉన్న ఈ మిషన్‌లో శుభాంశు శుక్లా పైలట్‌గా వ్యవహరిస్తున్నారు. వారితో పాటు పోలండ్ కు చెందిన స్లావోష్ ఉజ్ నైన్ స్కీ, హాంగరికి చెందిన టిబోర్ కాపూ ఈ బృందంలో ఉన్నారు. వీరిలో పెగ్గీ విట్సన్ జీవ రసాయన శాస్త్ర పరిశోధకురాలు. ఐఎస్ఎస్ కు చేరుకున్న ఈనలుగురు వ్యోమగాములు 14రోజులు అక్కడే ఉండి దాదాపు 60 ప్రయోగాలు చేస్తారు. వాటిలో ఏడు మనదేశం ఎంపిక చేసినవి కావడం విశేషం. భార రహిత వాతావరణంలో, గురుత్వాకర్షణ లేనిపరిస్థితిలో రోదసిలో మనగలగడమంటే అది నిజంగానే అద్భుతమనే చెప్పాలి.



శుభాంశు శుక్లా

సూక్ష్మ గురుత్వాకర్షణ స్థితిలో కండరాలు పని చేయగలిగే పరిస్థితిని పరిశోధించడం కూడా వారి జాబితాలో ఉంది. అది త్వరలో చేపట్టే గగన్‌యాన్ ప్రయోగానికి కూడా ఎంతో ఉపయోగపడుతుంది. ఇలాంటి కీలకమైన పరిశోధనలు వారు ఈ 14 రోజుల్లో చేస్తారని ఇస్రో చెబుతోంది. రాకేశ్ శర్మ తరహాలోనే శుభాంశు శుక్లా ట్రాక్ రికార్డ్ కూడా ఎంతో స్ఫూర్తిదాయకంగా కనిపిస్తుంది. యాక్సియం-4 మిషన్‌లో భాగంగా ఫాల్కన్-9 రాకెట్ ద్వారా ఐఎస్ఎస్‌లోకి ప్రవేశించిన శుక్లా ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో 1985 లో జన్మించారు. అందుకేనేమో! శుక్లా ఆకాశ యానం రోజున లక్నో అంతా పూలపందిరిలా మారిపోయింది. ప్రతి అడుగు అతడి కటౌట్లతో నిండిపోయింది. అతడు చదివిన సిటీ మాంటిస్సోరి స్కూలులో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఒక పెద్ద పండుగలా జరుపుకున్నారు. శుక్లా ప్రయాణించిన వ్యోమనౌక భూ కక్ష్యలోకి ప్రవేశించగానే 'జై హింద్, జై భారత్' అంటూ అతడు చేసిన నినాదాలు లక్నో ప్రజలనేకాదు, మొత్తం భారతీయులందరినీ మహదానందంలో ముంచెత్తాయి. అతడి వ్యోమనౌక అంతరిక్షంలో వెళ్తున్నంత సేపు లక్నోలోని పాఠశాలలో అంతా సంబరాలు చేసుకున్నారు. శుభాంశు తల్లిదండ్రులు, భార్యతో పాటు కొన్నివేలమంది ఈ పాఠశాలలో జరిగిన సంబరాల్లో పాల్గొనడం మరోవిశేషం. భాంగ్రా నృత్యాలతోపాటు 'భారత్ మాతా కీ జై' నినాదాలతో ఆ ప్రాంతమంతా మార్మోగిపోయింది. ఒక మెగా స్క్రీన్‌పై ఆ అంతరిక్షయానం ప్రదర్శిస్తుంటే ఎంతో భావోద్వేగంతో, సంభ్రమా శ్చర్యాలతో అంతా తిలకించారు. శుభాంశు తల్లి ఆశా శుక్లా మెగా స్క్రీన్‌పై రెప్పవాల్చకుండా చూస్తూ రెండు చేతులు జోడించి ప్రార్థనలు చేయడం దేశంలో అందరిని భావోద్వేగానికి గురి చేసింది. అక్కడ చేరిన వారికే కాదు..మొత్తం 140కోట్ల భారతీయులందరికి కూడా అదొక జగదానంద సమయం. 'ఇది నా ఒక్కడి అంతరిక్ష యాత్ర కాదు, భారతీయులందరు సగర్వంగా చెప్పుకునే సందర్భం' అని శుక్లా పంపిన సందేశాన్ని భగవద్గీత శ్లోకంలా అందరూ మళ్లీమళ్లీ మననం చేసుకున్నారు. ఫైటర్ పైలట్ అయిన శుక్లాకు జాగ్వార్, సుఖోయ్, మిగ్ వంటి యుద్ధ విమానాలను ఇప్పటిదాకా రెండువేల గంటలు పైగా నడిపిన అనుభవంఉంది. మాంటిస్సోరి లోని విద్యార్థులు ఆ విశేషాలన్నీ నెమరు వేసుకుం టూ శుక్లా సాహస యాత్రను వేనోళ్ల కొనియాడారు. 'నా భుజాలపై ఉన్న ఈ త్రివర్ణ పతాకం.. నేను మీఅంద రితో ఉన్నానని చెబుతోంది. ఇది ఐఎస్ఎస్‌కు నాజర్నీ ప్రారంభం మాత్రమేకాదు, భారత్ మానవసహిత అంతరిక్ష యాత్రకు కూడా ప్రారంభమే' అన్న శుక్లా మాటలే గత నాలుగు రోజులుగా అందరి చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. నాలుగు దశాబ్దాల క్రితం రాకేశ్ శర్మ ఎనిమిది రోజులపాటు రోదసిలో గడిపివచ్చిన చరిత్ర కంటె శుక్లా ఐఎస్ఎస్‌లో చేస్తున్న పరిశోధనల ఘట్టం భారత్ అంతరిక్ష చరిత్రలో గొప్ప మైలు రాయి అనే చెప్పాలి. అంతరిక్షంలో శుక్లా వేసే అడుగులన్నీ గగన్‌యాన్ విజయానికి నిచ్చెన మెట్లవుతాయి. అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ 'ఇప్పుడు అంతరిక్షంలో మీకెలా ఉంది' అని ప్రశ్నిస్తే 'సారే జహాసె అచ్ఛా 'అని రాకేశ్ శర్మ సమాధానమిచ్చారు. శుక్లా జవాబు కూడా అదే. ●

---

ఇటలీ

# జెఫ్‌బెజోస్ పెళ్లా..మజాకా!

**గన్ని మోహన్**

ప్రపంచంలోనే అత్యంత అట్టహాసంగా జరిగిన వివాహాల్లో ఈ వారం వెనిస్‌లో జరిగిన వివాహం ప్రపంచ రికార్డులకెక్కింది. దాదాపు 15 ఏళ్లక్రితం ఇదే నగరంలో ఒక ఆడంబరమైన వివాహ వేడుక జరిగింది. వెనిస్ యాక్టర్ జార్జ్ క్లూనీ, మానవ హక్కుల న్యాయవాది అమల్ అలాముద్దీన్‌ల వివాహం అప్పట్లో అత్యంత వైభవంగా జరిగింది. ఇప్పుడు అంతకు రెట్టింపు స్థాయిలో జరిగిన వివాహం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశం అయింది. అదే అమెజాన్ అధినేత జెఫ్ బెజోస్, విశ్వవిఖ్యాత జర్నలిస్టు లారెన్ సాంచెజ్ వివాహ వేడుక. హాలివుడ్ ప్రముఖులే కాకుండా ప్రపంచదేశాల నుంచి విశిష్ట ప్రముఖులు మొత్తం హాజరయిన పెళ్లితో వెనిస్ నగరం మొత్తం పెళ్లి సందడితో నిండిపోయింది. 2019 నుంచి డేటింగ్‌లో కొనసాగుతున్న వీరిద్దరూ చివరికి పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకోవడంతో 2023లో వీరి నిశ్చితార్థం జరిగింది. ఈవారాంతంలోనే వెనిస్‌లో జరిగిన వీరి పెళ్లి ప్రపంచంలో ఇంతకుముందు ఎన్నడూ లేనంత ఆడంబరంగా జరిగిందనే చెప్పాలి. అందుకు కారణం అపరకుబేరుడు ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద బిలియనీర్ అయిన జెఫ్‌బెజోస్ వరుడు కావడమే. ప్రస్తుతం 61ఏళ్ల బెజోస్ 55 ఏళ్ల లారెన్‌తో డేటింగ్ చేసిన అనంతరం వివాహ బంధంలోకి వచ్చాడు. సాక్షాత్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కుమార్తె ఇవాంక ట్రంప్, ఆమె భర్త జారెడ్‌కుష్ణర్‌లతోపాటు కిమ్‌కర్దాషియన్, కోలే కర్దాషియన్, జోర్డాన్ రాణి రనియా ఇతర ప్రముఖులు మొత్తం ఈ పెళ్లికి క్యూకట్టారు. సుమారు 48 మిలియన్ యూరోలు అంటే డాలర్లలో 56 మిలియన్ డాలర్లను ఈ వివాహ వేడుకకు ఖర్చుచేసారు. సహజంగా అమెరికన్ జంటలు పెళ్లిచేసుకుంటే మహాఅయితే 36 వేల డాలర్ల ఖర్చు ఉంటుంది. అయితే బెజోస్ పెళ్లికి మాత్రం 1000 రెట్లు అధికంగా ఖర్చు చేసారు. కేవలం 10 గంటలు నిలిచే గ్లాస్ టెంట్ కోసమే రెండు మిలియన్ డాలర్లు ఖర్చు చేసారు. మూడునాలుగు రోజుల కార్యక్రమానికి 48 మిలియన్ డాలర్లేమిటని అందరూ ముక్కున వేలేసుకున్నా తన ఆడంబరత్వం లగ్జరీ జీవితం ప్రపంచానికి మరోసారి చాటిచెప్పే లక్ష్యంతోనే వెనిస్‌ను వేదిక చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ పెళ్లిలో సాంచెజ్ ధరించిన గౌను కుట్టేందుకే 900 గంటలు పట్టింది. 1958లో వచ్చిన సినిమా హౌస్‌బోట్ హీరోయిన్ సోఫియా లారెన్ ధరించిన గౌన్ స్ఫూర్తితో సాంచెజ్ పెళ్లి దుస్తులను రూపొందించారు. వాటర్ ట్యాక్సీలు, ప్రైవేటు విమానాలతో వెనిస్ నగరం మొత్తం నిండిపోయింది. డజన్ల కొద్దీ జెట్ విమానాలు, వెనిస్ వాటర్‌వేస్‌లోకి లెక్కలేనన్ని వాటర్ ట్యాక్సీలు ఒక్కసారిగా పుట్టుకొచ్చాయి. శృంగార పర్యాటక చారిత్రక నగరంగా పేరుపొందిన వెనిస్‌లోనే తమ పెళ్లి జరగాలన్న లక్ష్యంతోనే బెజోస్, సాంచెజ్‌లు ఇక్కడ వైవాహిక బంధంలోకి ప్రవేశించారు.



బెజోస్ సాంచెజ్

2019లో అప్పటివరకూ ఉన్న భార్య మెకంజీ స్కాట్‌తో 25 ఏళ్ల బంధానికి స్వస్తి చెప్పి విడాకులు తీసుకున్నారు. న్యూమెక్సికోలో 1964 జనవరి 12న జన్మించిన జెఫ్‌బెజోస్ సెకండ్‌హ్యాండ్ పుస్తకాలు విక్రయించే ఆన్‌లైన్ స్టోర్‌ను ప్రారంభించారు. అమెజాన్ పేరుతో ఇప్పుడు అదే అతిపెద్ద ఈ కామర్స్ సంస్థగా మారింది. ఆ తర్వాత బ్లూ ఆరిజన్ అనే అంతరిక్ష సంస్థను కూడా స్థాపించి తానే స్వయంగా రోదసిలోకి వెళ్లి వచ్చారు. అంతటితో ఆగకుండా ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియాలోకి ప్రవేశించారు. వాషింగ్టన్‌పోస్ట్ పత్రికను కొనుగోలు చేసారు. ఐదేళ్లపాటు వరుసగా ప్రపంచంలోనే అత్యంత కుబేరునిగా ఫోర్బ్స్ జాబితాలో నిలిచారు. 1993లో మెకెంజీ స్కాట్‌తో జరిగిన వివాహం 2019లో విడాకులతో ముగిసింది. స్కాట్ ప్రముఖ అమెరికన్ రచయిత్రి దాతృత్వవేత్త. అమెజాన్ ప్రారంభంలో ఆమె కీలకంగా నడిపించారు. విడాకుల సమయంలో ఆమకకు 38 బిలియన్ డాలర్ల అమెజాన్ షేర్లు వచ్చాయని ఇప్పటికీ అందరూ చెపుతారు. ఇక లారెన్ వెండీ సాంచెజఖ్ పరంగా చూస్తే 55ఏళ్ల ఆమె ఒక టివియాంకర్, జర్నలిస్టు, హెలికాప్టర్ పైలట్ కూడా. 2024లో బ్లూ ఆరిజన్ ద్వారా అంతరిక్షానికి వెళ్లిన తొలి మహిళల్లో ఒకరుగా నిలిచారు. అయితే లారెన్‌ది కూడా విడాకుల జీవితమే. గతంలో ఎన్ఎఫ్ఎల్ మాజీ ఆటగడాడు టోనీ గోంజాలెజ్‌తో డేటింగ్ చేసి ఒక కొడుకును కన్నారు. ఆపై హాలివుడ్ టాలివుడ్ లెజెండ్ పాట్రిక్ వైట్‌సెల్‌ను వివాహ మాడారు. వీరికి ముగ్గురు పిల్లలు. పాట్రిక్ నుంచి విడాకులు తీసుకున్నాక జెఫ్ బెజోస్‌తో డేటింగ్ చేస్తూ ఏకంగా ఇప్పుడు ఆయన జీవిత భాగస్వామిగా కొత్త జీవితాన్ని ప్రారంభించారు. హాలివుడ్ స్థాయిలో వివాహాలు చేసుకోవడం ఆపై విడాకులు తీసుకోవడం షరా మామూలుగానే జరుగుతున్నా ఒక బిలియనీర్ పారిశ్రామికవేత్త అందులోను ఫోర్బ్స్ జాబితాలో ఉన్న జెఫ్‌బెజోస్ వంటి పారిశ్రామికవేత్తలు చేసుకున్న వివాహం కావడంతోనే ప్రపంచ దేశాల్లో ఈ పెళ్లిపట్ల అన్నివర్గాలు ఆసక్తి చూపించాయి. ఈ ఘనమైన వివాహానికి నిరసనలు కూడా తప్పలేదు. వెనిస్‌లోని కొన్ని డజన్ల సంఘాలు హౌసింగ్ అడ్వకేట్స్, యాంటి క్రూయిజ్ షిప్ ప్రచారకర్తలు, విశ్వవిద్యాలయాల గ్రూపులు కూడా 'నోస్పేస్ ఫర్ బెజోస్' అంటూ నిరసనలు తెలిపినా వాటిని ప్రభుత్వం కొట్టిపారేసింది. వెనిస్ మేయర్ ఈవిమర్శలను కొట్టిపారేసారు. ఈ వివాహంతో పర్యాటకపరంగా వెనిస్‌కు ఆర్థిక వనరులు మరింతగా పెరుగుతాయని, అట్టహాసంగా జరిగే ఈ పెళ్ళిళ్లే వెనిస్‌కు ప్రపంచ గుర్తింపును తెస్తాయని చెపుతూ నిరసనలు సహజమేనని తేలిగ్గా తీసుకున్నారు. 234 బిలియన్ డాలర్ల వాణిజ్య సామ్రాజ్యానికి అధినేతగా ఉన్న జెఫ్ బెజోస్ వివాహం పుణ్యమా అని వెనిస్ నగరం మాత్రం మరోసారి అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించిందనే చెప్పుకోవాలి. ●

---

# 'మీడియం' అమలులో అస్పష్టత తొలగించాలి

**విశ్వ జంపాల**

గత రెండు దశాబ్దాలుగా తెలుగు మీడియానికి ఆదరణ తగ్గుతూ ఇంగ్లీష్ మీడియానికి పెరుగుతుంది. ఏమాత్రం అవకాశమున్న ఇంగ్లీష్ మీడియం స్కూళ్లకు పంపించాలన్న కోరిక, ఆసక్తి తల్లిదండ్రుల్లో పెరిగిపోయింది. దీన్ని గమనించిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు తెలుగు మీడియం స్థానంలో ఇంగ్లీష్ మీడియంను ఎల్.కె.జి. నుండి అమలు పరుస్తున్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మాతృభాషపేరుతో తెలుగును బోధన భాష (మాధ్యమం)గా నిర్వహిస్తున్నారు. గత 10 సం॥లుగా ప్రభుత్వ విద్యాసంస్థల్లో క్రమక్రమంగా విద్యార్థుల సంఖ్య తగ్గుతూ ప్రైవేట్ విద్యాసంస్థల్లో పెరుగుతూ వచ్చింది. వాడవాడల ప్రైవేట్ ఇంగ్లీష్ మీడియంస్కూళ్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. ఎలాంటి విద్యా ప్రమాణాలు పాటించకుండానే ప్రైవేట్ యాజమాన్యాలు ఇంగ్లీష్ మీడియం స్కూళ్లను నడపడం మూలంగా విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. అయినప్పటికి గ్రామీణ ప్రాంత తల్లిదండ్రులు తమ పిల్లలను ఎన్ని వ్యయ ప్రయాసాలకైనా ఓర్చి ప్రైవేట్ ఇంగ్లీష్ మీడియం స్కూళ్ళల్లో చేర్పిస్తున్నారు. దీనికి ఇంగ్లీష్ మీడియమే ప్రధాన కారణమైనప్పటికి ఇతర కారణాలు లేకపోలేదు. చదువు ఎంత వస్తుందో, రావట్లేదన్న దాని కన్నా ప్రభుత్వ విద్యాసంస్థలపై వున్న అపనమ్మకం తల్లిదండ్రులను ప్రైవేట్ స్కూళ్లవైపు నడిపిస్తుంది. తెలిసో తెలియకనో లేక ఇంగ్లీష్‌పై విపరీతమైన మోజుతోనో తల్లిదండ్రులు ఇంగ్లీషు మీడియాన్ని ఎంపిక చేసుకుంటున్నారు. దీన్ని మేధావులు తప్పక స్వాగతించాలి. ప్రాథమిక స్థాయి నుండి ఇంగ్లీషు మీడియాన్ని ఎంపిక చేసుకోవడం సరైందే. "మొక్కై వంగనిది మ్రానై వంగునా" అనే సామెతను అంగీకరించే ప్రతి ఒక్కరు ప్రాథమిక దశ నుండే ఇంగ్లీషు మీడియం పద్ధతిని కూడ అంగీకరించాల్సి వుంది. మాతృ భాషగా తెలుగు (స్థానిక భాష)ను, రాజ్య భాషగా హిందీ (జాతీయ భాష)ను, అంతర్జాతీయ భాషగా ఇంగ్లీషును నేర్పించాలన్న ఉద్దేశ్యంతో త్రిభాషా సూత్రాన్ని అమలు చేస్తున్నారు. దీని ప్రకారం 10వ, తరగతి పూర్తిఅయ్యే నాటికి తెలుగు, హిందీ, ఇంగ్లీషు భాషల్లో విద్యార్థులకు పూర్తి ప్రావీణ్యం రావాలి. వాస్తవానికి 90శాతం మంది విద్యార్థులకు ఇంగ్లీష్‌చదవడం, రాయడం రావటం లేదు. తెలుగు మీడియంలో డిగ్రీలు పూర్తి చేసిన వారికి సైతం ఇంగ్లీషులో చదవడం రాయటం మాట్లాడటం సంపూర్ణంగా రాదనేది వాస్తవం. మాతృభాషగా తెలుగుభాషను ఆదరించి గౌరవించాల్సిందే, కానిప్రస్తుత పరిస్థితులకనుగుణంగా ఇంగ్లీష్ మీడియంను ఒప్పుకోవాల్సిందే. ఈ మాటలంటున్నది మాతృభాషపై మమకారం తగ్గి కాదు. పరాయి భాషపై వ్యామోహంతో అంటున్న మాటలు అంతకన్నకాదు. ఈ సందర్భంగా కొన్ని యదార్థాలను తప్పక చర్చించాల్సిందే. మారుతున్న పరిస్థితులను అర్థం చేసుకుంటూ వాస్తవాల వెంట పరుగెత్తకున్న కనీసం అంగీకరించాల్సి వుంది. అక్షరజ్ఞానం లేని తల్లిదండ్రులు సైతం ఆంగ్లం వైపు దృష్టి సారించడం పట్ల కొందరు మేధావులు కలవరపడుతున్నారు. ప్రాథమిక దశనుండే ఆంగ్ల మీడియంలో చదివించడం వలన పిల్లల మానసికస్థితి పెరగదని, ఆలోచనాశక్తి ఉండదని, అంశాలను సరిగా అర్థం చేసుకోలేరని, వివరణాత్మకంగా చెప్పలేరని గగ్గోలు పెడుతున్నారు. ప్రాథమిక దశ నుండి ఆంగ్ల మీడియంలో విద్యాబోధన వుండొద్దని గంటాపథంగా వాదిస్తున్నారు. వాస్తవానికి ఈ మేధావుల పిల్లలు, వారి పిల్లల ఏరకమైన స్కూల్లో, ఏ మీడియంలో చదువుతున్నారో ఒక్కసారి ఆత్మపరిశీలన చేసుకొని ప్రజలకు తెలియపర్చాలి. చాలామంది ఈ రోజుఉన్నత స్థితిలో వున్నవారు ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు మీడియంలో చదివారన్నది కాదనలేని నిజం. వీరు చెబుతున్న నిజం వెనక మరొక అబద్ధం కూడా వున్నది నిజమే. ఈ రోజు ఉన్నత స్థితిలో వున్న ఏవ్యక్తి తన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో లేదా తెలుగు మీడియంలో చదివిస్తున్నారో బహిర్గతం చేయాలి. తమ చదువుల గురించి ప్రస్థావన చేస్తున్న పలువురు ఉన్నత వ్యక్తులు తమ పిల్లల చదువుల గురించి కనీస ప్రస్థావన కూడా చేయటం లేదు. ఈ మధ్య కొంతమంది మంత్రులు, మేధావులు, కలెక్టర్ స్థాయి ఉన్నతాధికారులు ఎక్కడ చదివారో పదేపదే చెబుతు



న్నారు కానీ, ప్రస్తుతం తమ పిల్లలు ఎక్కడ చదువుతున్నారో మాత్రం చెప్పడం లేదు. బహుశా చెప్పే ధైర్యం కూడా వారు చేయడం లేదు. వాళ్లు చదువుకున్న నాటి పరిస్థితులకు నేటి కాలమాన పరిస్థితులకు చాలావ్యత్యాసాలు ఉన్నాయన్నది గమనించాలి. ఈ విషయంలో పాలకులు, ఉన్నత వ్యక్తులు నటిస్తున్నారు, ప్రజలు జీవిస్తున్నారు. కాబట్టే నేటి కాలమాన పరిస్థితుల కనుగుణంగా ప్రజలు వారి స్థితిగతులను బట్టి ఆలోచిస్తూ నిర్ణయాలు తీసుకుంటూ కష్టమైన, నష్టమైన ఇంగ్లీష్ మీడియంలో ప్రైవేట్ స్కూళ్లలో చదివించడానికి సిద్ధపడుతున్నారు. ఇప్పటికి జాతీయ స్థాయిలో, రాష్ట్ర స్థాయిల్లో జరుగుతున్న అనేక రకాల పోటీ పరీక్షలను ప్రభుత్వం ఇంగ్లీషు మీడియంలోనే నిర్వహిస్తుంది. యుపిఎస్సీ, స్టాఫ్ సెలక్షన్ కమీషన్ (ఎస్సెస్సీ)కొన్నిరకాల ఎంట్రన్స్ పరీక్షలు, ఉద్యోగపరీక్షలు ఇంగ్లీషులోనే నిర్వహిస్తున్నారు. తెలుగు మీడియం విద్యార్థులు హిందీలోనో, ఇంగ్లీష్ మీడియంలోనో పరీక్షలు రాయడం, ఉన్నత విద్యావకాశాలు, ఉద్యోగాలు సాధించడం చాలా కష్టతరమవుతుంది. తెలుగు మీడియం చదివిన విద్యార్థులకు ఇదొక శాపంగా మారింది. ఇంగ్లీషు మీడియం విద్యార్థులు కళ్లముందే విద్యాఉద్యోగ అవకాశాలను కొల్ల గొట్టుకుపోతుంటే చెమటోడ్చిన తెలుగు మీడియం విద్యార్థులు చేసేదేమీ లేక ఇంటిదారి పడుతున్నారు. వివిధ స్థాయిలలో జరిగే జాతీయ రాష్ట్ర స్థాయిలల్లో విద్య ఉద్యోగ పోటీ పరీక్షలు తెలుగు మీడియంలో పెట్టకుండా ఇంగ్లీష్ మీడియంలో నిర్వహించడం మూలంగా గ్రామీణ ప్రాంతాలలో ఉంటూ, తెలుగు మీడియం చదివిన పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఆ నష్టాన్ని ఎలా పూడ్చాలో ఇంతవరకు ఎవరు, ఎప్పుడు కూడా ఆలోచించలేదు. గ్రామీణ ప్రాంత తెలుగు మీడియం విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియం లేదు. ఇంగ్లీషు భాష ఒక సమస్యగా వుంది. అదేవారి అభివృద్ధికి అవరోధంగా మారింది. ఉన్నత వర్గాలు, ఆర్థిక స్థోమత గల వారిపిల్లలు ఇంగ్లీష్ మీడియంలో ప్రైవేట్ కార్పోరేట్ స్కూళ్ళలో, పట్టణాలలో చదువుతుండగా, పేదరికంలో ఉన్న ఆర్థిక స్థోమత లేని వారి పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో, తెలుగు మీడియంలో, గ్రామాలలో చదువుతున్నారు. వారిమధ్య తీవ్ర అసమానతలు, వ్యత్యాసాలు వున్నాయి. వైద్య విద్యా, న్యాయ విద్యా, ఇంజనీరింగ్ విద్యా, శాస్త్రసాంకేతిక విద్యా మొదలైనఉన్నత విద్యలు, పి.జి., పి.హెచ్.డి. కోర్సులు ఆంగ్ల మీడియంలోనే ఉంటున్నాయి. తెలుగు మీడియం విద్యార్థులకు వాటిని అభ్యసించడం కత్తిమీద సాము లాంటిదే. గతంలో ప్రభుత్వం ఆదర్శపాఠశాలలు ఏర్పాటు చేసి ఉపాధ్యాయుల నియామకానికి ప్రకటన విడుదల చేసింది. మొదట ఇంగ్లీషు మీడియం అభ్యర్థులకేనని ఆ తర్వాత తెలుగు మీడియం వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని ప్రకటించింది. ఆ తర్వాత వెంటనే తన ప్రకటను సవరించుకొని కేవలం ఇంగ్లీషు మీడియం వారికేనని ప్రకటించింది. ఈ రెండు ప్రకటనల మధ్యకాలంలో సమయం తక్కువగా ఉండటంతో అతికొద్ది మంది మాత్రమే తెలుగు మీడియం అభ్యర్థులు ధరఖాస్తు చేసుకోగా వారికి మాత్రమే ఇంగ్లీషు మీడియం అభ్యర్థులతో పాటు నియామక పరీక్షరాసే అవకాశం లభించింది. తెలుగు మీడియంలో చదివి ఉపాధ్యాయ శిక్షణ పొందిన లక్షలాది మంది నిరుద్యోగులు ఈ అవకాశాన్ని కోల్పోయారు. పరీక్ష రాసి అర్హతసాధించిన తెలుగు మీడియం అభ్యర్థులు సుప్రీం కోర్టు ఆదేశాలతో నియామక ఉత్తర్వులు అందుకున్నారు. ప్రభుత్వాలే త్రిభాషా సూత్రాన్ని, రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్నాయి. దేశం లోపల ఏ మీడియంలో చదివిన వారికైనా సమాన విద్యా, ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. ఏ మీడియంలో చదివిన వారికి అదే మీడియంలో విద్యా ఉద్యోగ పోటీ పరీక్షలు రాసుకోవడానికి, చదవడానికి అవకాశం కల్పించాలి. కానీ ప్రభుత్వం ఆ నియమాలను ఏమాత్రం పాటించడం లేదు. ఈరకమైన అస్పష్టమైన, అన్యాయమైన ప్రభుత్వ విధానాల మూలంగా మాతృభాషలో విద్యాభ్యాసం కొనసాగించిన గ్రామీణ, పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. రాబోయే విద్యా సంవత్సరం నుండైన దేశ వ్యాప్తంగా ఇంగ్లీషు మీడియాన్ని అధికారికంగా ప్రవేశపె ట్టాలి. ఇప్పటి వరకు తెలుగు మీడియంలో చదివిన విద్యా ర్థులకు, ఇంగ్లీషు మీడియంలో ప్రాథమిక స్థాయి నుండి డిగ్రీచదివిన విద్యార్థులకున్న ప్రావీణ్యానికి సరిపడా సిలబస్ ను రూపొందించి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని అమలు చెయ్యాలి. ●

# కెనడా, అమెరికా మధ్య వాణిజ్యం బంద్!

## డిజిటల్ సేవల పన్నుపై ట్రంప్ ఆగ్రహం

## కెనడాతో అన్ని రకాల వాణిజ్యచర్చలు నిలిపివేస్తున్నామని వెల్లడి




**వాషింగ్టన్,జూన్ 28:** అమెరికా, కెనడా దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు మరోసారి ఉద్రిక్తతకు దారితీశాయి. కెనడా ప్రభుత్వం తీసుకు వచ్చిన డిజిటల్ సేవల పన్ను (డీఎస్‌టీ)పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఆ దేశంతో అన్ని రకాల వాణిజ్య చర్చలను తక్షణమే నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్రూత్ సోషల్ వేదికగా ఆయన ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. జూన్ 30 నుంచి ఈ కొత్త పన్ను విధానం అమల్లోకి రానున్న నేపథ్యంలో ట్రంప్ ఈ కఠిన నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. కెనడా ప్రభుత్వం గతేడాది ఈ డిజిటల్ సేవల పన్ను చట్టాన్ని రూపొందించింది. దీని ప్రకారం కెనడాలో ఆన్‌లైన్ ద్వారా గణనీయమైన ఆదాయం ఆర్జించే పెద్ద డిజిటల్ కంపెనీలు తమ ఆదాయంపై 3 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ మార్కెట్‌ప్లేస్ సేవలు, ఆన్‌లైన్ ప్రకటనలు, సోషల్ మీడియా సేవలు, వినియోగదారుల డేటా అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయం ఈ పన్ను పరిధిలోకి వస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ఏటా 750 మిలియన్ యూరోలు సుమారు రూ.6,700 కోట్లు, కెనడాలో 20 మిలియన్ కెనడియన్ డాలర్ల సుమారు రూ.120 కోట్లు కంటే ఎక్కువ డిజిటల్ సేవల ద్వారా ఆదాయం ఉన్న కంపెనీలకు ఈ పన్ను వర్తిస్తుంది. ఈ పన్నును 1 జనవరి 2022 నుంచే పునరాలోకన ప్రభావంతో (రెట్రోయాక్టివ్) అమలు చేయనున్నారు. కంపెనీలు 30వ తేదీ నుంచి ఈ పన్ను చెల్లింపులు ప్రారంభించాలి. గూగుల్, అమెజాన్, ఫేస్‌బుక్ వంటి అమెరికన్ టెక్ దిగ్గజాలపై ఈ పన్ను ప్రభావం అధికంగా ఉండనుంది. తమ దేశ వినియోగదారుల ద్వారా విదేశీ కంపెనీలు భారీగా ఆర్జిస్తున్నప్పుడు, ఆ ఆదాయంలో కొంత భాగాన్ని పన్ను రూపంలో పొందే హక్కు తమకు ఉందని కెనడా వాదిస్తోంది. ఈ పన్ను ద్వారా కెనడా ప్రభుత్వానికి ఏటా 875 మిలియన్ డాలర్ల ఆదాయం వస్తుందని అమెరికా వాణిజ్య ప్రతినిధి గతంలో అంచనా వేశారు. ఐదేళ్లలో ఈ పన్ను ద్వారా కెనడా ప్రభుత్వ ఖజానాకు 7.2 బిలియన్ కెనడియన్ డాలర్లు సమకూరుతాయని ఆ దేశ పార్లమెంటరీ బడ్జెట్ కార్యాలయం తెలిపింది. అయితే, ఈ పన్ను వివక్షాపూరితంగా ఉందని, ఇది కేవలం అమెరికా కంపెనీలనే లక్ష్యంగా చేసుకుని రూపొందించారని అమెరికా ఆరోపిస్తోంది. ఈ పన్ను వల్ల అమెరికన్ కంపెనీలు కెనడాకు 3 బిలియన్ డాలర్ల వరకు పన్నులు చెల్లించాల్సి వస్తుందని, దీనివల్ల అమెరికాలో 3,000 ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉందని అక్కడి కంప్యూటర్ అండ్ కమ్యూనికేషన్స్ ఇండస్ట్రీ అసోసియేషన్ (సీసీఐఏ) ఆందోళన వ్యక్తం చేసింది. ఈ పన్ను అమెరికా మెక్సికో కెనడా ఒప్పందం (యూఎస్ఎంసీఏ), ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో) నిబంధనలకు విరుద్ధమని యూఎస్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ పేర్కొంది. గతంలోనూ హెచ్చరించిన అమెరికా ఈ వివాదంపై అమెరికా గతంలోనూ పలుమార్లు కెనడాను హెచ్చరించింది. 2024 ఆగస్టులో, యూఎస్‌టీఆర్ కేథరిన్ తాయ్ ఈ విషయంపై యూఎస్ఎంసీఏ కింద వివాద పరిష్కార సంప్రదింపులకు పిలుపునిచ్చారు. ఈ పన్ను అమెరికన్ కంపెనీల పట్ల వివక్ష చూపడమేనని, ఇది ఒప్పంద ఉల్లంఘన కిందకు వస్తుందని ఆమె ఆరోపించారు. అయినప్పటికీ, కెనడా ప్రభుత్వం వెనక్కి తగ్గలేదు.

**వెనకడుగు వేయని కెనడా:** అంతర్జాతీయంగా డిజిటల్ పన్నుల విధానంపై ఏకాభిప్రాయం ఆలస్యం అవుతున్నందునే తాము సొంతంగా ఈ చట్టాన్ని తీసుకురావాల్సి వచ్చిందని కెనడా వాదిస్తోంది. ఈ పన్ను పార్లమెంటు ఆమోదం పొందిందని, దీని అమలు విషయంలో వెనక్కి తగ్గేది లేదని ఆ దేశ ఆర్థిక మంత్రి ఫ్రాంకోయిస్ ఫిలిప్ షాంపేన్ ఇటీవలే స్పష్టం చేశారు. ఇప్పటికే అల్యూమినియం, ఉక్కు వంటి ఉత్పత్తులపై ట్రంప్ ప్రభుత్వం విధించిన ఏకపక్ష సుంకాలతో ఇబ్బందులు పడుతున్న కెనడా, ఈ డిజిటల్ పన్నును అమెరికాతో బేరసారాలకు ఒక అస్త్రంగా వాడుకునే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

### వజీరిస్థాన్‌లో ఆత్మాహుతి దాడి

# 16 మంది సైనికులు దుర్మరణం

**వజీరిస్థాన్(పాకిస్థాన్),జూన్ 28:** పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో మరోసారి నెత్తురు చిందింది. ఉత్తర వజీరిస్థాన్ జిల్లాలో సైనిక కాన్వాయ్‌ను లక్ష్యంగా చేసుకుని పాకిస్థానీ తాలిబన్లు జరిపిన ఆత్మాహుతి దాడిలో 16 మంది సైనికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో పౌరులతో సహా మరో 24 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. శనివారం జరిగిన ఈ సంఘటన దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. స్థానిక ప్రభుత్వ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ఒక ఆత్మాహుతి దళ సభ్యుడు పేలుడు పదార్థాలతో నిండిన వాహనాన్ని నడుపుకుంటూ వచ్చి సైనిక కాన్వాయ్‌ను ఢీకొట్టాడు. దీంతో భారీ పేలుడు సంభవించి సైనికులు ప్రయాణిస్తున్న వాహనాలు ధ్వంసమయ్యాయి. పేలుడు తీవ్రతకు సమీపంలోని రెండు ఇళ్ల పైకప్పులు కూలిపోయాయి, ఫలితంగా ఆరుగురు చిన్నారులు గాయపడ్డారని జిల్లాలోని ఒక పోలీస్ అధికారి వెల్లడించారు. మొదట మృతుల సంఖ్య 13గా ఉన్నప్పటికీ, ఆ తర్వాత 16కి పెరిగినట్లు అధికారులు ధ్రువీకరించారు. ఈ ఆత్మాహుతి దాడికి తామే బాధ్యత వహిస్తున్నట్లు పాకిస్తానీ తాలిబన్‌కు చెందిన హఫీజ్ గుల్ బహదూర్ గ్రూప్ ప్రకటించుకుంది. 2021లో ఆఫ్ఘనిస్తాన్‌లో తాలిబన్లు తిరిగి అధికారం చేపట్టినప్పటి నుంచి పాక్ సరిహద్దు ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు గణనీయంగా పెరిగాయి. తమ భూభాగం నుంచి ఉగ్రవాదులు దాడులకు పాల్పడుతున్నారని పాకిస్తాన్ పదేపదే ఆఫ్ఘనిస్తాన్‌పై ఆరోపణలు చేస్తోంది. అయితే, ఈ ఆరోపణలను కాబూల్‌లోని తాలిబన్ ప్రభుత్వం ఖండిస్తూ వస్తోంది.

ఈ ఏడాది ప్రారంభంనుంచి ఖైబర్ పఖ్తుంఖ్వా, బలూచిస్తాన్ ప్రావిన్సుల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాయుధ గ్రూపులు జరిపిన దాడుల్లో సుమారు 290 మంది మరణించారని, వీరిలో అత్యధికులు భద్రతా సిబ్బందేనని గణాంకాలు చెబుతున్నాయి.



# అధ్యక్షుడిగా పనిచేయడం ఆషామాషీ కాదు..

## ట్రంప్ కీలక వ్యాఖ్యలు

**వాషింగ్టన్, జూన్ 28:** అధ్యక్ష పదవిని ఉద్దేశిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ పదవిలో ఉండటం చాలా ప్రమాదకరమని ఆయన తెలిపారు. శుక్రవారం వైట్‌హౌస్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా గతేడాది పెన్సిల్వేనియాలో అధ్యక్ష ఎన్నికల ప్రచార ర్యాలీలో జరిగిన హత్యాయత్నాన్ని ట్రంప్ గుర్తు చేసుకున్నారు. అధ్యక్ష పదవి ప్రమాదకరమైనది, ఎన్నో సవాళ్లతో కూడుకొని ఉంటుందని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడి బాధ్యతలను ఇతర ప్రమాదకరమైన వృత్తులతో ఆయన పోల్చారు. కారు రేసింగ్, బుల్ రైడింగ్‌లాగే ఇక్కడ కూడా చావు ఎప్పుడు ఎదురవుతుందో చెప్పలేమన్నారు. ఈ విషయం తనకు ఎవరైనా ముందే చెప్పిఉంటే తాను ఈ రేసులో ఉండేవాడిని కాదన్నారు. ఇది చాలా ప్రమాదకరమైన వృత్తి అని ఆయన ఉద్ఘాటించారు. గతంలో ట్రంప్‌పై పలుమార్లు హత్యాయత్నాలు జరిగిన సంగతి తెలిసిందే. గతేడాది అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచార సమయంలో ట్రంప్‌పై హత్యాయత్నం జరిగింది. పెన్సిల్వేనియాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతుండగా ఓ భవనంపై నక్కిన దుండగుడు కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో ట్రంప్ కుడిచెవికి గాయమైంది. ఆ తర్వాత ఫ్లోరిడాలోని వెస్ట్‌పామ్‌బీచ్‌లో ట్రంప్ గోల్ఫ్ ఆడుతుండగా ఒక వ్యక్తిఫెన్సింగ్ వద్దకు తుపాకీతో రావడాన్ని భద్రతాబలగాలు గుర్తించాయి. అనంతరం కాల్పులు జరిపి అతడిని అరెస్టు చేశారు. కొన్నిరోజుల అనంతరం ట్రంప్ పాల్గొన్న సమావేశం సమీపంలో ఉన్న నేషనల్ కన్వెన్షన్ సమీ పంలో మాస్క్ ధరించి ఓ సాయుధ వ్యక్తిని పోలీ సులు అరెస్టు చేసినట్లు సమాచారం. ఆ వ్యక్తి తన వీపున తగిలించుకున్న బ్యాగులో ఎకె-47 తుపాకీని మోసుకెళ్లినట్లు ఫాక్స్ న్యూస్ పేర్కొంది.

# మహారాష్ట్ర ఎంపి కారుడ్రైవర్‌కు రూ.150 కోట్ల భూమి గిఫ్ట్‌డీడ్

## ఆర్థికనేరాల విభాగం దర్యాప్తు షురూ

**ముంబయి,జూన్ 28:** శివసేన ఎంపీ వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్న వ్యక్తికి దాదాపు రూ. 150 కోట్ల విలువైన భూమి బహుమతిగా రావడం మహారాష్ట్రలో తీవ్ర చర్చనీయాంశమైంది. హైదరా బాద్ నిజాం కాలంలో దివాన్‌లుగా పనిచేసిన సాలార్ జంగ్ కుటుంబ వారసులు ఈ భారీ కానుకను ఇవ్వడం, దీనిపై ఓ న్యాయవాది ఫిర్యాదు చేయడంతో పోలీసులు రంగంలోకి దిగారు. ఛత్రపతి శంభాజీ నగర్ పోలీసుల ఆర్థిక నేరాల విభాగం ఈ వ్యవహారంపై ప్రాథమిక విచారణ ప్రారంభించింది. శివసేన ఎంపీ సందీపన్ భుమ్రే, ఆయన కుమారుడు, పైఠాన్ ఎమ్మెల్యే విలాస్ భుమ్రే వద్ద గత 13 ఏళ్లుగా జావేద్ రసూల్ షేక్ అనే వ్యక్తి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల ఛత్రపతి శంభాజీ నగర్‌లోని అత్యంత విలువైన 3 ఎకరాల భూమిని జావేద్ షేక్ పేరిట బదిలీ చేశారు. ఈ భూమిని సాలార్ జంగ్ కుటుంబానికి చెందిన మీర్ మహమూద్ అలీ మజార్ అలీ ఖాన్ మరో ఐదుగురు వారసులు కలిసి బహుమతి దస్తావేజు ద్వారా షేక్‌కు అప్పగించారు. ప్రస్తుతం ఆ భూమికి సంబంధించి షేక్‌ను యజమానిగా పేర్కొంటూ బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. ఈ భూ బదిలీపై అడ్వకేట్ ముజాహిద్ ఖాన్ అనుమానాలు వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సాలార్ జంగ్ వారసులు ఈ భూమి కోసం చాలాకాలం న్యాయపోరాటం చేసి, 2022లో తమకు అనుకూలంగా తీర్పు పొందారని ఆయన గుర్తుచేశారు. ఏళ్ల తరబడి న్యాయపోరాటం చేసి గెలుచుకున్న భూమిని, ఎలాంటి రక్త సంబంధం లేని షేక్‌కు సాలార్ జంగ్ కుటుంబం ఎందుకు బహుమతిగా ఇస్తుందని ఆయన తన ఫిర్యాదులో ప్రశ్నించారు. ఈ ఫిర్యాదు ఆధారంగా ఈవోడబ్ల్యూ అధికారులు దర్యాప్తు మొదలుపెట్టారు. ఈ విషయంపై పోలీసులు తనను సంప్రదించినట్లు ఎమ్మెల్యే విలాస్ భుమ్రే అంగీకరించారు. షేక్ మా కుటుంబంతో ఎన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్నాడని



పోలీసులు ఫోన్ చేసి అడిగారని తెలిపారు. కుటుంబం నుంచి భూమి బదిలీ గురించి ప్రశ్నించగా దాని గురించి నాకు పూర్తి వివరాలు తెలియవని ఆయన బదులిచ్చారు. మరోవైపు, సాలార్ జంగ్ కుటుంబ సభ్యులతో తనకు మంచి పరిచయం ఉండటం వల్లే వారు భూమిని బహుమతిగా ఇచ్చారని షేక్ పోలీసులకు చెప్పినట్టు సమాచారం. ఈ వ్యవహారంపై ప్రాథమిక విచారణ కొనసాగుతోందని ఛత్రపతి శంభాజీ నగర్ సీనియర్ పోలీస్ అధికారులు ధ్రువీకరించారు. హిబానామాపై సంతకాలు చేసిన సాలార్ జంగ్ కుటుంబ సభ్యులతో సహా సంబంధిత పార్టీలకు సమన్లు జారీచేసినట్లు వారు తెలిపారు. భూబదిలీ పత్రాలను, డ్రైవర్‌కు, రాజకుటుంబ వారసులకు మధ్య ఉన్న సంబంధంపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.



# అణుఒప్పందం కావాలనుకుంటే.. ఖమేనీని ట్రంప్ మర్యాదగా సంబోధించాలి: ఇరాన్

**టెహ్రాన్, జూన్ 28:** ఇరాన్ సుప్రీంలీడర్ అయతుల్లా అలీ ఖమేనిని ఉద్దేశిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను టెహ్రాన్ ఖండించింది. తమతో నిజంగా అణు ఒప్పందం కావాలనుకుంటే ఖమేనీని మర్యాదగా సంబోధించాలని ట్రంప్‌నకు ఆ దేశ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ సూచించారు. ఖమేనీ హత్యకు గురికాకుండా రక్షించామని ఆయన కృతజ్ఞత లేనివాడని ఆరోపిస్తూ ట్రంప్ ట్రూత్ సోషల్‌లో ఓ పోస్టు పెట్టారు. 'ఖమేనీ ఎక్కడ ఆశ్రయం పొందారో నాకు కచ్చితంగా తెలుసు. ప్రపంచంలో అత్యంత శక్తిమంతమైన అమెరికా, ఇజ్రాయెల్ దళాల చేతుల్లో ఆయన జీవితాన్ని ముగించనివ్వలేదు. నేను అతనిని అతి ఘోరమైన చావు నుంచి రక్షించాను. అయినా, నాకు ధన్యవాదాలు తెలపలేదు' అని ట్రంప్ రాసుకొచ్చారు. ఈ సందర్భంగా ఇరాన్‌పై ఉన్న ఆంక్షలను సడలించే విషయాన్ని తాను ఇటీవల పరిశీలించానని తెలిపారు. అయినా, తనపై కోపం, ద్వేషంతో కూడా ప్రకటనలు వస్తూనే ఉన్నాయని, అందుకే ఆంక్షల నుంచి ఉపశమనం కలిగించే విషయాన్ని విరమించుకున్నానని వెల్లడించారు.

ఖమేనీని ఉద్దేశిస్తూ ట్రంప్ చేసిన పోస్టుపై ఇరాన్ విదేశాంగ మంత్రి అరాగ్చీ స్పందిస్తూ.. ఖమేనీని అగౌరవంగా సంబోధించడాన్ని ఆయన ఖండించారు. ట్రంప్ నిజంగా తమతో ఒప్పందం జరగాలని భావిస్తుంటే తమ సుప్రీం లీడర్‌ను మర్యాదగా సంబోధించాలని సూచించారు. లక్షల మంది ఖమేనీ మద్దతుదారుల మనోభావాలను దెబ్బతీయొద్దంటూ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఇరాన్ ప్రజలు తమ ధైర్యాన్ని ప్రపంచానికి చూపారన్నారు. ఇజ్రాయెల్‌కు మరో దారి లేక ట్రంప్ వద్దకు పరుగెత్తుకెళ్లిందన్నారు.

**ఖమేని హత్యకు బెదరింపులు..**

ఇదిలా ఉండగా.. ఖమేనీని హత్య చేస్తామంటూ అమెరికా, ఇజ్రాయెల్‌లు బహిరంగంగా బెదరింపులకు పాల్పడటంపై ఇరాన్ తీవ్రంగా మండిపడింది. ఇది ఉగ్రవాదానికి స్పష్టమైన ఉదాహరణ అని ఐక్యరాజ్య సమితిలోని ఇరాన్ శాశ్వత ప్రతినిధి ఆరోపించారు. ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్న వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన ఐరాసలో కోరారు.

# దెబ్బతిన్న అణు కేంద్రాలకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు

## సత్వర పునరుద్ధరణకు ఇరాన్ సన్నాహాలు




**టెహ్రాన్,జూన్ 28:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ అమెరికా జరిపిన భారీ వైమానిక దాడుల నుంచి ఇరాన్ వేగంగా కోలుకునే ప్రయత్నాలు ప్రారంభించింది. తమ అణు కేంద్రంపై బాంబుల వర్షం కురిపించిన వారం తిరగకముందే, దెబ్బతిన్న ఫోర్డో ఇంధన శుద్ధి కర్మాగారం (ఎఫ్‌ఎఫ్‌ఈపీ) వద్ద మరమ్మతు పనులను ముమ్మరం చేసింది. మాక్సర్ టెక్నాలజీస్ విడుదల చేసిన తాజా శాటిలైట్ చిత్రాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ఫోర్డో అణు కేంద్రం ఉన్న పర్వత ప్రాంతంలో నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నట్టు శాటిలైట్ చిత్రాలు చూపిస్తున్నాయి. అమెరికా దాడులతో ఏర్పడిన శిథిలాలను తొలగించేందుకు ఎక్స్‌కవేటర్లు, బుల్డోజర్లను పెద్ద ఎత్తున వినియోగిస్తున్నారు. ముఖ్యంగా, అమెరికాకు చెందిన శక్తివంతమైన జీబీయూ57 'బంకర్ బస్టర్' బాంబులు లక్ష్యంగా చేసుకున్న సొరంగ మార్గాల వద్ద ఈ పనులు కేంద్రీకృతమయ్యాయి. భూగర్భంలో ఉన్న అణు కేంద్రానికి ఈ మార్గాలు అత్యంత కీలకమైనవి. ఇంతేకాకుండా, పర్వతం పైకి కొత్తగా యాక్సెస్ రోడ్లను నిర్మిస్తున్న ఆనవాళ్లు కూడా కనిపిస్తున్నాయి. దెబ్బతిన్న మౌలిక సదుపాయాలను పునరుద్ధరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఈ చిత్రాల ద్వారా స్పష్టమవుతోంది. దాడుల వల్ల లోపల జరిగిన నష్టాన్ని అంచనా వేయడానికి, పునరుద్ధరణ పనులు చేపట్టడానికి ఇరాన్ అధికారులు ప్రయత్నిస్తున్నట్టు విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, ఈ మరమ్మతు పనులపై ఇరాన్ ప్రభుత్వం ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి ప్రకటనా చేయలేదు. ఇరాన్ చర్యలను రాయల్ యునైటెడ్ సర్వీసెస్ ఇనిస్టిట్యూట్ (ఆర్‌యూఎస్‌ఐ) అనే సంస్థ తన మార్చి నివేదికలోనే అంచనా వేసింది. ఇరాన్‌పై దాడులు జరిగితే, ఆ దేశం పునర్నిర్మాణ ప్రయత్నాలను వెంటనే ప్రారంభిస్తుందని ఆ నివేదికలో పేర్కొంది. దాడుల తర్వాత సరఫరాలను, రాకపోకలను పునరుద్ధరించడానికి ఇరాన్ తక్షణమే రంగంలోకి దిగుతుందని తెలిపింది. ప్రస్తుతం ఫోర్డోలో జరుగుతున్న పరిణామాలు ఆ నివేదిక అంచనాలకు అద్దం పడుతున్నాయి. గత వారాంతంలో పశ్చిమాసియాలో ఘర్షణలను తీవ్రతరం చేస్తూ అమెరికా.. ఇరాన్‌లోని ఫోర్డో, నతాంజ్, ఇస్ఫహాన్ అనే మూడు కీలక అణు కేంద్రాలపై వైమానిక దాడులు జరిపిన విషయం తెలిసిందే. ఈ దాడుల తర్వాత ఇరాన్ ఇంత వేగంగా స్పందించడం అంతర్జాతీయంగా చర్చనీయాంశంగా మారింది.




## చట్టాలు ఉల్లంఘిస్తే గ్రీన్‌కార్డులు కూడా రద్దుచేస్తాం

### అమెరికా ఇమ్మిగ్రేషన్‌శాఖ

**వాషింగ్టన్,జూన్ 28:** అమెరికాలో నివసిస్తున్న వలసదారులకు, ముఖ్యంగా గ్రీన్‌కార్డు హోల్డర్లకు ఆ దేశ పౌరసత్వ, ఇమిగ్రేషన్ సేవల విభాగం (యూఎస్‌సీఐఎస్) తాజాగా కీలక హెచ్చరికలు జారీ చేసింది. దేశ చట్టాలను, నిబంధనలను అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తప్పవని, వారి గ్రీన్‌కార్డులు, వీసాలు రద్దు చేయడానికి కూడా వెనుకాడబోమని స్పష్టం చేసింది. ఈ మేరకు యూఎస్‌సీఐఎస్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఒక ప్రకటన విడుదల చేసింది. అమెరికా చట్టాలను ఉల్లంఘించడం, ముఖ్యంగా ఉగ్రవాద కార్యకలాపాలకు మద్దతు ఇవ్వడం లేదా హింసను ప్రోత్సహించడం వంటి తీవ్రమైన నేరాలకు పాల్పడితే, వారి శాశ్వత నివాస హోదాను తక్షణమే రద్దు చేస్తామని తేల్చిచెప్పింది. గ్రీన్‌కార్డు ద్వారా అమెరికాలో శాశ్వత నివాసం పొందడం అనేది ఒక హక్కు కాదని, అది కేవలం ప్రభుత్వం కల్పించే షరతులతో కూడిన సౌలభ్యం మాత్రమేనని యూఎస్‌సీఐఎస్ తన ప్రకటనలో పేర్కొంది.

# హెచ్-1బికి ప్రత్యామ్నాయంగా ఓ-1 వీసా!

## అమెరికా వెళ్లేందుకు వీసా వ్యవహారంలో అగ్రరాజ్యం కఠిన వైఖరి

**న్యూఢిల్లీ, జూన్28:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న కఠిన వైఖరితో అగ్రరాజ్యానికి వెళ్లేందుకు అనేక సవాళ్లు ఎదురవుతున్నవేళ ఒక్క వీసా మాత్రం తెగ పాపులర్ అవు తోంది. అదే ఓ-1 వీసా. అమెరికా వెళ్లాలనుకునే వృత్తి నిపుణులను ఈ మధ్య తెగ ఆకర్షిస్తోన్న వీసా ఇది. ముఖ్యంగా హెచ్ 1 బికి ప్రత్యామ్నాయంగా మారిన ఓ-1 వీసా కోసం భారతీయులు ప్రయత్నిస్తున్నారు. యూఎస్ ఇమిగ్రేషన్ యాక్ట్ 1990 కింద ఈ ఓ 1 వీసాను ప్రవేశపెట్టారు. సైన్స్, టెక్నాలజీ, విద్య, వ్యాపారం, అథ్లెటిక్స్, ఆర్ట్స్ అండ్ ఫిల్మ్ అసాధారణ ప్రతిభ, నైపుణ్యాలు కలిగిన వారికి, అద్భుత విజయాలు సాధించినవారికి ఈ వీసాలను మంజూరుచేస్తున్నారు. ఈ వీసా కోసం దరఖాస్తు చేసుకునేవారు నిర్ణయించిన ఎనిమిది కఠిన ప్రమాణాల్లో కనీసం మూడైనా కలిగి ఉండాలి. అవార్డులు, స్కాలర్లీ పబ్లికేషన్లు పొందడం లేదా ప్రతిష్టాత్మక సంస్థల్లో సభ్యత్వం కలిగిఉండటం, మీడియా కవరేజీ వంటివి ప్రమాణాలుగా ఉన్నాయి. ఈ వీసాకు పలు ప్రయోజనాలు ఉన్నాయి. ముఖ్యంగా లాటరీ విధానంగానీ, పరిమితులు గానీ లేకపోవడంతో వీసా రాదన్న భయం ఉండదు. ఏటా దరఖాస్తుదారుల్లో 93 శాతం మందికి వీసాలు మంజూరుచేస్తుంటారు. అదే హెచ్ -1 బి అయితే ఆమోదిత రేటు కేవలం 37 శాతమే. ఓ -1 వీసాను తొలుత మూడేళ్ల కాలపరిమితితో జారీ చేస్తారు. ఆ తర్వాత ఎన్నిరసార్లయినా పొడిగించుకోవచ్చు. దీన్ని లాటరీ లేని హెచ్-1 బి వీసాగా అభివర్ణిస్తారు. అమెరికా విదేశాంగ శాఖ గణాంకాల ప్రకారం ఏటా ఈ వీసాల జారీ సంఖ్య క్రమక్రమంగా పెరుగుతోంది.

2020 ఆర్థిక సంవత్సరంలో 8,838 ఓ -1 వీసాలను జారీ చేయగా 2023 ఆర్థిక సంవత్సరంలో ఆ సంఖ్య 18,994కు పెరిగింది. అయితే దీని దరఖాస్తు రుసుము మాత్రం 10వేల డాలర్ల నుంచి 30వేల డాలర్లుగా ఉంది. సాధారణంగా హెచ్-1బి దరఖాస్తుకు అయ్యే ఖర్చు 970 డాలర్ల నుంచి 7,775 డాలర్లుగా ఉంటుంది. ఈ వీసాలను అత్యధికంగా పొందుతున్న వారిలో బ్రిటన్, బ్రెజిల్ తర్వాత భారత్ మూడో స్థానంలో ఉంది. 2020లో 487 మంది భారతీయులకు ఓ-1 వీసా రాగా 2023 నాటికి ఆ సంఖ్య 1418కి పెరిగింది.

ప్రస్తుతం హెచ్1బి వీసాను పొందడం కష్టతరమవుతున్న సమయంలో భారత సైబర్ నిపుణులు, ఎఐ రిసెర్చర్లు, అథ్లెట్లు, డిజిటల్ కంటెంట్ క్రియేటర్లు ఈ ఓ-1 వీసాను అమెరికాకు వెళ్లేందుకు దగ్గరి దారిగా భావిస్తున్నారు. అటు గూగుల్, టెస్లా, ఓపెన్ ఎఐ వంటి దిగ్గజ సంస్థలు కూడా ఓ -1 వీసా రూట్‌లో నియామకాలు చేపట్టేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. హార్వర్డ్, కొలంబియా వంటి విశ్వవిద్యాలయాల్లో ఫ్యాకల్టీ, రీసెర్చర్ల కోసం ఓ -1వీసాతో నైపుణ్యం గల వారిని నియమించుకుంటున్నారు. లాటరీ సమస్య లేకపోవడం, వీసా జారీ రేటు అత్యధికంగా ఉండటంతో భారత వృత్తి నిపుణులు ఎక్కువగా ఈ వీసాను ఆశ్రయిస్తున్నారు.

# వెనిస్‌లో వేడుకగా జెఫ్ బెజోస్, లారెన్ శాంచెజ్ పెళ్లి వేడుక!

**వెనిస్, జూన్ 28:** ప్రపంచ కుబేరుల్లో ఒకరు, అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. 61 యేళ్ల వయసులో తన ప్రియురాలు లారెన్ శాంచెజ్‌ను పెళ్లి చేసుకున్నారు. ఇటలీలోని సుందరనగరమైన వెనిస్‌లోగల లాగూన్ ఐలాండ్‌లో అట్టహాసంగా ఈ వేడుక జరిగింది. పెళ్లి ఫొటోను లారెన్(55) తన ఇన్‌స్టా ఖాతాలో పంచుకున్నారు. అంతేకాదు వివాహం తర్వాత ఈ ఇన్‌స్టా పేజీకి తన పేరును లారెన్ శాంచెజ్‌బెజోస్‌గా మార్చుకున్న ఆమె గతంలో తాను చేసిన పోస్టులన్నింటినీ డిలీట్ చేశారు. కేవలం పెళ్లి వేడుకకు సంబంధించిన రెండు పోస్టులను షేర్ చేశారు. ఈ వివాహ వేడుకకు పలువురు ప్రముఖులు హాజరై కొత్త జంటకు శుభాకాంక్షలు తెలిపారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమార్తె ఇవాంకా, ఆమె భర్త జారెడ్ కుష్నెర్, ప్రముఖ జర్నలిస్ట్ ఓప్రా విన్‌ఫ్రే, కిమ్ కర్దాషియన్, జోర్డాన్ రాణి రనియా తదితరులు ఈ వేడుకకు హాజరయ్యారు. ఈ సందర్భంగా



2.5 మిలియన్ డాలర్ల విలువైన వజ్రాల ఉంగరాన్ని అమెజాన్ అధిపతి ఆమెకు ఇచ్చినట్లు కథనాలు వెలువడ్డాయి.



# నార్వే రాజకుటుంబ వారసుడిపై అత్యాచారం, లైంగిక వేధింపుల కేసులు

**ఓస్లో (నార్వే), జూన్ 28:** నార్వే రాజకుటుంబ వారసుడు, యువరాణి మారిట్ పెద్ద కుమారుడైన మారియోస్ బోర్గ్ హేబి (28)ఐ అత్యాచారం, లైంగిక వేధింపులు, గాయపరచడం వంటి పలు అభియోగాలతో కేసులు నమోదు చేసినట్లు ఓస్లో పోలీసులు శుక్రవారం వెల్లడించారు. బాధితుల సంఖ్య రెండంకెలకుపైగా ఉన్న ఈ కేసుల్లో నెలల తరబడి విచారణ అనంతరం అభియోగాల నమోదుకు నిర్ణయించారు. పై ఆరోపణలతో మారియోస్‌ను గతేడాది పలుమార్లు అరెస్టు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. నార్వేలో కలకలం రేపుతున్న ఈ ఉదంతంపై రాజభవనం నుంచి తక్షణం ఎటువంటి స్పందన వెలువడలేదు. మారియోస్ ఇప్పుడు రాజ కుటుంబం నుంచి విడిగా ఉంటున్నాడు. నార్వేకు కాబోయే రాణి అయిన మెత్తె మారిట్ 2001లో హాకోన్‌ను వివాహమాడి వార్తల్లో నిలిచారు. అంతకుముందు ఒంటరి తల్లి అయిన ఈమె మాదకద్రవ్యాల కేసులో దోషిగా తేలిన సహచరుడితో స్వేచ్ఛాజీవితం గడిపారు.

# కోల్‌కతా లా కళాశాల అత్యాచార ఘటనలో సెక్యూరిటీ గార్డు అరెస్టు




**కోల్‌కతా, జూన్ 28:** దేశవ్యాప్తంగా సంచలనం రేపుతున్న దక్షిణ కోల్‌కతా లా కాలేజీ సామూహిక అత్యాచార ఘటనలో పోలీసులు తాజాగా సెక్యూరిటీ గార్డును అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించి ఇది నాలుగో అరెస్టు. అంతకుముందు, ప్రధాన నిందితుడితోపాటు మరో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసు వర్గాల కథనం ప్రకారం.. విద్యార్థినిపై లైంగిక దాడి జరిగిన సమయంలో సెక్యూరిటీ గార్డు ఆ పరిసరాల్లోనే ఉన్నాడు. నిందితుడి సూచనల మేరకు అతడు గార్డు రూమ్‌లో బాధితురాలిని ఒంటరిగా వదిలి వెళ్లిపోయాడు. సహాయం కోసం ఆమె పలుమార్లు వేడుకున్నా అతడు జోక్యం చేసుకోలేదు. ఈ ఘటన గురించి కాలేజీ అధికారులకు లేదా పోలీసులకు ఫిర్యాదు చేయడం సెక్యూరిటీ గార్డు బాధ్యత. కానీ అతడు ఇవేవీ చేయలేదని పోలీసులు చెబుతున్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శించిన విషయం సెక్యూరిటీ గార్డును ప్రశ్నించినప్పుడు స్పష్టమైందని అన్నారు. ఈ నేపథ్యంలో అతడిని అరెస్టు చేసినట్లు తెలుస్తోంది. ఈ నెల 25న సెక్యూరిటీ గార్డు గదిలో బాధితురాలిపై కొన్ని గంటలపాటు లైంగిక దాడి జరిగింది. కాలేజీకి చెందిన తృణమూల్ కాంగ్రెస్ ఛాత్ర పరిషత్ విభాగం మాజీ ప్రెసిడెంట్ మోనోజిత్ మిశ్రా ఈ దారుణానికి పాల్పడగా మిగతా ఇద్దరు అతడికి సహకరించారు. శుక్రవారం ఈ ఘటన వెలుగులోకి రావడంతో కలకలం రేగింది. కాలేజీ మెయిన్ గేట్‌ను లాక్ చేశాక, సెక్యూరిటీ గార్డును గది బయట కూర్చోబెట్టి తనపై దారుణానికి ఒడిగట్టారని బాధితురాలు పేర్కొన్నారు. సెక్యూరిటీ గార్డు అక్కడే ఉన్నా సాయం చేయలేదని తెలిపారు. ప్రధాన నిందితుడైన మోనోజిత్ మిశ్రాను బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. సహ నిందితులు జైబ్ అహ్మద్ (19), ప్రమిత్ ముఖర్జీని పోలీసులు గురువారం అరెస్టు చేశారు.

# సమసమాజానికి పునాదులు వేసిన సంఘసంస్కర్త పివి



## భూభారతితో పేదల భూహక్కులను కాపాడతాం

## పివి మార్గాన్ని ప్రభుత్వం అనుసరిస్తోంది: డి.సిఎం భట్టి

**హైదరాబాద్ (బేగంపేట), జూన్ 28, ప్రభాతవార్త:** సమ సమాజానికి పునాదులు వేసిన సంఘ సంస్కర్త, దివంగత మాజీ ప్రధాని పివి నరసింహారావు అని, ఆర్థిక సంస్కరణల పితామహుడని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. శనివారం పివి నరసింహారావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నెక్లెస్ రోడ్‌లోని పివి ఘాట్ వద్ద ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతోపాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, వివిధ పార్టీల నేతలు నివాళులు అర్పించారు. అనంతరం భట్టివిక్రమార్క మాట్లాడుతూ ప్రధాని ఇందిరాగాంధీ తీసుకువచ్చిన భూసంస్కరణలను ముఖ్యమంత్రిగా రాష్ట్రంలో అమలుచేసి సమ సమాజానికి పునాదులు వేసిన గొప్ప సంస్కర్త అని ఆయన కొనియాడారు. పివి తెలంగాణలో జన్మించడం అందరికీ గర్వకారణ మన్నారు. ముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రిగా, ప్రధానిగా ఆయన తీసుకు వచ్చిన అనేక సంస్కరణలు సమాజానికి గొప్పమేలు చేసాయని అన్నారు. కాంగ్రెస్ పాలన కాలంలో 24 లక్షల ఎకరాల భూములను పేదలకు పంపిణీ చేసామన్నారు. పివి మార్గాన్ని ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ తూచా తప్పకుండా అమలు చేస్తుందని, వారికి జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పిస్తున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. అనంతరం మంత్రులతో కలిసి పివి పోస్టర్‌ను ఆవిష్కరించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ విద్యావ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పుకు పివి శ్రీకారం చుట్టారని, ఈ సందర్భంగా ఆయనను స్మరించుకోవడం బాధ్యత అన్నారు. వంగరలో ఆయన జ్ఞాపకార్థం మెమో రియల్ గార్డును త్వరలో ప్రారంభిస్తామని మంత్రి స్పష్టం చేసారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ బహుభాషావేత్త, ఆర్థిక మేధావి పివి గల్లీ నుంచి ఢిల్లీ పీఠానికి ఎదిగిన గొప్ప రాజకీయ ఎవరెస్ట్ శిఖరం తెలంగాణ ముద్దు బిడ్డ అన్నారు. మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ కేవలం 3 వారాల విదేశీ మారక ద్రవ్యనిల్వలు ఉన్న భారత దేశాన్ని గౌరవ నష్టానికి గురికాకుండా కాపాడిన వారు పివి అని అన్నారు.

**నివాళులర్పించిన ఎంపి ఈటల రాజేందర్**

దివంగత మాజీ ప్రధాని పివి నర్సింహారావు మా హుజూరాబాద్ వాసి అని, ఆయన అంచెలంచెలుగా ఎదిగి ప్రధాని అయ్యారని, శనివారం ఆయన 104వ జయంతి ఉత్సవాలు రాష్ట్రవ్యాప్తంగా జరుపుకుంటు న్నామని అన్నారు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మంచి రెసిడెన్షియల్ స్కూళ్లను పెట్టి ఆణిముత్యాల్లాంటి ఐఎఎస్, ఐపిఎస్ అధికారులను తయారు చేసారన్నారు. విదేశీ విధానాన్ని ప్రపంచ పటం మీద మహోన్నతంగా నిల బెట్టిన వ్యక్తి అంటూ నివాళులర్పించారు.

## మహాన్యూస్ ఛానల్ ఆఫీస్‌పై బిఆర్ఎస్ దాడిని ఖండిస్తున్నాం

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్, జూన్ 28, ప్రభాతవార్త:** రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరం నడిబొడ్డులో కొనసాగుతున్న మహాన్యూస్ ఛానల్ ప్రధాన కార్యాలయంపై బిఆర్ఎస్ కార్యకర్తలు చేసిన దాడిని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తీవ్రంగా ఖండించారు. జర్నలిస్టులు పనిచేస్తున్న సమయంలోనే బిఆర్ఎస్ నాయకులు రాళ్లతో విధ్వంసానికి పాల్పడడం, బీభత్సం సృష్టించడం దుర్మార్గమన్నారు. ఇది ముమ్మాటికీ మీడియా స్వేచ్ఛపై తీవ్రమైన దాడి అని వ్యాఖ్యానించారు. దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని కూనంనేని డిమాండ్ చేశారు.

**జర్నలిస్టు స్వేచ్ఛ మృతికి సంతాపం**

జర్నలిస్టు, కవయిత్రి స్వేచ్ఛ విషాద మరణం పట్ల సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు సంతాపం వ్యక్తం చేశారు. స్వేచ్ఛ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.



**కవితను కలవడం మర్యాదపూర్వకమే : సందోష్‌కుమార్**

బిఆర్ఎస్ నేత, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను తాను కలవడంలో ఎలాంటి రాజకీయ ప్రాధాన్యత లేదని, తన ఆహ్వానం మేరకే మర్యాదపూర్వకంగా కలిసినట్లు సిపిఐ రాజ్యసభ సభ్యుడు పి సంతోష్‌కుమార్ తెలిపారు. వ్యక్తిగత పర్యటనలో భాగంగా హైదరాబాద్‌కు వచ్చానని.. ఈ సందర్భంగా కవిత ఆహ్వానం మేరకు మర్యాదపూర్వకంగా వారి ఇంటికి వెళ్లినట్లు ఎంపి సందోష్ కుమార్ స్పష్టం చేశారు.

## అన్నపూర్ణ క్యాంటీన్ల పేరు మార్చడం హాస్యాస్పదం: కెటిఆర్ ట్వీట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జూన్ 28:** అన్నపూర్ణ క్యాంటీన్ల పేరు మార్చడం హాస్యాస్పదం, సిగ్గుచేటు అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు. శనివారం ఎక్స్ వేదికగా ట్విట్టర్‌లో సిఎం రేవంత్ రెడ్డిపై విమర్శలు చేశారు. రూ.5 భోజనం అన్నపూర్ణ పథకం పేరు మార్చడంపై మండిపడ్డారు. ఢిల్లీ బాసులకు విధేయత కోసం వాళ్ల పేరును మార్చుకోవచ్చు కదా? అని ఎద్దేవా చేశారు. వాళ్ల పేరును రాజీవ్ లేదా జవహర్ గా ఎందుకు మార్చుకోకూడదు? అని ప్రశ్నించారు. బిఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వచ్చాక ఈ అర్థరహిత చర్యలన్నింటినీ రద్దు చేస్తాం అని కెటిఆర్ పేర్కొన్నారు.

## డిగ్రీలో చేరబోయే విద్యార్థులకు అవగాహన కార్యక్రమం

### రేపు ఉన్నత విద్యామండలి, టి-శాట్ అధ్వర్యంలో స్పెషల్ లైవ్ కార్యక్రమం

**హైదరాబాద్, జూన్ 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలో 2025-26 విద్యా సంవత్సరంలో డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరబోయే విద్యార్థులకు వివిధ కోర్సులు, వాటి ద్వారా లభించబోయే ఉపాధి అవకాశాలపై విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించనున్నారు. తెలంగాణ ఉన్నత విద్యా మండలి, టి-శాట్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనుంది. రేపు (సోమవారం) ప్రత్యేక లైవ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు టి- శాట్ సిఇఓ వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో ఇంటర్మీడియట్ పాసైన విద్యార్థులు ఉన్నత విద్య కోసం అండర్ గ్రాడ్యుయేట్ (యూజీ)లో వివిధ కోర్సులలోకి వెళ్లే వారి కోసం రేపు(సోమవారం) ప్రత్యేక ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు వేణుగోపాల్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్‌విద్య పూర్తి చేసుకుని 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి ఉన్నత చదువుల కోసం ఇంజినీరింగ్, డిగ్రీ, పీజీ తదితర కోర్సుల ఎంపికలో విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు స్పెషల్ లైవ్ ప్రొగ్రామ్ నిర్వ హిస్తున్నామని సిఇఓ తెలిపారు. ప్రత్యేక ప్రత్యక్ష ప్రసారకార్యక్రమం సోమ వారం ఉదయం 11 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు టి-శాట్ నిపుణ ఛానల్‌లో 2 గంటలపాటు కొనసాగుతుందన్నారు. ఈ ప్రత్యక్ష ప్రసారానికి ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకృష్టారెడ్డి సలహాలు, సూచ నలు ఇస్తారని.. ఆయనతో విద్యార్థులు వారి తల్లిదండ్రులు నేరుగా లైవ్‌లో మాట్లాడవచ్చని తెలిపారు. ప్రత్యేక ప్రసార కార్యక్రమంలో వైస్‌ఛైర్మన్‌లు ప్రొఫెసర్ ఇ పురుషోత్తం, ప్రొఫెసర్ ఎస్‌కె మహమూద్, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాంవెంకటేష్ తమ సబ్జెక్టులపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తారని వేణు గోపాల్‌రెడ్డి తెలిపారు. ఉన్నత చదువుల కోసం వెళ్లే విద్యార్థులు లైవ్ కార్య క్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సలహాలు, సూచనల కోసం 040-23540326/726 టోల్‌ఫ్రీ నంబర్ 1800 425 4039 నంబర్లకు ఫోన్ చేయాలని బోధనపల్లి వేణుగోపాల్‌రెడ్డి సూచించారు.

## జన్యు మార్పిడి విత్తన బాధితులకు పరిహారం

**హైదరాబాద్, జూన్ 28, ప్రభాతవార్త :** రాష్ట్రంలో జన్యు మార్పిడి విత్తనాల వల్ల నష్టపోయిన రైతులకు రిలీఫ్ దక్కబోతోంది. వ్యవసాయ శాఖ అదేశాలతో జన్యు మార్పిడి మొక్కజొన్న విత్తనాలు నాటి తీవ్రంగా నష్టపోయిన రైతులకు పరిహారం ఇచ్చేందుకు విత్తన కంపెనలు ముందుకొచ్చాయి. ప్రధానంగా రాష్ట్రంలోని ములుగు తదితర జిల్లాల్లో రైతులతో జన్యు మార్పిడి విత్తనాలను వివిధ కంపెనీలు నాటించాయి. అయితే అవి కాస్తా దిగుబడులు రాకపోవడంతో పెట్టుబడి ఖర్చులు సైతం రాకపోవడంతో పెద్ద ఎత్తున రైతులు నష్టపోయారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి రావడంతో వ్యవసాయ శాఖ స్పందించింది. అంతే కాకుండా వ్యవసాయ కమిషన్ కూడా ములుగు ప్రాంతంలో పర్యటించింది. జన్యు మార్పిడి విత్తనాల వల్లే నష్టం వాటిల్లినట్లు అధికారులు నివేదిక ఇచ్చారు. అలాగే ఈ విత్తనాలను సరఫరా చేసిన కంపెనీలను కూడా గుర్తించారు. దీంతో కంపెనీలే ఇందుకు బాధ్యత వహించాలని వ్యవసాయ శాఖ స్పష్టం చేసింది.

## ఉద్యోగాల భర్తీపై మాజీ మంత్రి హారీశ్‌రావు బహిరంగ చర్చకు రావాలి

### ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్




**హైదరాబాద్, జూన్ 28, ప్రభాతవార్త:** ఉద్యోగాల భర్తీ విషయంలో దమ్ముంటే మాజీ మంత్రి హారీశ్‌రావు బహిరంగ చర్చకు రావాలని ఎమ్మెల్సీ డాక్టర్ బల్మూరు వెంకట్ సవాల్ విసిరారు. ఈమేరకు శనివారం ఆయన మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చిన 18 నెలల కాలంలోనే ప్రజా ప్రభుత్వం భర్తీ చేసిన ఉద్యోగాలపై మేము చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు. మీరు యేడాదికి రెండు లక్షల ఉద్యోగాలని చెప్పి, కనీసం 10 ఏండ్ల కాలంలో కూడా 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయలేదన్నారు. జాబ్స్ నోటిఫికేషన్స్ వేసి పరీక్షలు నిర్వహించలేక భర్తీ చేయకుండా వదిలేసిన చరిత్ర గత పాలకులదని అన్నారు. 18 నెలల కాలంలోనే ప్రజా ప్రభుత్వం 58,868 వేలపైగా ఉద్యోగాలు భర్తీ చేసి, వారికి నియామక పత్రాలు అందజేసిందన్నారు. నోటిఫికేషన్స్ వారీగా నియామల విషయంలో అనుమానాలు ఉంటే ఎవరైనా పరిశీలించుకోవచ్చు అన్నారు. నిరుద్యోగుల అండతో అధికారులలోకి ప్రజా ప్రభుత్వం నిరుద్యోగులకు అండగా నిలుస్తుందన్నారు. వారికి ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రజా ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ చేపడుతుందన్నారు. గతంలో ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగ భృతి విషయంలో 10 ఏళ్ల ఎదురు చూడాల్సి వచ్చిందని, అధికారంలో ఉన్నప్పుడు హారీశ్ రావు, నిరుద్యోగులను కలిసేందుకు కూడా అవకాశం లేదన్నారు. వందకు వంద శాతం అన్ని శాఖల్లోని ఖాళీలను గుర్తించి భర్తీ చేస్తామన్నారు.

**నిరుద్యోగులు రెచ్చగొట్టాలని చూస్తున్నారు: పిసిసి జనరల్ సెక్రటరీ చనగానీ దయాకర్**

రాష్ట్రాన్ని పది సంవత్సరాలు పాలించి ఉద్యోగాలు భర్తీ చేయకుండా యువ తను మోసం చేసిందని టిపిసిసి జనరల్ సెక్రటరీ చనగానీ దయాకర్ అన్నారు. శనివారం గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులు హారీష్‌రావు మొదట క్షమాపణ చెప్పాలని, నిరుద్యోగ యువతను మళ్లీ రెచ్చగొట్టి, ఓట్లు పొందాలని బిఆర్ఎస్ పార్టీ చూస్తుందన్నారు. హారీశ్‌రావు చిల్లర రాజకీయాలు మానుకోవాలన్నారు.

యేడాదిలోనే 60 వేల ఉద్యోగాలు భర్తీ కాలేదని హారీష్ రావు నిరూపించగలరా?ఈ విషయంలో తాము బహిరంగ చర్చకు సిద్ధం అన్నారు. నిరుద్యోగుల గురించి కానీ, ఉద్యోగాల భర్తీ గురించి బిఆర్ఎస్ నేతలకు మాట్లాడే అర్హత లేదు అన్నారు. ఉద్యోగాల కల్పనలో తెలంగాణ రాష్ట్రం సాధించిన గొప్ప విజయం అన్నారు. పది సంవత్సరాలు పాలించిన మంత్రిగా ఉండి హారీష్ రావు ఫీజు రీయింబర్స్ ఎందుకు చెల్లించలేదు అని ప్రశ్నించారు. తెలంగాణ యువతతో, నిరుద్యోగ యువతతో బిఆర్ఎస్ పార్టీ చెలగాటం మాడిందన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారని గుర్తు చేశారు. జాబ్ క్యా లెండర్ విడుదల చేసి నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని బాధ్యతతో ప్రభుత్వం గొప్ప నిర్ణయం అన్నారు. బిఆర్ఎస్ పార్టీ కుట్రలను తెలంగాణ యువత తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు.

## దోస్త్ మూడో విడతలో 85,680 మందికి సీట్ల కేటాయింపు

### 30 వరకు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి

### జూలై 1లోపు కాలేజీల్లో చేరాలి

### ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి

**హైదరాబాద్, జూన్ 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే డిగ్రీ ఆన్ లైన్ సర్వీసెస్ తెలంగాణ(దోస్త్)-2025 మూడో విడతలో 85,680 మంది విద్యార్థులకు సీట్ల కేటాయింపు చేశారు. సీట్లు పొందిన విద్యా ర్థులు ఈ నెల 30 వరకు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. దోస్త్ మూడో విడత సీట్ల కేటాయింపును శనివారం విడుదల చేశారు. తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్, దోస్త్-2025 కన్వీనర్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి, కళాశాల విద్య కమిషనర్ శ్రీదేవసేన దోస్త్ సీట్ల కేటాయింపు వివరాలను ప్రకటించారు. దోస్త్ మూడో విడత రిజిస్ట్రేషన్‌లో భాగంగా 82,770 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మూడో విడతలో 96,015 మంది వెబ్ ఆప్షన్లు ఇచ్చారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారిలో 85,680 మందికి సీట్ల కేటాయింపు చేపట్టారు. తక్కువ ఆప్షన్లు ఇచ్చిన కారణంగా 10,335 మందికి మొదటి విడతలో సీట్ల కేటాయింపు చేయలేదు.

మొదటి ప్రాధాన్యత ఇచ్చిన వారిలో 64,181 మం దికి.. ద్వితీయ ప్రాధాన్యత ఇచ్చిన వారిలో 21,499 మందికి సీట్ల కేటా యింపు చేసినట్టు బాలకిష్టారెడ్డి తెలిపారు. మూడో విడత సీట్ల కేటాయింపులో కామర్స్ విద్యార్థులు 35,402 మందికి కేటాయించారు. లైఫ్ సైన్సెస్ 16,099 మందికి, ఫిజికల్ సైన్స్‌లో 20,890 మంది ఉన్నారు. మూడో విడతలో సీటు పొందిన వారు రూ. 500 ..రూ. 1000 ఫీజు చెల్లించి ఈ నెల 30 లోగా సీటు రిజర్వు చేసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు మూడు విడతల్లోనూ సీట్లు పొంది సెల్ఫ్ రిపోర్టింగ్ చేసిన వారు జులై 1వ తేదిలోగా కాలేజీల్లో చేరాలని .. అలా కాలేజీల్లో జులై 1 వరకు చేరక పోతే వారి సీట్లు రద్దవుతుందని ఉన్నత విద్యా మండలి ఛైర్మన్, దోస్త్-2025 కన్వీనర్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి ప్రకటనలో తెలిపారు.

## 42శాతం రిజర్వేషన్లు అమలుచేయకపోతే 'స్థానిక' ఎన్నికలు జరగనివ్వం

### రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్(నాంపల్లి), జూన్ 28, ప్రభాతవార్త :** బిసిలకు రాజ్యాంగబద్ధంగా హామీనిచ్చిన 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికలు జరగనివ్వమని రాజ్యసభ సభ్యుడు, బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర బిసి కమిషన్ మాజీ ఛైర్మన్ డా. వకుళాభరణం కృష్ణమోహన్‌రావు సభాధ్యక్షతన జరిగిన బిసి అఖిలపక్ష రౌండ్‌టేబుల్ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆర్.కృష్ణయ్య బిసిలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేశాకే గ్రామ-నగర స్థానిక సంస్థల ఎన్నికలు జరగాలన్న డిమాండుకు మాజీమంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, సామాజిక శాస్త్ర వేత్త నారగోని, బిసి నాయకులు నీలం వెంకటేష్, అనంతయ్య, అంజి, గొరిగ మల్లేష్, వి.రామ కృష్ణ తదితరులు, 90 బిసి కులసంఘాల ప్రతి నిధులు తీర్మానాల రూపంలో ఏకగ్రీవంగా సమర్థించారని కృష్ణయ్య తెలిపారు. ప్రభుత్వం ఆమోదించిన బిల్లులు ప్రస్తుతం రాష్ట్ర పతి వద్ద పెండింగ్‌లో ఉన్నప్పటికీ ఇప్పటివరకు రాష్ట్రపతిని కలిసేందుకు ఒక్క అఖిలపక్ష ప్రతినిధి బృందాన్ని పంపలేదని వాపోయారు. ఈ దశలో గవర్నర్ కార్యాలయం తక్షణం స్పందించి రాష్ట్రపతికి బిల్లుల సమాచారాన్ని వివరిం చడంతోపాటు ప్రజల అభిప్రాయాన్ని చేర వేయాలని కోరారు. ప్రభుత్వం మోసం చేస్తే మండల కార్యాలయాల వద్ద పెద్దయెత్తున నిరస నలు చేస్తామని హెచ్చరించారు. వి.శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ బిసి జనాభా రాష్ట్రంలో 50 శాతం మించినా తగిన ప్రాతినిధ్యం లేకుండా కొనసాగుతున్న తీరును ఎదుర్కోవాల్సి న తరుణం ఆసన్నమైందన్నారు. డా. వకుళాభరణం కృష్ణ మోహన్ అధ్యక్షోపన్యాసంలో హైకోర్టు తీర్పు ప్రకారం కమిషన్ నివేదికలు, గణాంకాల ఆధారాలు లేకుండా బిసి రిజర్వేషన్ల అమలు సాధ్యపడదు... ప్రభుత్వం ఇప్పటివరకు స్పష్టత చూపలేదు.. బిల్లులను రాష్ట్రపతికి పంపినట్లు చెప్పి ఎన్నికల ప్రక్రియ ఆలస్యం చేస్తోందన్నారు. ఈ పరిస్థితుల్లో బిసి సంఘాల ప్రతినిధులతో కూడిన బృందం గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించనుంది. అలాగే రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు లిఖితపూర్వకంగా వినతిని అందించి రిజర్వేషన్ల అమలుపై తక్షణ నిర్ణయం కోరతామన్నారు. రాష్ట్రపతిని కలిసేందుకు అఖిలపక్ష బృందాన్ని ఏర్పాటు చేయాలన్న తీర్మానాన్ని కూడా ఈ సమావేశంలో ఏకగ్రీతంగా ఆమోదించినట్లు వకుళాభరణం స్పష్టం చేశారు.



సభలో ప్రసంగిస్తున్న ఎంపి ఆర్.కృష్ణయ్య, పాల్గొన్న వకుళాభరణం, శ్రీనివాస్‌గౌడ్, వెంకటేష్ తదితర బిసి నాయకులు

## ర్యాపిడ్ రాగి పేరుతో సరికొత్త వంగడం

### విడుదల చేసిన మెట్ట పంటల పరిశోధన సంస్థ

**హైదరాబాద్, జూన్ 28, ప్రభాతవార్త:** రాగులపై పరిశోధనలు చేసి, ర్యాపిడ్ రాగి పేరుతో ఓ సరికొత్త వంగడాన్ని ఇక్రిశాట్ (అంతర్జాతీయ మెట్ట ప్రాంతాల పంటల పరిశోధన సంస్థ) అభివృద్ధి చేసింది. శనగలు, కందుల తర్వాత స్పీడ్ బ్రీడింగ్ విధానంలో సైంటిస్టులు నాలుగేళ్ల వ్యవధిలోనే దీన్ని తయారు చేశారు. సాంప్రదాయిక రకాల కంటే ఎన్నో రెట్లు మేలైనదిగా గుర్తింపు పొందిన ఈ రకాన్ని ఇక్రిశాట్ విడుదల చేసింది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న వంగడాలతో పంట కాలం 135 రోజులుగా ఉండటంతో ఏడాదికి 2 పంటలు మాత్రమే సాధ్యమవుతున్నాయి.

పండిస్తున్నటు వంటి రాగి పంటకు సగటున 26 29 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత అవసరం. కానీ అంతకంటే తక్కువ టెంపరేచర్ ఉన్నప్పటికీ ఈ కొత్త వంగడం ర్యాపిడ్ రకం పంట అధిక దిగుబడినిస్తుంది. ప్రస్తుతం ఎకరానికి పదిహేను టన్నుల నుంచి ఇరవై టన్నుల దిగుబడి మాత్రమే వస్తుండగా, ఈ ర్యాపిడ్ రాగి సాగుతో ఏడాదికి 75 నుంచి 100 టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు.

## రెండు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణంలో మరో కీలకఅడుగు

### రక్షణ శాఖ భూముల బదలీపై పురపాలక శాఖ, రక్షణ శాఖ ఒప్పందం

**హైదరాబాద్, జూన్ 28, ప్రభాతవార్త:** సికింద్రాబాద్ పరిధిలో నిర్మించనున్న రెండు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణంలో మరో కీలక అడుగు పడింది. ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి సంబంధించిన రక్షణ శాఖ భూముల బదిలీపై పురపాలక శాఖ, రక్షణ శాఖలు ఒప్పందం కుదుర్చుకున్నారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండిఎ), తెలంగాణ రాష్ట్ర ప్రభు త్వం తరపున చీఫ్ ఇంజనీర్ రవీందర్, భారత సైన్యం తరపున హెడ్‌క్వార్టర్స్ తెలంగాణ ఆంధ్ర సబ్ ఏరియా, బ్రిగేడియర్ ఎస్. రాజీవ్, స్టేషన్ కమాండర్‌లు ఎంఓయుపై సంతకాలు చేశారు. సికింద్రాబాద్ ప్రాంతంలో రెండు ఎలివేటెడ్ కారిడార్‌ల నిర్మాణానికి అవసరమైన ఏ1 రక్షణ భూముల బదిలీ కోసం సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్ మెంట్ సెక్రటరీ డా.కె ఇలంబర్తీ, మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, సలహాదారు బ్రిగేడియర్ కె. సోమశంకర్, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వి కర్ణన్, జిఓసి హెక్యూ టిఎఎస్ఎ అజయ్‌మిశ్రాలు పాల్గొన్నారు. బిబీలీది, మేజర్ జనరల్ అజయ్ మిశ్రా, బీవీది బీశీ గితిళీతి మరియు ఇతర సైనిక అధికారులు హాజరయ్యారు. రక్షణ మంత్రిత్వ శాఖ ఎలివేటెడ్ కారిడార్‌ల నిర్మాణానికి గత యేడాది మార్చి 1, అనుమతి మంజూరు చేశారు. ఈ ఒప్పందంలో రక్షణ భూమి బదిలీ, భారత సైన్య ఆస్తుల నిర్మాణం, ఎలివేటెడ్ కారిడార్‌ల నిర్మాణ సమయంలో కీలక స్థాపనల భద్రతకు సంబంధించిన విధానాలు, కాలపరిమితులు పద్ధతులు ఉన్నాయి.



## స్టేషన్ హౌస్‌ఆఫీసర్లు నిబద్ధతతో పనిచేస్తేనే అగ్రస్థానం నిలబెట్టుకోగలం

### సమావేశంలో డిజిపి జితేందర్ వెల్లడి

**హైదరాబాద్, జూన్ 28, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా వున్న స్టేషన్‌హౌస్ ఆఫీసర్లు నిబద్ధతో పనిచేస్తేనే తెలంగాణ పోలీసు శాఖ దేశంలో అగ్రస్థానం నిలబెట్టు కోగలుగుతుందని డిజిపి జితేందర్ అన్నారు. పోలీసులంటే ప్రజలకు గౌరవం పెరిగేలా చూడాలని డిజిపి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా డిజిపి కార్యాలయంలో ఎంపిక చేసిన కొందరు ఎస్‌హెచ్‌ఓలతో శనివారం జరిగిన భేటీలో డిజిపి మాట్లాడుతూ అనేక దేశాల్లో పోలీసులు ప్రజలను మిత్రులుగా చూసేవిధంగా మసలు కోవాలని కోరారు. డిజిపి కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో డిజిపి మాట్లాడుతూ న్యాయం కోసం పోలీసు స్టేషన్లకు వచ్చే వారితో పోలీసులు సహృదయంతో మెలగాలని, ఇలా చేయడం వల్ల ప్రజల మనస్సులను గెలుచుకునే అవకాశం వుంటుందని ఆయన తెలిపారు. ఈ విషయంలో స్టేషన్ హౌస్ ఆఫీసర్లు కీలకంగా వ్యవహరించాలని ఆయన కోరారు. ఏదో కారణంగా పోలీసులు విధుల్లో పక్షపాత దోరణితో వ్యవహరిస్తే దాని ప్రభావం మొత్తం పోలీసు శాఖపై పడుతుందని ఆయన అన్నారు. పోలీసులు ఎట్టి పరిస్థితుల్లోనూ పక్షపాత దోరణికి దూరంగా వుండాలని ఆయన కోరారు. ఇలా చేయడం వల్ల తెలంగాణ పోలీసు విభాగం దే శంలోనే అగ్రస్థానంలో కొనసాగే వీలుంటుందని ఆయన తెలిపారు. ఎస్‌హెచ్‌ఓలు నిజాయితీతో పనిచేస్త చాలావరకు సమస్యలు పరిష్కారమవుతాయని ఆయన అన్నారు. పోలీసు శాఖకు అవసరమైన అన్ని సదుపాయాలను ప్రభుత్వం సమకూరుస్తుందని డిజిపి తెలిపారు. శాంతి భద్రతల నిర్వహణలో ఎస్‌హెచ్‌ఓలు కీలక ంగా వుండాలని ఆయన కోరారు. ఇదే సమయంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలని ఆయన కోరారు. ఇందుకోసం అందరు సమిష్టిగా కృషి చే యాలని ఆయన కోరారు. అక్రమార్కుల భరతం పట్టాలని డిజిపి ఆదేశించారు. ప్రజల ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని ఆయన కోరారు. క్యూఆర్ కోడ్‌లో ప్రజల నుంచి వంద శాతం సంతృప్తి రావాలని డిజిపి కోరారు. ఈ సమావేశంలో శాంతి భద్రతల అదనపు డిజి మహేష్ భగవత్‌తో పాటు ఏఐజి రమణ కుమా ర్, డిఎస్‌పి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## డిజిపి కార్యాలయంలో ఘనంగా పివి జయంతి వేడుకలు

**హైదరాబాద్, జూన్ 28, ప్రభాతవార్త:** దివంగత ప్రధాని పి.వి.నరసింహారావు 104 జయంతి వేడుకలు శనివారం డిజిపి కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శాంతిభద్రతల అదనపు డిజి మహేష్‌భగవత్ పి.వి నరసింహారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దేశానికి పివి చేసిన సేవలను ఆయన కొనియాడారు. ముఖ్యంగా ఆర్థిక రంగంలో పివి చేపట్టిన సంస్కరణలు దేశానికి అప్పట్లో ఎంతో మేలు చేశాయని ఆయన పేర్కొన్నారు. విద్యారంగంతోపాటు భాష, సాంస్కృతిక రంగాలకు కూడా ఆయన ఎనలేని సేవలందించారని మహేష్‌భగవత్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎఐజి రమణకుమార్, డిజిపి కార్యాలయ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ యోగేశ్వరరావు, డిఎస్‌పిలు వేణుగోపాల్, ఉదయ్ భాస్కర్‌సహా డిజిపి కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.

## దేశ ఆర్థిక సంస్కరణ రూపశిల్పి పివి

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, జూన్ 28, ప్రభాతవార్త:** దేశ ఆర్థిక సంస్కరణల రూపశిల్పి పివి నర్సింహారావు అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం భారత మాజీ ప్రధాని పివి నర్సింహారావు 104వ జయంతి సందర్భంగా దేశానికి ఆయన అందించిన సేవలను గుర్తు చేసుకుంటూ నివాళులు అర్పించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, భారత ప్రధానిగా క్లిష్టసమయాల్లో బాధ్యతలు స్వీకరించిన పివి ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన భారతదేశాన్ని భారత ప్రధానిగా తన శక్తియుక్తులతో గట్టెక్కించారని అన్నారు.

రాజకీయాల్లో పివి అపరచాణక్యుడని, ఆయన ఏ పదవి చేపట్టినా అది ప్రజల పక్షంగానే నడిచిందన్నారు. ముఖ్యమంత్రి నుంచి దేశ ప్రధాని వరకు ఆయన ప్రజల మనిషిగానే పనిచేశారని, కవి, రచయిత, అనువాదకుడు, కథకుడు, పాత్రికేయుడిగా ఆయన చేసిన సేవలు వెలకట్టలేనివని అన్నారు. తనకు వారసత్వంగా వచ్చిన భూమిని పేదలకు పంచిన త్యాగశీలి పివి అన్నారు. ఇంతటి గొప్ప వ్యక్తి సేవలను కాంగ్రెస్ విస్మరించినా మోడీ సర్కారు భారత రత్న పురస్కారంతో గౌరవించిందని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి గుర్తు చేశారు.



## పురాతన భారతీయ హిందూస్థానీ శాస్త్రీయ సంగీతం ధ్రుపద్

### ప్రఖ్యాత సంగీతకారుడు మనీష్‌కుమార్

### కళాత్మకంగా ధ్రువ్‌పద్ గురుకులం ఫౌండేషన్ ఆరో స్థాపక దినోత్సవం

**హైదరాబాద్ (రవీంద్రభారతి), జూన్ 28, ప్రభాతవార్త :** శతాబ్దాల క్రితం దేవాలయాల నుండి ఉద్భవించిన పురాతన భారతీయ హిందూస్థానీ శాస్త్రీయ సంగీత రూపమైన ధ్రువ్‌పద్‌ను సంరక్షించడం, ప్రోత్సహించడం, ప్రచారం చేయడం ధ్రువ్‌పద్ గురుకులం ఫౌండేషన్ లక్ష్యమని ప్రఖ్యాత ధ్రుపద్ సంగీత కారుడు, ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మనీష్‌కుమార్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో ధ్రువ్‌పద్ గురుకులం ఫౌండే షన్ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో శనివారంరాత్రి జ్యోతి ప్రకానంచేసి ఫౌండేషన్ ఆరో వార్షికోత్సవాలను లాంఛనంగా ప్రారంభించి ప్రసంగించారు. 2019లో కళాభిమాని విజయరామంతో కలిసి ఈ ఫౌండేషన్‌ను స్థాపించి ఆరేళ్లుగా దేశంలోని వివిధ నగరాలతోపాటు విదేశాల్లో అనేక సంగీత కార్య క్రమాలు, ఉపన్యాసాల ప్రదర్శనలు, దేవాలయాల్లో ధ్రువ్‌పద్ ప్రదర్శనలు నిర్వహిస్తూ యువతరానికి ధ్రుపద్ సంగీతాన్ని పరిచయం, ప్రచారం చేయ డానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఫౌండేషన్ వార్షికోత్సవాన్ని పురస్క రించుకొని ముందుగా సంస్థ విద్యార్థులు బృందంగా రాగభూషణంలో గణేశ వందనంతో ప్రారంభించారు. అనంతరం కొందరు ధ్రుపద్ శైలిలో బృందంగా, వ్యక్తిగతంగా భారతీయ శాస్త్రీయ హిందూస్థానీ సంగీతకచేరితో ఆహూతులను సంగీతలోకంలో విహరింపజేశారు.



## నిజాయితీకి, నిరాడంబరతకు నిలువుటద్దం

### అసెంబ్లీలో పివికి నివాళులు అర్పించిన స్పీకర్

### ప్రసాద్‌కుమార్, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 28:** మాజీ ప్రధాని, స్వర్గీయ పివి నరసింహ రావు జయంతి సందర్భంగా తెలంగాణ శాసనసభ భవనం లాబీ హాల్ లోని చిత్రపటానికి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా లెజిస్లేచర్ సెక్రటరీ డా. వి నరసింహ చార్యులు, ఎమ్మెల్సీలు పివి కుటుంబ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు. స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశానికి పరిపాలన దక్షుడు అయిన పివి నరసింహ రావు జయంతి సందర్భంగా వారికి నా నివాళులు అర్పిస్తున్నట్లు తెలిపారు. దేశానికి ప్రధాని అయిన తెలంగాణ బిడ్డ, ఆర్థికవేత్త, సంస్కరణకర్త, ఈ రోజు దేశ ఆర్థిక సమస్యలను తట్టుకుని నిలబడుతుంది అంటే దానికి కారణం పివి ప్రారంభించిన సంస్కరణలే కారణమన్నారు. భూ సంస్కరణలను కూడా అమలు చేసింది పీవీనే, నిజాయితీ, నిరాడంబరతకు నిలువుటద్దం పీవీనే, వారు చూపించిన బాటలో మనమందరం పయనించాలని చెప్పారు. ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ దేశ ప్రజలు గౌరవించే వ్యక్తి పీవీ, 14 భాషల్లో తెలిసిన బహుభాషా కోవిదుడు మన పీవీ అని పేర్కొన్నారు. మనమందరం ఆయనను గుర్తు పెట్టుకోవాల్సిన అవసరం ఉన్నదని, వారి ఆశయాలను అనుసరించాలని నడవాల్సిన అవసరం ఉన్నదని తెలిపారు.

### ప్రభుత్వ సలహాదారుగా ప్రముఖ అంకాలజిస్ట్

## నోరి దత్తాత్రేయ నియామకం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 28:** ప్రభుత్వ సలహాదారుగా ప్రముఖ ఆంకాలజిస్ట్ డాక్టర్ నోరి దత్తాత్రేయను రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వైద్య పరంగా క్యాన్సర్ కేర్‌లో ప్రివెంటేవ్, క్యూరేటీవ్ అంశంపై ప్రభుత్వానికి సలహాదారుగా విధులు నిర్వహించనున్నారు.

### తొలి క్వార్టర్‌లో రెండు నెలలకు..

## రూ.2,29,720.62 కోట్ల రెవెన్యూ ఆదాయం

**హైదరాబాద్, జూన్ 28, ప్రభాతవార్త:** ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరంలో తొలి క్వార్టర్‌లోని రెండు నెలల కాలానికిగాను రూ.23,425.68 కోట్లు మాత్రమే వచ్చాయి. అంచనా బడ్జెట్‌లో పేర్కొన్న ప్రకారం ఈ ఏడాది రెవెన్యూ రశీదుల అంచనా రూ.2,29,720.62 కోట్లు కాగా, గతేడాది కన్నా ఇదే సమయానికి వచ్చిన రెవెన్యూ కన్నా ఈసారి తగ్గుదల నమోదైంది. గతేడాది మొత్తంగా 10.20 శాతం నమోదు కాగా, ఈ ఏడాది 0.26 శాతానికి తగ్గింది. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) ప్రభుత్వానికి సమర్పించిన నెలల వారీ నివేదికలో వాటి వివరాలను వెల్లడించింది. ఇక కేంద్రం నుండి గ్రాంట్ల రూపంలో రాష్ట్రానికి రూ,22,782.50 కోట్లు రావాల్సి ఉండగా, గడచిన రెండు నెలల్లో కేవలం రూ. 86.73 కోట్లు మాత్రమే వచ్చాయి. అలాగే కేంద్రం నుంచి రాష్ట్రానికి పన్నుల రూపంలో రూ.18,384.19 కోట్లు రావాల్సి ఉండగా, రూ2,192.62 కోట్ల రాబడి వచ్చింది.

## కోర్టు బిల్డింగ్‌పై నుంచి దూకిన కుటుంబం

### భార్య మృతి.. భర్త పరిస్థితి విషమం

### ఇద్దరు పిల్లలు తీవ్రగాయాలు

### సిద్దిపేటకు చెందిన వారిగా గుర్తింపు

### కొనసాగుతున్న విచారణ

**సంగారెడ్డి బ్యూరో, జూన్ 28, ప్రభాతవార్త:** మెదక్ కోర్టు బిల్డింగ్ పై నుంచి ఆరేళ్ల లోపు పిల్లతో పాటు భార్యాభర్తలు దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటనలో భార్య అక్కడిక్కడే మృతి చెందగా భర్త పరిస్థితి విషమంగా ఉన్న విషాద ఘటన మెదక్ జిల్లా కేంద్రంలో శనివారం రాత్రి జరిగింది. స్థానికుల సంచారం మేరకు సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ కు చెందిన దాకొల్ల నవీన్ కు రామాయంపేట మండలం లక్ష్మాపూర్‌కు చెందిన రమ్య(20) తో వివాహం జరిగింది. వీరికి పదేళ్ల లోపు ఇద్దరు పిల్లలు ఉన్నారు. గతంలో బార్య భర్త ల మధ్య ల కుటుంబ విషయంలో గొడవలు జరిగాయి. బార్య కాపురానికి పంపడం లేదన్న కోపం తో అత్తింటి ఇళ్లకు గతంలో సుతిల్ బాంబు వేసి నిప్పు పెట్టిన కేసు ఉన్నట్టు తెలిసింది. ఈ కేసు కోసం ఇద్దరు పిల్లలు, బార్య రమ్య తో పాటు వచ్చాడు. కోర్టులో ఏమి జరిగిందో ఏమో కోర్టు బిల్డింగ్ పై నుంచి రాత్రి 8 గంటల ప్రాంతంలో దూకారు. పిల్లలు, బార్య భర్తలు రక్తం మడుగులో ఉండడం చూసిన కోర్టు సిబ్బంది, ఇతరులు వెళ్ళి చూడగా రమ్య మృతి చెంది ఉండగా నవీన్, ఇద్దరు పిల్లలు రక్తం మడుగులో వేరువేరుగా పడి ఉన్నారు. గాయాలతో కొట్టుమిట్టాడుతున్న ఉన్న ముగ్గురిని ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించి చికిత్స చేయిస్తున్నారు. నవీన్ పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు చెప్పారు. ఘటన స్థలానికి ఏఎస్పీ మహేందర్ రెడ్డితో పాటు పట్టణ పోలీస్ లు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేస్తున్నారు.

## యాంకర్ స్వేచ్ఛ కేసులో లొంగిపోయిన పూర్ణచంద్రనాయక్!

### లేఖ సోషల్‌మీడియాలో వైరల్

**హైదరాబాద్, జూన్28, ప్రభాతవార్త:** ప్రముఖ టీవీ న్యూస్ యాంకర్ స్వేచ్ఛ ఆత్మహత్యకు స్నేహితుడు పూర్ణచంద్రనాయక్ కారణమని ఆమె తండ్రి ఆరోపణలతో ఆయన శనివారం రాత్రి చిక్కడపల్లి పోలీసుల ముందు లొంగిపోయాడు. అనంతరం ఆయన రాసిన బహిరంగలేఖ సోషల్‌మీడియాలో వైరల్ అయింది. స్వేచ్ఛ డిప్రెషన్‌కు తల్లిదండ్రులే కారణమని ఆరోపచిన్నతనం నుంచే ఆమెకు ప్రేమ కరువైందని వెల్లడిస్వేచ్ఛ కుమార్తె బాధ్యతలు తండ్రిలా తానే చూసుకున్నానన్న పూర్ణచంద్రనాయక్ లేఖలో పేర్కొన్నారు. స్వేచ్ఛ మరణానికి తానే కారణమంటూ ఆమె తల్లిదండ్రులు చేస్తున్న ఆరోపణలతో నిజాలు చెప్పాల్సి వస్తోందని ఆయన పేర్కొన్నారు. 2009 నుంచి తెలుసని, ఇద్దరూ కలిసి టీన్యూస్‌లో పనిచేసేటప్పుడు మంచి స్నేహితులయ్యామని వెల్లడించారు. దీంతో స్వేచ్ఛ తన వ్యక్తిగత విషయాలను పంచుకునేది. క్రమక్రమంగా సానిహిత్యం పెరిగిన మాట వాస్తవమని ఆయన అంగీకరించారు. రెండు విడాకుల తర్వాత తీవ్రమైన డిప్రెషన్‌తో బాధపడుతున్న స్వేచ్ఛకు తాను అండగా నిలిచానని వివరించారు. చిన్నతనంలోనే ఆమెకు తల్లిదండ్రుల ప్రేమ కరవైందని తెలిపారు. "గతంలో జనశక్తిలో పనిచేసే ఆమె తల్లిదండ్రులు, ఆరు నెలల వయసులోనే స్వేచ్ఛను బంధువుల వద్ద వదిలేసి వెళ్లారు. సంవత్సరానికి ఒకసారి చుట్టపుచూపుగా వచ్చి వెళ్లేవారని స్వేచ్ఛ ఎన్నోసార్లు నాతో చెప్పి బాధపడింది' అని పూర్ణచంద్రనాయక్ పేర్కొన్నారు. హైదరాబాద్ రాంనగర్‌లోని ఇంట్లో తల్లిదండ్రుల మధ్య నిత్యం జరిగే గొడవల కారణంగా ఆమె ఇంట్లో ఉండలేకపోయేదని ఆయన తెలిపారు. కూతురి బాధ్యతలు నేనే చూసుకున్నాను. పాప బాధ్యతలను దాదాపు నేనే తీసుకున్నాను. ఈ లేఖతో స్వేచ్ఛ ఆత్మహత్య కేసు కొత్త మలుపు తిరిగింది.

# నిరుద్యోగులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

### మాజీమంత్రి హరీశ్‌రావు

### నిరుద్యోగుల చలో సచివాలయానికి బిఆర్ఎస్ సంపూర్ణ మద్దతు




**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 28:** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత నిరుద్యోగులకు ఉద్యోగాలు రాలేదని, కానీ కోదండరాం, ఆకునూరి మురళి, ప్రియాంక గాంధీలకు మాత్రం ఉద్యోగాలు వచ్చాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతను తీవ్రంగా మోసం చేస్తోందని, హామీ ఇచ్చిన జాబ్ క్యాలెండర్‌కు బదులుగా దగా క్యాలెండర్‌ను అమలు చేస్తోందని ఆయన ఆరోపించారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఆయన విద్యార్థులు,నిరుద్యోగులతో సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువత తలపెట్టిన ఛలో సచివాలయం కార్యక్రమానికి తమ పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని ఆయన ప్రకటించారు. ఇచ్చిన హామీలను సాధించు కునేందుకు నిరుద్యోగులకు బీఆర్ఎస్ అండగా నిలు స్తుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. "ఎన్నికల ముందు ఎన్నో ఆశలు కల్పించారు. జాబ్ క్యాలెండర్ ప్రకారం నోటిఫికేషన్లు వస్తాయని యువత ఎంతో నమ్మింది. కానీ అధికారంలోకి వచ్చాక ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వకుండా యువతను మోసం చేశారు. నోటిఫికేషన్లు వద్దంటూ యువతే ధర్నాలు చేస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దుష్ప్రచారం చేయడం దారుణం" అని ఆయన మండిపడ్డారు. తమ బీఆర్ఎస్ పాలనలో 1.62 లక్షల ఉద్యోగాలు కల్పించామని ఈ సందర్భంగా హరీశ్ గుర్తు చేశారు. ప్రియాంక గాంధీ ప్రకటించిన యూత్ డిక్లరేషన్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉండదా? అని హరీశ్ రావు ప్రశ్నించారు. "ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేసేంత వరకు వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు. నిరంతరం వెంటపడి ఆ హామీని నెరవేర్చేలా ఒత్తిడి తెస్తాం" అని ఆయన తేల్చిచెప్పారు. ఈ అంశంపై అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని నిలదీస్తామని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలలో ప్రభుత్వ జాప్యాన్ని కూడా హరీశ్ రావు తప్పుబట్టారు. "ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేస్తే ఎలాంటి కమిషన్లు రావనే ఉద్దేశంతోనే వాటిని నిలిపివేశారా?" అని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నిరుద్యోగుల పక్షాన బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని, వారి హక్కుల సాధనలో ముందుంటుందని భరోసా ఇచ్చారు.

# మహాన్యూస్‌పై దాడి అత్యంత హేయమైన చర్య

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

### ఇది అమానుష చర్య: పొంగులేటి

### దాడులు సహించేది లేదు: కోమటిరెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జూన్28:** ప్రముఖ తెలుగు వార్తా ఛానల్ మహాటీవీ కార్యాలయంపై జరిగిన దాడిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనపై ఆయన ట్విట్టర్ ద్వారా స్పందించారు. మీడియా సంస్థపై దాడి చేయడం అత్యంత హేయమైన చర్య అని, దీనిని తాను తీవ్రంగా ఖండిస్తున్నానని ఆయన స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇటువంటి దాడులకు ఏమాత్రం తావులేదని రేవంత్ రెడ్డి తన ప్రకటనలో పేర్కొన్నారు. మహా న్యూస్ కార్యాలయంపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కూడా ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ప్రజాస్వామ్యంలో హింసకు ఎటువంటి స్థానం లేదని, మీడియా సంస్థలపై దాడులు చేయడం అంటే ప్రజల అభిప్రాయ స్వేచ్ఛను అణచివేయాలనే దురుద్దేశంతో కూడిన చర్య అని ఆయన అన్నారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌కు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఈ ఘటనను నిర్లక్ష్యంగా చూడాలని, ఈ దాడిలో పాలుపంచుకున్నవారితో పాటు, ఈ దాడి వెనుక నిలిచినవారినీ గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను సూచిస్తున్నానని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలను సహించేది లేదని, ప్రజాస్వామ్య విలువలను కాపాడడమే మనందరి బాధ్యత అని ఆయన ఉద్ఘాటించారు. మహాన్యూస్ ఛానల్ కార్యాలయంపై దాడిని రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్రంగా ఖండించారు.

ఇది అమానుష చర్య, మీడియా సంస్థల కార్యాలయాలపై ఈ రకంగా భౌతిక దాడులకు పాల్పడడం, విధ్వంసం సృష్టించడం దారుణమని ఇది పత్రికా స్వేచ్ఛపై దాడి అని ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. సంస్థలు, వ్యవస్థలపై పెయిడ్ ఆర్టిస్ట్ లతో ఈ విధంగా దాడులు చేయించడం ప్రజాస్వామ్యంలో సరైనదికాదని స్పష్టం చేశారు. పార్టీ పరంగా ఛానల్స్ నిర్వహిస్తూ పెయిడ్ ఆర్టిస్ట్ లతో ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా పత్రికా స్వేచ్ఛను దుర్వినియోగపరుస్తూ ప్రభుత్వంపై ఇష్టమొచ్చిన రీతిలో బురద జల్లుతున్నారని అన్నారు.

ఏదైతే నిజాన్ని నిర్భయంగా అధికార పక్షమనో, ప్రతిపక్షమనో తేడా లేకుండా ధైర్యంగా న్యూస్ ప్రచారం చేస్తున్న ఎలక్ట్రానిక్ మీడియా గాని ధైర్యంగా న్యూస్ ప్రచురిస్తున్న ప్రింట్ మీడియాకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజాప్రభుత్వం అండగా ఉంటూ పూర్తి రక్షణ కల్పిస్తామని హామీ ఇచ్చారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి దాడులకు చోటులేదని అన్నారు. న్యూస్ ఛానల్ కార్యాలయంపై దాడికి పాల్పడి హత్యాయత్నానికి ప్రయత్నించిన వారి వెనుక ఎంతటి ఎంత పెద్దవారున్నా వదిలిపెట్టేదిలేదని దోషులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# వైద్య, ఆరోగ్య శాఖలో 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ

### నోటిఫికేషన్‌ను జారీ చేసిన మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు

### జూలై 10 నుంచి దరఖాస్తుల స్వీకరణ

**హైదరాబాద్, జూన్ 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వైద్య, ఆరోగ్య శాఖలో మరో నోటిఫికేషన్ జారీ అయింది. రాష్ట్ర వ్యాప్తంగా డిఎంఈ అధ్వర్యంలో కొనసాగుతున్న సంస్థల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్‌ను శనివారం జారీ చేసింది. 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాల భర్తీకి మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్ నంబర్ 03-2025ను జారీ చేసింది. ఆసక్తి గల అభ్యర్థులు రిక్రూట్‌మెంట్ బోర్డు వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేయాలని సూచించింది. దరఖాస్తులను జూలై 10 నుంచి స్వీకరించబోతున్నట్టు వెల్లడించారు. దరఖాస్తులను జూలై 17, సాయంత్రం 5 గంటల వరకు స్వీకరించనున్నారు. అభ్యర్థులు వారి దరఖాస్తులను జూలై 18, 19 తేదిల్లో ఎడిట్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. ఒకటి కన్నా ఎక్కువ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలనుకునే అభ్యర్థులు వేర్వేరుగా ఒక్కో పోస్టుకు దరఖాస్తు చేయాలని నోటిఫికేషన్‌లో స్పష్టం చేశారు. 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల్లో మల్టీ జోన్-1లో 379 పోస్టులు ఉండగా.. మల్టీ జోన్-2లో 228 పోస్టులు ఉన్నాయి. పోస్టకు ఎంపికైన అభ్యర్థులకు నెలవారీ జీతం యూనివర్సిటీ గ్రాండ్ కమిషన్(యుజిసి) నిబంధనల మేరకు రూ.68,900 నుంచి రూ.2,05,500 ఉంటుందని నోటిఫికేషన్‌లో బోర్డు ప్రకటించింది. అభ్యర్థులు 18 నుంచి 46 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బిసి, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 5 సంవత్సరాలు, ఎక్స్ సర్వీస్ మెన్‌కి 3 సంవత్సరాలు, పిహెచ్‌సి వారికి 10 సంవత్సరాల మినహాయింపును ఇచ్చారు.

# కన్నతల్లిపై పెట్రోల్ పోసి కాల్చిన కసాయి

### నిందితుని కోసం

### గాలిస్తున్న పోలీసులు

**సంగెం, జూన్ 28, ప్రభాతవార్త:** కన్నతల్లిపై పెట్రోలు పోసి కాల్చిన కసాయి కొడుకు ఉదంతం ఇది. వరంగల్ జిల్లా సంగెం మండల పోలీస్‌స్టేషన్ కూత వేటు పరిధిలో గల కుంటపల్లి గ్రామానికి చెందిన ముత్తినేని వినోద(50) భర్త సాంబయ్య వీరికి కుమారుడు, కూతురు కలరు వీరిద్దరికి వివాహం గావించారు. వీరికి ఉండబడే వ్యవసాయ భూమి సంగెం గీసుగొండ పరిధిలోని టెక్స్‌టైల్ పార్కులో భూమి కోల్పోగా అట్టి భూమికి ప్రభుత్వం కట్టిచ్చిన రూ.6 లక్షలు నాకే ఇవ్వాలని తల్లి దండ్రులతో నిత్యం గొడవ పెట్టుకుంటూ ఉండవాడు. ఈ గొడవ పెట్టుకునే తరుణంలో ఇంటి నుండి కుమారుడు సతీష్ భార్య భర్తలతో కలిసి గీసుగొండ మండలం గంగదేవిపల్లిలో కిరాయికి ఉంటున్నాడు. ఆరు లక్షల రూపాయల్లో కూతురికి మూడు లక్షలు, కుమారుడికి మూడు లక్షలు ఇవ్వడంతో కూతురికి మూడు లక్షలు ఇచ్చినారనే కోపంతో గంగదేవిపల్లిలో ఉంటున్న కుమారుడు సతీష్ గురువారం రాత్రి స్వగ్రామమైన కుంటపల్లి బైకుపై వచ్చి ఇంటిముందు ఆరు బయట తల్లిదండ్రులు నిద్రిస్తున్న క్రమంలో డబ్బుల గురించి తల్లిని లేపి గొడవ పడుతూ తమ వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను తల్లిపై పోసి అతి కిరాతకంగా అగ్గిపుల్లి గీకి నిప్పంటించాడు. ఈ నేపథ్యంలో భర్త సాంబయ్య లేచి అరుపులు అరుస్తుండగా చుట్టు పక్కల ఇండ్ల వారు హుటాహుటిన వచ్చిన అంబులెన్స్ ద్వారా బాధితురాలిని ఎంజిఎంకు తరలించారు. ఎంజిఎంలో చికిత్స పొందుతున్న బాధితురాలు వినోద 80 శాతం కాలినట్లు వైద్యులు ధృవీకరించారు. బాధితురాలి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వారు పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంగెం ఎస్ఐ నరేష్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. నిందితుని కోసం గలింపు చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు.



బాధితురాలు వినోద (ఫైల్)

# మంజీరా బ్యారేజీకి ముప్పులేదు

### మంజీరా డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్టు

### ఆధునికీకరణ కోసం రూ. 600 కోట్లు

### రూ. 3.52 కోట్లతో తక్షణ మరమ్మతులు

### బ్యారేజీని సందర్శించిన జలమండలి ఎండి అశోక్‌రెడ్డి

**హైదరాబాద్, జూన్ 28, ప్రభాతవార్త:** హైదరాబాద్ మహానగరానికి తాగునీరు అందించే మంజీరా బ్యారేజీకి ఎలాంటి ముప్పులేదని జలమండలి ఎండి అశోక్‌రెడ్డి స్పష్టం చేశారు. జలమండలి ఉన్నతాధికారులతో కలిసి శనివారం మంజీరా బ్యారేజ్, బారాజ్ గేట్లు, బారాజ్ పిల్లర్లు, పంప్‌హౌజ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎండి మాట్లాడుతూ హైదరాబాద్ నగరానికి మంచినీరు అందించడానికి నిర్మించిన మంజీరా బ్యారేజ్‌కు ఎలాంటి ప్రమాదం లేదని, వివిధ మాధ్యమాల్లో బ్యారేజ్ పిల్లర్లకు పగుళ్లు వచ్చాయన్న వార్తలు అవాస్తవమని చెప్పారు. అలాగే బ్యారేజ్‌కి సంబంధించిన గేట్లు, రోప్‌ల పనితీరు కూడా సంతృప్తిగానే ఉన్నట్లు చెప్పారు. అయితే బ్యారేజ్ దిగువన అప్రాన్ కొంతమేరకు దెబ్బతిన్నదని వెంటనే మరమ్మత్తులకోసం ఏజెన్సీతో మాట్లాడి యుద్ధ ప్రాతివదికన పనులు చేపట్టాలని ఆదేశించినట్లు తెలిపారు. అలాగే రెండవగేటు లీకేజీను అరికట్టడానికి మరమ్మత్తు పనులను చేపట్టాలని స్వప్న ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెడ్ నిర్మాణ సంస్థకు సూచించారు. బ్యారేజీపై గేట్లు, రోలర్, ప్యానల్ బోర్డ్స్, ఎలక్ట్రో మెకానికల్ తదితర భాగాలను పరిశీలించిన ఎండి ఎప్పటికప్పుడు గ్రీజు, కలరింగ్, లైటింగ్ తదితర ఏర్పాట్లను చేసుకోవాలని అధికారులకు సూచించారు. స్పిల్‌వే ఇరుప్రక్కల్లో ఫెన్సింగ్ ఏర్పాటుచేసి మానవ సంచారం నిరోధించాలని తెలిపారు. అలాగే ఆనకట్టపై మొలిచిన చెట్లు, కంపచెట్ల తొలగింపు వారంలోపల పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. మాంజీరా బ్యారేజ్ 65 సంవత్సరాల క్రితం నిర్మితమైందని, అప్పుడు బిగించిన గేట్లు ప్రతీయేటా నిర్వహణపనులు చేపడుతున్నా గేట్లు, రోప్‌లు, బేరింగ్‌లను మార్చాలని అధికారులు అంచనా వేశారని అన్నారు. దానికనుగుణంగా గత యేడాది మే నెలలో 3.52 కోట్లతో ప్రతిపాదనలను పూర్తిచేసి, టెండర్ ప్రక్రియ పూర్తిచేసి ఏజెన్సీని నియమించామని వివరించారు. ఏజెన్సీ గేట్ల బిగింపు కాకుండా మిగతా పనులను పురోగతిలో ఉన్నట్టు.. ఆ తరువాతే స్టేట్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ రిపోర్ట్ శుక్రవారమే సమర్పించిందని చెప్పారు. బ్యారేజీ పై గేట్లను మార్చడానికి దాదాపు 45 రోజులు పడుతుందని అంచనా వేస్తున్నట్టు, అలాగే జలాశయంలోని మొత్తం నీటిని ఎండిఎల్ దిగువకు వదలవలసిన పరిస్థితి ఏర్పడుతుందని చెప్పారు. అన్నిరోజులు హైదరాబాద్ నగరానికి 40 ఎంజిడిల నీటి కొరత ఏర్పడుతుందని వివరించారు. భవిష్యత్తు అవసరాలకోసం మాంజీరా డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్టును ఆధునికీకరణ పనులకోసం రూ. 600 కోట్లతో డిపిఆర్‌ను రూపొందించి ప్రభుత్వానికి సమర్పించారు. దానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధునికీకరణ పనులతోపాటు ఇప్పుడున్న మాంజీరా ఫేస్ 1,2 మంచినీరు సరఫరా పైపులైనులతోపాటు మరో కొత్త పైపులైనును నిర్మించాలని సూచించారు.

# త్వరలో ఉద్యోగులకు నూతన ఆరోగ్య పథకం

### మంత్రి దామోదర రాజనర్సింహా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జూన్ 28:** రాష్ట్రంలో ఉద్యోగుల నూతన ఆరోగ్య పథకంపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అందులో భాగంగా త్వరలోనే ఈ పథకంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని ఆరోగ్య మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. శనివారం సచివాలయంలో తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ లచ్చిరెడ్డి, ఇతర సభ్యులు మంత్రి దామోదర రాజనర్సింహాను కలిశారు. ఉద్యోగుల హెల్త్ స్కీమ్ అమలుకు వెంటనే చర్యలు తీసుకోవాలని మంత్రికి వారు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు త్వరలోనే నూతన ఆరోగ్య పథకం తీసుకురాబోతున్నట్లు మంత్రి దామోదర వారికి హామీ ఇచ్చారు. ఏ ఉద్యోగి కూడా బిల్లుల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండదని ఆయన తెలిపారు. గతంలో ఉద్యోగుల జేఏసీ ఏ పథకం కావాలని కోరిందో ఇప్పుడు అదే పథకం అందుబాటులోకి రాబోతుందని మంత్రి దామోదర వారికి హామీనిచ్చారు. కాగా, ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రభుత్వం మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులకు సంబంధించిన నిధులను ఇటీవల విడుదల చేసిన విషయం తెలిసిందే.

## ఫిలింనగర్‌లో 'మహాన్యూస్' ఆఫీసుపై బిఆర్ఎస్ కార్యకర్తల దాడి

**హైదరాబాద్ (పంజగుట్ట), జూన్ 28, ప్రభాతవార్త:** ఫిలింనగర్‌లో మహాన్యూస్ ఛానల్ కార్యాలయంపై శనివారం బిఆర్ఎస్ శ్రేణులు దాడికి పాల్పడ్డారు. మాజీమంత్రి కెటిఆర్‌పై ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి ఇటీవల ఆ ఛానల్‌లో వార్తలు ప్రసార మయ్యాయి. ఈ విషయమై కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా కూడా స్పందించారు. ఆయన స్పందించిన కొద్దిసేపటికే బిఆర్ఎస్ కార్యకర్తలు పలువురు ఆ ఛానల్ వద్దకు పెద్దఎత్తున చేరుకుని నిరసనకు దిగారు. నిరసన కార్యక్రమం కాస్తా ఉద్రిక్తంగా మారి కొందరు ఛానల్ బయట ఉన్న వాహనాలపై రాళ్లు రువ్వారు. దీంతో అక్కడకు మరి కొంతమంది చేరుకుని ఛానల్ కార్యాలయంలోకి చొరబడ్డారు. అక్కడ ఫర్నిచర్‌ను, ఇతర వస్తువులను ధ్వంసం చేశారు. ఛానల్ డోర్‌ను కూడా పగులగొట్టుకుని లోపలికి చొరబడి మరీ విధ్వంసం సృష్టించారు. ఈ సందర్భంగా ఛానల్ సిబ్బందికి, బీఆర్ ఎస్ కార్యకర్తలకు మధ్య స్వల్పవాగ్వివాదం కూడా జరిగింది. వెంటనే సమాచార మందుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని అల్లరి మూకలను చెదర గొట్టారు. దాడికి పాల్పడిన వ్యక్తులు ఎవరు అనే విషయంలో పోలీసులు సీసీ టీవీ పుటేజ్‌లు ఆధారంగా వివరాలు సేకరిస్తున్నారు. దాడి విషయమై ప్రాథమికంగా కేసునమోదు చేసుకుని పోలీసులు విచారణ ప్రారంభించారు.

**చంద్రబాబు ఖండన..**

'మహాన్యూస్' న్యూస్‌ఛానల్‌పై దాడిని ఎపి సిఎం చంద్రబాబునాయుడు తీవ్రంగా ఖండించారు. అదేవిధంగా డిప్యూటీ సిఎం పవన్‌కల్యాన్‌తోపాటు ఇతర మంత్రులు దాడి ఘటనపై తీవ్రంగా ఖండించారు. పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, కేంద్రమంత్రి బండి సంజయ్‌సహా పలువురు ప్రముఖులు ఛానల్‌పై దాడిపట్ల ఖండనలు చేశారు.

## బిఆర్ఎస్వీ నేత గెల్లు శ్రీనివాస్‌యాదవ్ అరెస్ట్

**హైదరాబాద్, జూన్ 28, ప్రభాతవార్త:** మహాన్యూస్ ఛానల్ కార్యాలయంపై దాడికి పాల్పడిన బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌ను శనివారం రాత్రి బంజారాహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఉదయం



ఫోన్‌ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను టార్గెట్ చేస్తూ వరుసగా అసత్యప్రసారాలు చేస్తున్నారనే ఆరోపణలతో పెద్ద ఎత్తున బీఆర్ఎస్ నేతలు ఛానల్ కార్యాలయంకు వచ్చి దాడికి పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో సీసీ ఫుటేజీల ఆధారంగా ప్రధాన నిందితుడు తెలంగాణ భవన్‌లో ఉన్న ఆయనను అదుపులోకి తీసుకున్నారు.

## 'రా' చీఫ్‌గా పరాగ్‌జైన్

### రేపటితో ముగియనున్న రవిసిన్హా పదవీకాలం

### ఆపరేషన్ సిందూర్‌లో పరాగ్ కీలక పాత్ర

**న్యూఢిల్లీ, జూన్ 28:** భారత గూఢచార సంస్థ రీసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్ (రా) నూతన అధిపతిగా సీనియర్ ఐపీఎస్ అధికారి పరాగ్ జైన్‌ను కేంద్ర ప్రభుత్వం నియమించింది. ప్రస్తుత చీఫ్ రవి సిన్హా పదవీకాలం ఈనెల 30తో ముగియనున్న నేపథ్యంలో ఈ నియామకం జరిగింది. జూలై 1 నుంచి పరాగ్ జైన్ రెండేళ్ల పాటు ఈ కీలక బాధ్యతలను నిర్వర్తిస్తారు. 1989 బ్యాచ్‌కు చెందిన పంజాబ్ కేడర్ ఐపీఎస్ అధికారి అయిన పరాగ్ జైన్, గతంలో పంజాబ్ డీజీపీగా కూడా సేవలు అందించారు. 2021 జనవరి 1న ఆయన డీజీపీ హోదా పొందారు. ఆయన నియామకానికి క్యాబినెట్ నియామకాల కమిటీ ఈనెల 2వ తేదీనే ఆమోదముద్ర వేసింది. గూఢచార వర్గాల్లో పరాగ్ జైన్‌కు 'సూపర్ స్లూత్' అనే పేరుంది. మానవ మేధస్సు (హ్యూమింట్), సాంకేతిక మేధస్సును (టెక్ఇంట్) సమర్థవంతంగా మిళితం చేసి క్లిష్టమైన ఆపరేషన్లను విజయవంతం చేయడంలో ఆయన దిట్ట అని అధికారులు చెబుతుంటారు. ఈ నైపుణ్యమే అత్యున్నత స్థాయి ఆపరేషన్లకు కీలకంగా నిలుస్తుందని వారు వివరిస్తున్నారు. ఇటీవల పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పీఓకే) లక్ష్యంగా చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'లో పరాగ్ జైన్ కీలక పాత్ర పోషించారు. ఉగ్రవాద మౌలిక సదుపాయాలపై కచ్చితమైన దాడులు చేసేందుకు ఆయన బృందం అందించిన ఇంటెలిజెన్స్ సమాచారం భారత బలగాలకు ఎంతగానో ఉపయోగపడింది. వీటితో పాటు, జమ్మూ కాశ్మీర్‌లో పనిచేసిన సుదీర్ఘ అనుభవం కూడా పరాగ్ జైన్‌ను ఈ పదవికి ఎంపిక చేయడంలో దోహదపడింది. గతంలో ఆయన కెనడా, శ్రీలంక వంటి దేశాల్లోనూ భారత ప్రతినిధిగా దౌత్యపరమైన సేవలు అందించారు.

## రాజనీతికి నిలువెత్తు నిదర్శనం పివి

### పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

### గాంధీభవన్‌లో ఘన నివాళులు అర్పించిన నేతలు

**హైదరాబాద్, జూన్ 28, ప్రభాతవార్త:** నిరాడంబర జీవితానికి, రాజనీతికి నిలువెత్తు నిదర్శనం పివి నరసింహారావు అని టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. భారతరత్న, మాజీ ప్రధానమంత్రి పి.వి. నరసింహారావు జయంతిని పురస్కరించుకుని ఆయనకు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ పివి నరసింహారావు రాజకీయవేత్త మాత్రమే కాదు, ఆయన ఒక బహుభాషా వేత్త, కవి, రచయిత, జర్నలిస్టు, అనువాదకుడిగా అపార జ్ఞానాన్ని సంపాదించిన మహోన్నత వ్యక్తిత్వం అన్నారు. దేశానికి, కాంగ్రెస్ పార్టీకి ఆయన అందించిన సేవలు మరువలేనివని అన్నారు. ఆయన సేవలను తరతరాలకు స్ఫూర్తిగా నిలిపే విధంగా స్మరించుకోవాలన్నారు. పివి ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలే ఈరోజు భారత్‌ను 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ దిశగా నడిపిస్తున్నాయని, ఈ క్రెడిట్ పూర్తిగా ఆయనకే చెందుతుందన్నారు. విద్యా వ్యవస్థలో వినూత్న విధానాలు ప్రవేశ పెట్టారు. ఆయన హయాంలోనే నవోదయ విద్యాలయాల ఏర్పాటుతో లక్షలాది మంది విద్యార్థులకు నాణ్యమైన విద్యకు మార్గం సుగమమైందన్నారు. గాంధీభవన్‌లో మాజీ ప్రధాని, భారత రత్న స్వర్గయ పి.వి నర్సింహారావు జయంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు.

# కిషోర్ బొయిదాపునకు ఐకానిక్ సినిమాటోగ్రాఫర్ అవార్డు

ప్రముఖ హీరోయిన్ హన్సిక మోత్వాని నటించిన 105 మినిట్స్ చిత్రానికిగాను సినిమాటోగ్రఫీ విభాగంలో ఇంటర్నేషనల్ ఐకానిక్ అవార్డ్ అదుకున్నారు టాలెంటెడ్ యువ కెమెరామెన్ కిషోర్ బొయిదాపు. పరిమిత బడ్జెట్‌లో సింగిల్ క్యారెక్టర్‌తో.. సింగిల్ షాట్‌లో తెరకెక్కి ఉండడం 105 మినిట్స్ సినిమా ప్రత్యేకత. హైదరాబాద్‌లో లీమెరిడియన్ హోటల్‌లో కోలాహలంగా జరిగిన వేడుకలో కిషోర్ ఈ ప్రతిష్టాత్మక పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా 105 మినిట్స్ చిత్ర దర్శకులు రాజు దుస్సా, నిర్మాత బొమ్మక్ శివలకు కిషోర్ కృతజ్ఞతలు తెలిపారు! రవిప్రసాద్ యూనిట్‌లో కెమెరా అసిస్టెంట్‌గా తన కెరీర్ ప్రారంభించిన కిషోర్..అనతికాలంలోనే అంచెలంచెలుగా కెమెరామెన్ స్థాయిని సాధించారు. స్లమ్ డాగ్ మిలియనీర్, మిషన్ ఇంపాజిబుల్4, లెటర్స్, సూటబుల్ బాయ్స్ వంటి హాలీవుడ్ ప్రోజెక్టులకు సెకండ్ యూనిట్ కెమెరామెన్‌గా తన ప్రతిభ కనబరిచిన ఈ యువ కిశోరం.. ప్రఖ్యాత సినిమాటోగ్రఫర్ అనిల్ మెహతా ప్రియ శిష్యుడిగా... సీక్రెట్ సూపర్ స్టార్, ఏ దిల్ హై ముష్కిల్, బియాండ్ ది క్లౌడ్స్, హిందీ జెర్సీ వంటి పలు చిత్రాలకు పనిచేయడంతోపాటు.. అగ్ర హీరోలు నటించిన యాడ్‌ఫిల్మ్స్ సైతంహ్యాండిల్ చేశారు.బోయ్ మీట్స్ గర్ల్‌తో కెమెరామెన్‌గా మారిన కిషోర్..కిరాక్, వశం, ఫిల్మ్ జర్నలిస్ట్ టర్నడ్ డైరెక్టర్ నాగు గవర దర్శ కత్వం వహించిన కర్త కర్మ క్రియ, 105 మినిట్స్, మై నేమ్ ఈజ్ శృతి చిత్రాలకు ఛాయాగ్రహణం చేశారు. సునీల్ నటిస్తున్న ఆన్ ది వే, ఆది సాయికుమార్ రుధిరాక్ష, బిగ్ బాస్ ఫేమ్ షణ్ముఖ, శివాజీ, భూమిక నటిస్తున్న ఇంకా పేరు పెట్టని చిత్రాలు షూటింగ్ దశలో ఉన్నాయి. జేబు శాటిసిఫేక్షన్ కంటే జాబు శాటిసిఫేక్షన్‌కి ప్రాధాన్యతగా పేర్కొనే కిషోర్, ప్రపంచవ్యాప్తంగా పలు భాషలకు చెందిన టాలెంటెడ్ సినిమాటోగ్రాఫర్స్ సినిమాలు తెరకెక్కించే తీరుతెన్నులను నిశితంగా పరిశీలిస్తుండడంతోపాటు వారి ఇంటర్వ్యూలు ఫాలో అవుతూ తననుతాను అప్ డేట్ చేసుకుంటూ ఉంటారు. ముంబై నుంచి హైద్రాబాద్‌కు షిఫ్ట్ అయిపోయిన కిషోర్ ఇకపై తన ఫోకస్ తెలుగు సిని మాలపై మాత్రమేనని తెలిపారు.



# 'విరాటపాలెం' సక్సెస్ మీట్

తెలుగులో విజయవంతమైన ఒరిజినల్ షోలు, చిత్రాలతో ఆకట్టుకుంటుంది. సోషల్ మీడియా సెన్సేషన్ అభిజ్ఞ వూత లూరు ప్రధాన పాత్రలో నటించిన విరాటపాలెం: పిసి మీనా రిపోర్టింగ్ సిరీస్‌కు పోలూరు కృష్ణ దర్శ కత్వం వహించారు. సౌత్ ఇండియన్ స్క్రీన్స్ బ్యానర్‌పై కెవి శ్రీరామ్ ఈ సిరీస్‌ను నిర్మిం చారు. ఈ సిరీస్ జూన్ 27 నుంచి జీ5లో టాప్ ప్లేస్‌లో ట్రెండ్ అవుతోం ది. ఈ క్రమంలో శనివారం నాడు టీం సక్సెస్ మీట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో.. జీ5 తెలుగు బిజినెస్ హెడ్ అనురాధ మాట్లాడుతూ, నేను స్టేజ్ మీద ఎక్కువగా మాట్లాడను. జీ తెలుగు సంస్థకు ఇది 20వ వసంతం. ఈ ప్రయాణంలో మాకు మీడియా ఎంతో అండగా నిలబడింది. మా టీం సహకారం వల్లే ఇంత సక్సెస్ ఫుల్‌గా సాగుతున్నాం. మేం వంద శాతం ఒరిజినల్ కంటెంట్, షోలను తీసుకు వచ్చాం. మేం ఎన్నో ఐకానిక్ షోలను చేశాం. మేం వేసిన బాటలో ఎంతో మంది నడిచారు. మేం ఎన్నో ఒరిజినల్ ఐడియాస్‌ను క్రియేట్ చేశారు. ఆరంభం ఒక్క అడుగుతో అంటూ ఇక్కడి వరకు వచ్చాం. ఓటీటీ సంస్థల్లో మేం స్టాండర్డ్స్‌ను సెట్ చేశాం. గాలివాన, ఏటీఎం, పరువు, ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ, పులి మేక ఇలా ప్రతీ చోటా మేం ఒరిజినల్ కంటెంట్‌తోనే వచ్చాం. పులి మేక అనేదే ఫస్ట్ ఫీమేల్ కాప్ స్టోరీ. ఆ తరువాత ఎన్నో కాప్ స్టోరీలు వచ్చాయి. ఓటీటీల్లో ఎన్నో కాప్ స్టోరీలున్నాయి. ఓ కాప్ స్టోరీ కావాలని నేనే దివ్యను అడిగాను. అప్పుడే దివ్య సొంతంగా ఈ కథను రాసుకున్నారు. మేం జరిగిన వివాదం గురించి మాట్లాడం. మా కంపెనీ పాలసీని దాటి మేం మాట్లాడం. వ్యవహారం కోర్టులో ఉన్నప్పుడు మేం ఏమీ మాట్లాడకూడదు. ఇంత నెగెటివిటీ ఉన్నా కూడా మా సిరీస్‌కు ఇంతటి రెస్పాన్స్ వచ్చింది. మేం ఎన్నో రికార్డులు క్రియేట్ చేస్తూ, హద్దుల్ని చెరిపి వేస్తూ వచ్చాం.. ఇంకా ఇలాంటి పాత్ బ్రేకింగ్ కంటెంట్‌తో వస్తూనే ఉంటాం. సత్యమేవ జయతే. మేం మా కాంపిటీటర్స్ పట్ల ఎంతో గౌరవం ఉంది. మా సంస్థను కించపర్చేలా మాట్లాడిన వారిపై పరువునష్టం దావా వేశాం. న్యాయ వ్యవస్థపై మాకు నమ్మకం ఉందని అన్నారు. నిర్మాత శ్రీరామ్ మాట్లాడుతూ, రెక్కీతో మేం సక్సెస్ సాధించాం. రెక్కీతోనే నేను వెబ్ సిరీస్‌లు నిర్మించడం ప్రారంభించాను. నాకు జీ5లో ఇంత మంచి అవకాశం ఇచ్చిన అను మేడంకు థాంక్స్. ఆమె ఇచ్చిన సహకారంతోనే ఇవన్నీ చేయగలుగుతున్నాం. రెక్కీ తరువాత ఎన్నో కథలు వింటే విరాటపాలెం పాయింట్ నన్ను హంట్ చేసింది. రెక్కీ చాలా కొత్తగా ఉంటుందని, అందరికీ నచ్చుతుందని ప్రమోషన్స్‌లో చెప్పాం. ఇప్పుడే అదే జరుగుతోంది. విరాటపాలెంను ఆదరిస్తున్న ప్రతీ ఒక్కరికీ థాంక్స్. మేం ఇక్కడ ఎవ్వరి గురించి మాట్లాడటానికి రాలేదు. మా మాటలే కంటే మా విజయమే అన్నింటికీ సమాధానం చెబుతుంది అని అన్నారు. జీ5 తెలుగు వైస్ ప్రెసిడెంట్, కంటెంట్ హెడ్ దేశ్ రాజ్ మాట్లాడుతూ, పులి మేక, బహిష్కరణ, పరువు ఇప్పుడు విరాటపాలెం.



# 'తమ్ముడు' మూవీకి 'ఎ' సర్టిఫికెట్

సంక్రాంతికి వస్తున్నాం బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నిర్మాణంలో వస్తున్న మరో సూపర్ హిట్ మూవీ తమ్ముడు. తాజాగా సెన్సార్ కార్యక్రమాలు ముగించుకున్న ఈ సినిమాకు నిర్మాత దిల్ రాజు ఎ సర్టిఫికెట్ ఎంచుకున్నారు. కట్స్‌తో ఈ సినిమాకు యు/ఎ సర్టిఫికెట్ లభించేది. అయితే ప్రేక్షకులకు బెస్ట్ థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చేందుకు నిర్మాత దిల్ రాజు ఎ సర్టిఫికెట్ తీసుకున్నారు. ఇటీవల తమ్ముడు మూవీ కోసం చేసిన ఇంటర్వ్యూస్‌లో దిల్ రాజు ఏ తరహా సినిమాలు ప్రేక్షకాదరణ పొందుతున్నాయో స్పష్టంగా చెప్పారు. సంక్రాంతికి వస్తున్నాం లాంటి కంప్లీట్ ఎంటర్ టైనర్స్ లేదా సరికొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమాలకు మాత్రమే ప్రేక్షకులు థియేటర్స్‌కు వెళ్తున్నారని ఆయన తెలిపారు. ఈ క్రమంలోనే "తమ్ముడు" సినిమాకు ఒక కొత్త తరహా సినిమాటిక్ అనుభవాన్ని ప్రేక్షకులకు అందించేందుకు కట్స్ లేకుండా 'ఎ' సర్టిఫికెట్ తీసుకునేందుకే దిల్ రాజు మొగ్గుచూపారు. దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి శ్రీరామ్ వేణు దర్శ కత్వం వహిస్తున్నారు.లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కీలక పాత్రలు పోషిస్తున్నారు. జూలై 4న "తమ్ముడు" సినిమా వరల్డ్ వైడ్‌గా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది.



# ప్రభాస్ లుక్ కెవ్వుకేక..

హను రాఘవ పూడితో సినిమా.. ప్రభాస్ లుక్ కెవ్వుకే! మరోవైపు, ప్రభాస్.. హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాను కూడా పూర్తి చేస్తున్నారు. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్న విషయం తెలిసిందే. లైనప్‌లో భారీ సినిమాలను ఇప్పటికే చేర్చిన డార్లింగ్.. ఓవైపు మారుతితో రాజా సాబ్ చేస్తున్నారు. కామెడీ హారర్ జోనర్‌లో రూపొందుతున్న ఆ సినిమా డిసెంబర్ 5వ తేదీన ప్రేక్షకుల ముందుకు రాగా.. ఇప్పడికే ఆడియన్స్‌లో భారీ అంచనాలు ఉన్నాయి. మరోవైపు, ప్రభాస్.. హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాను కూడా పూర్తి చేస్తున్నారు. పీరియాడికల్ జోనర్‌లో తెరకెక్కుతున్న ఆ సినిమాలో ప్రభాస్ సైనికుడిగా కనిపించను న్నారు. స్వాతంత్ర్యానికి పూర్వం జరిగే కథతో సినిమా ఉండనుందని తెలుస్తోంది. దీంతో ఆ మూవీపై కూడా వేరే లెవెల్ అంచనాలు ఉన్నాయి. విశాల్ చంద్రశేఖర్ మ్యూజిక్ అందిస్తుండగా.. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్ భారీ బడ్జెట్‌తో రూపొందిస్తున్నారు. ఇప్పటికే సినిమా షూటింగ్ స్టార్ట్ అవ్వగా.. ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో షూటింగ్ ఇప్పుడు జరుగుతున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే మేకర్స్ క్రేజీ అప్డేట్ ఇవ్వనున్నట్లు కొద్ది రోజులుగా వార్తలు వస్తున్నాయి. అదే సమయంలో ఇప్పుడు సెట్స్ నుంచి స్పెషల్ పిక్ లీకై సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఫారిన్ నుంచి వచ్చిన ప్రభాస్ రీసెంట్ గా సెట్స్ కు వచ్చినట్లు తెలుస్తోంది. అందుకు సంబంధించిన పిక్ .. ఇప్పుడు నెట్టింట చక్కర్లు కొడుతోంది. అందులో ప్రభాస్ ఫార్మల్ ప్యాంట్, ఫార్మల్ షర్ట్ వేసుకుని ఉన్నారు. యమా క్లాసిక్ గా కనిపించారు. సెట్స్ లో ఓ కర్ర బెంచీపై ఉన్న డార్లింగ్.. క్లీన్ షేవ్, మీసాలతో కనిపించారు. దీంతో నెటిజన్లు, ఫ్యాన్స్ రెస్పాండ్ అవుతున్నారు. ప్రభాస్ లుక్ అదిరిపోయిందని నెటిజన్లు చెబుతున్నారు. సైనికుడిగా డార్లింగ్ వేరే లెవెల్‌లో కనిపించనున్నారని అర్థమవుతుందని అంటున్నారు. సూపర్ పిక్ అని చెబుతున్నారు. సోషల్ మీడియాలో తెగ వైరల్ చేస్తున్నారు. సినిమాపై అంచనాలు పెరుగుతున్నాయని చెబుతున్నారు. మూవీ కోసం వెయిట్ చేస్తున్నామని అంతా కామెంట్లు పెడుతున్నారు. మరి ప్రభాస్ హను రాఘవపూడి చిత్రం ఎప్పుడు రిలీజ్ అవుతుందో వేచి చూడాలి.






# 'మైసా' ఫియర్స్ ఫస్ట్ లుక్

నేషనల్ క్రష్ రష్మిక మందన్న న్యూ మూవీ యాక్షన్‌ప్యాక్డ్ పోస్టర్‌తో అనౌన్స్ చేశారు. అన్‌ఫార్ములా ఫిల్మ్స్ నిర్మిస్తున్న ఈ హీరోయిన్ ఓరియెంటెడ్ సినిమా ద్వారా సక్సెస్ ఫుల్ డైరెక్టర్ హను రాఘవపూడి శిష్యుడు రవీంద్ర పుల్లె డైరెక్టర్‌గా పరిచయం అవుతున్నారు. అజయ్, అనిల్ సయ్యపురెడ్డి ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో హై బడ్జెట్‌తో నిర్మించనున్నారు. సాయి గోపా సహ నిర్మాత. రష్మిక అభిమానులను, పరిశ్రమను అలరించే ఆసక్తికరమైన అనౌన్స్ మెంట్ పోస్టర్ తర్వాత, పరిశ్రమల నుంచి రష్మిక మందన్న కొలిగ్స్ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. దర్శకుడు హను రాఘవపూడి తెలుగు లుక్, పోస్టర్‌ను లాంచ్ చేశారు. కుబేర కో యాక్టర్ ధనుష్ తమిళ్ పోస్టర్, చావా కో యాక్టర్ విక్కీ కౌశల్ హిందీ పోస్టర్‌ను విడుదల చేశారు. దుల్కర్ సల్మాన్ మలయాళ పోస్టర్‌ను, శివరాజ్ కుమార్ కన్నడ పోస్టర్‌ను విడుదల చేశారు. రష్మిక, మైసా టీంకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ చిత్రానికి మైసా అనే పవర్ ఫుల్ టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ పోస్టర్ ఇంతకు ముందు ఎప్పుడూ చూడనిది అనే పదానికి నిర్వచనంలా వుంది. రష్మిక ఫియర్స్ అండ్ ఇంటెన్స్ లుక్ కట్టిపడేసింది. సాంప్రదాయ చీరలో, ముక్కు పుడక, ఆభరణాలతో రష్మిక ఒక గోండ్ విమెన్‌గా కనిపించారు. ఆమె ఇంటెన్స్ లుక్, రక్తపు మరకలున్న రూపం, ఆమె చేతిలో గట్టిగా పట్టుకున్న వెపన్ అన్నీ ఒక పవర్ ఫుల్ మూవీని ప్రామిస్ చేస్తున్నాయి. టైటిల్, ఫస్ట్ లుక్ ప్రాజెక్ట్ క్యురియాసిటీ రేకెత్తించాయి. మైసా అనేది రెండు సంవత్సరాల కష్టం ఫలితం. కథ, ప్రపంచం, కళా దృక్పథం, పాత్రలు – ప్రతీ అంశాన్ని అద్భుతంగా తీర్చిదిద్దాం. ఇప్పుడు ఈ కథను ప్రపంచానికి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నాం అని దర్శకుడు రవీంద్ర పుల్లె తెలిపారు. ఈ సినిమా గోండు తెగల ప్రపంచాన్ని ఆధారంగా చేసుకుని రూపొందిన అద్భుతమైన ఎమోషనల్ యాక్షన్ థ్రిల్లర్ గా వుండబోతోంది. ఓర్పు ఆమె ఆయుధం. ఆమె గర్జన వినిపించేందుకు కాదు.. భయపడించేందుకు! రష్మిక మందన్నను మైసా పాత్రలో చూడండి, ఆమె ఫియర్స్ అవతార్ ఇదే అని నిర్మాణ సంస్థ సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేసింది. గత రెండు రోజులుగా సర్ ప్రైజింగ్ ఎనౌన్స్ మెంట్స్, పోస్టర్ రిలీజ్‌లు ప్రేక్షకులు, అభిమానుల్లో భారీ అంచనాలను క్రియేట్ చేసి సినిమాపై హ్యూజ్ బజ్ క్రియేట్ చేశాయి. ఈ చిత్రానికి సంబంధించి కీలక సాంకేతిక నిపుణుల వివరాలు వచ్చే వారం తెలియజేయనున్నారు.



# రికార్డు వ్యూస్ సాధించిన 'ఒక పథకం ప్రకారం'

సంచలన దర్శకుడు పూరి జగన్నాథ్ సోదరుడు సాయిరామ్ శంకర్ కథానాయకుడిగా నటించిన సీట్ ఎడ్జ్ సస్పెన్స్ థ్రిల్లర్ ఒక పథకం ప్రకారం. వినోద్ విజయన్ దర్శకత్వం వహించారు. వినోద్ విజయన్ ఫిల్మ్స్ విహారి సినిమా హౌస్ ప్రై.లి. సంస్థలపై గార్లపాటి రమేష్‌తో వినోద్ కుమార్ విజయన్ నిర్మించారు. ఫిబ్రవరి 7న సినిమా థియేటర్లలోకి వచ్చింది. జూన్ 27 నుంచి సన్ నెక్స్ట్ ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. ఇంటర్వెల్ తర్వాత విలన్ ఎవరో చెబితే 10 వేలు ఇస్తామని యూనిట్ చేసిన ప్రకటనకు మంచి స్పందన వచ్చింది. థియేటర్‌కు ఒకరు చొప్పున 50 థియేటర్ల నుంచి 50 మంది విజేతలను ఎంపిక చేసి ఐదు లక్షల రూపాయలు ఇస్తామని చిత్ర బృందం పేర్కొంది. మీడియా ప్రతినిధులకు వేసిన షోతో పాటు మిగతా థియేటర్లలో విజేతలకు డబ్బులు అందజేసింది. సినిమాకు మంచి రెస్పాన్స్ వచ్చింది. థియేటర్లలో చక్కటి విజయాన్ని అందు కున్న ఒక పథకం ప్రకారం జూన్ 27 నుంచి సన్ నెక్స్ట్ ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. ఓటీటీలో రికార్డ్ వ్యూస్ సాధిస్తూ వీక్షకుల ఆదరణ సొంతం చేసుకుంటూ దూసుకు వెళుతోంది. ఒక పథకం ప్రకారం సినిమాతో సాయిరామ్ శంకర్ చక్కటి కమ్ బ్యాక్ ఇచ్చారని ఆడియన్స్ అప్రిషియేట్ చేస్తున్నారు. ఒక పథకం ప్రకారంలో సిద్ధార్థ్ నీలకంఠ అనే పబ్లిక్ ప్రాసిక్యూటర్ పాత్రలో హీరో సాయిరామ్ శంకర్ నటించారు. విశాఖ నగరంలో జరిగిన వరుస హత్యల మీద అతని మీద పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తారు. నిజంగా ఆ హత్యలు సిద్ధార్థ్ చేశాడా? లేదంటే వాటి వెనుక వేరొకరు ఉన్నారా? అనేది సినిమా. నిర్మాతలు గార్లపాటి రమేష్, వినోద్ విజయన్ మాట్లాడుతూ, మంచి సినిమా తీస్తే ప్రేక్షకుల ఆద రణ తప్పకుండా ఉంటుందని మరోసారి రుజువైంది. థియేటర్లలో విడుదలైన తర్వాత మాత్రమే కాకుండా ఓటీటీలో విడుదలైన తర్వాత కూడా ప్రశంసలు రావడం సంతోషంగా ఉంది. ఓటీటీ రిలీజ్ ప్లానింగ్, ప్రొసీజర్స్ విషయంలో మాకు సహాయం చేసిన సన్ నెక్స్ట్ కంటెంట్ హెడ్ శశి కిరణ్ నారాయణకి చాలా థాంక్స్. ఈ సినిమా దర్శక నిర్మాణంలో నాకు అండగా నిలబడిన మా హీరో సాయిరామ్ శంకర్‌తో పాటు చిత్ర బృందం అందరికీ థాంక్స్ అని చెప్పారు. శృతి సోధి, ఆషిమా నర్వాల్, సముద్ర ఖని, రవి పచ్చముత్తు, భానుశ్రీ, గార్లపాటి కల్పలత, పల్లవి గౌడ ముఖ్య తారాగణంగా రూపొందిన ఈ చిత్రానికి.. ఛాయాగ్రహణం: రాజీవ్ రాయ్, సంగీతం: రాహుల్ రాజ్, ఆర్.ఆర్: గోపి సుందర్, ఎడిటింగ్: కార్తీక్ జోగేష్, ఆర్ట్; సంతోష్ రామన్, లిరిక్స్: రహమాన్.



# '3 బిహెచ్‌కె' ట్రైలర్ లాంచ్ ఈవెంట్

హీరో సిద్ధార్థ్ 40వ మూవీ '3 బిహెచ్‌కె'. శ్రీ గణేష్ దర్శకత్వం వహించారు. పోస్టర్లు, టీజర్లు, పాటలతో సినిమా మంచి బజ్ క్రియేట్ చేసింది. ప్రముఖ నటుడు శరత్ కుమార్ కీలక పాత్ర పోషిస్తుండగా, దేవయాని, యోగి బాబు, మీతా రఘునాథ్, చైత్ర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. శాంతి టాకీస్ బ్యానర్‌పై అరుణ్ విశ్వ నిర్మించిన ఈ చిత్రం థియేట్రికల్ ట్రైలర్ విడుదలైంది. ఇల్లు సొంతం చేసుకోవాలనే జీవితకాల కల కలిగిన మధ్యతరగతి కుటుంబ భావోద్వేగ ప్రయాణంలో ఈ ట్రైలర్ మనసుని హత్తుకుంది. జీవితంలో వైఫల్యాలు, నిరాశలను ఎదుర్కొన్న తండ్రి, కుటుంబం ఆకాంక్షలను నెరవేర్చడానికి తన కొడుకుపై తన ఆశలన్నింటినీ ఉంచుతాడు. అయితే, చదువు పరంగా కష్టపడుతూ, అనేక ప్రయత్నాలు చేసినప్పటికీ 34 సంవత్సరాల వయస్సులో కూడా ఉద్యోగం లేకుండా ఉన్న కొడుకు భావోద్వేగ ప్రయాణం చాలా ఎమోషనల్‌గా వుంది. ఆ కుటుంబం కల చివరకు సాకారం అవుతుందా లేదా అనేది చాలా ఆసక్తిని పెంచింది. ఇల్లు కొనడం అనేది మధ్యతరగతి కుటుంబాల కల. ఈ కథ అందరికీ కనెక్ట్ అయ్యేలా వుంది. దర్శకుడు శ్రీగణేష్ భావోద్వేగపరంగా హృదయాన్ని తాకే కథనంతో తన మ్యాజిక్‌ని ప్రజెంట్ చేశాడు. సిద్ధార్థ్ తన పాత్రలో ఒదిగిపోయాడు. తన పెర్ఫార్మెన్స్ అద్భుతంగా వుంది. తన కుటుంబం ఆనందం, భద్రత గురించి మాత్రమే కలలు కనే ఒక సాధారణ మధ్య తరగతి తండ్రిపాత్రను శరత్‌కుమార్ చాలా చక్కగాపోషించారు. కథకుభావోద్వేగాన్నిజోడించే ఆకట్టుకునే నటనతో దేవయాని, మీతా రఘునాథ్, చైత్ర ఆకట్టుకున్నారు. సినిమాటోగ్రాఫర్లు దినేష్ కృష్ణన్ బి, జితిన్ స్టానిస్లాస్ విజువల్స్ మధ్య తరగతి జీవితాన్ని అందంగా చూపించాయి.



# 'జూనియర్' టీజర్ రిలీజ్

ప్రముఖ రాజకీయ నాయకుడు, వ్యాపారవేత్త గాలి జనార్ధన్ రెడ్డి కుమారుడు కిరీటి రెడ్డి, రాధా కృష్ణ దర్శకత్వం వహించిన యూత్ ఎంటర్‌టైనర్ జూనియర్‌తో హీరోగా అరంగేట్రం చేస్తున్నాడు. వారాహి చలన చిత్రం బ్యానర్‌పై రజని కొర్రపాటి నిర్మించిన ఈ చిత్ర టీజర్ విడుదలైంది. ఈ టీజర్ సినిమా టోన్, హిలేరియస్, ఫుల్‌ఆన్ ఎంటర్‌టైనింగ్ స్నాప్‌షాట్‌ను అందిస్తుంది. కిరీటి ఒక రిలాక్స్డ్ కాలేజీ కుర్రాడు, మార్క్స్ కంటే హ్యాపినెస్ ని ఇష్టపడతాడు, తన చుట్టూ ఉన్న వారిని ఆకర్షించే వ్యక్తిత్వం వున్న తను శ్రీలీలాను ఇష్టపతాడు, మొదట గొడవతో మొదలైన జర్నీ మెల్లగా ఎట్రాక్టివ్ కెమిస్ట్రీగా మారుతుంది. టీజర్‌లో కిరీటి అదరగొట్టాడు. తన డ్యాన్స్ మూవ్స్, స్టంట్స్, స్పాట్‌ఆన్ కామిక్ టైమింగ్ అద్భుతంగా వున్నాయి. టీజర్‌లో కిరీటి చెప్పిన డైలాగులు అదిరిపోయాయి. అందరినీ అలరించేలా వున్నాయి. హీరోయిన్‌గా శ్రీలీల కూల్‌గా కనిపించింది. టీజర్ చివరిలో బాస్ పాత్రతో జెనీలియా డిసౌజా కనిపించడం మరింత ఆసక్తికరంగా వుంది. వైవా హర్ష పాత్ర కామిక్ రిలీఫ్‌ని ఇచ్చింది. కె.కె. సెంథిల్ కుమార్ సినిమాటోగ్రఫీ అద్భుతంగా ఉంది. విజువల్స్ చాలా గ్రాండ్‌గా వున్నాయి. రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అదిరిపోయింది. ఆయన సంగీతం యూత్ ఎనర్జీ, సినిమాటిక్ పంచ్‌తో అలరించింది.ఈ చిత్రానికి రవీందర్ ప్రొడక్షన్ డిజైన్, పీటర్ హెయిన్ హై ఆక్టేన్ యాక్షన్ కొరియోగ్రఫీ, నిరంజన్ దేవర మనే ఎడిటర్. కళ్యాణ్ చక్రవర్తి త్రిపురనేని రాసిన డైలాగ్స్ ఆకట్టుకున్నాయి. జూనియర్ తెలుగు, కన్నడ, తమిళం, హిందీ, మలయాళ భాషలలో జూలై 18న గ్రాండ్‌గా విడుదల కానుంది. తారాగణం: కిరీటి, శ్రీలీల, జెనీలియా, డాక్టర్ రవిచంద్ర వి. సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: రాధా కృష్ణ, నిర్మాత: రజనీ కొర్రపాటి, సంగీతం: దేవి శ్రీ ప్రసాద్ డీవోపీ: కేకే సెంథిల్ కుమార్, ప్రొడక్షన్ డిజైనర్: రవీందర్ స్టంట్ డైరెక్టర్: పీటర్ హెయిన్, డైలాగ్స్: కళ్యాణ్ చక్రవర్తి.



# ప్రకృతితో పోరాడుతూ.. సరిహద్దుల్లో ..



త్రివిధ దళాల్లో మహిళా సైనికుల ప్రాధాన్యత, ప్రారంభంలో పెరుగుతోంది. పురుషులకు ధీటుగా వాళ్ల భద్రతా విధులు నిర్వర్తిస్తున్నారు. వాళ్లలో రాజస్థాన్ ఏడారిలో శత్రువులు, ధూళి తుపానుల్ని తట్టుకొని కదలికలపై నిరంతరం నిఘా ఉంచు తున్న బీఎస్ఎఫ్ సిబ్బంది. మరీ ప్రత్యేకం! రాజస్థాన్‌లోని జైసల్మేర్... పాకిస్థాన్‌లో సరిహద్దు ప్రాంతం, సైనికులకు వాతావరణమే ఇక్కడ మొదటి శత్రువు పగలు అధిక ఉష్ణోగ్రతలు ఉంటే, రాత్రి వణికించే చలి. ఈ ఇతరకీ తోడు. తిరిగి మారే గాలి దిశ కారణంగా ఇసుక తిన్నెలు ఇవన్నీ భద్రతా విధులకు సవాలుగా నిలుస్తాయి. అయినా బీఎస్ఎఫ్‌కు చెందిన మహిళా సైనికులు మాత్రం స్థిరంగా తట్టుకొని విధులు నిర్వహిస్తున్నారు. వేసవిలో ఒక్కోసారి ఉష్ణోగ్రతలు 50 డిగ్రీల సెల్సియస్ దాటినా వెరవకుండా సహారా కాస్తున్నారు. ఈ ప్రాంతంలో వేసవిలో ఉష్ణోగ్రతలు సెల్సియస్. వాటిన రోజులూ ఉన్నాయి. దానికితోడు ధూళి తుఫాను సమయంలో పహారా కాయడం కష్టంగా ఉంటుంది. ఇసుక తిన్నెలు మరొక సమస్య గాలి దిశ మారే కొద్దీ అవి మారుతూ ఉంటాయి. కొన్నిసార్లు ఫెన్సింగ్ని కప్పేస్తే ఇంకొన్నిసార్లు దాని కింది ఇసుకను తొలగిస్తాయి. వేసవిలో ఇక్కడ విధులు నిర్వహించడం ఎవరికైనా కష్టంగానే ఉంటుంది. కానీ, యూనిఫాం ధరిస్తే మరో ఆలోచనేదీ మాకు రాదు. దేశ సరిహద్దుల రక్షణ కోసం ప్రాణం పెడతాం అంటారు అసిస్టెంట్ కమాండెంట్ అనితా కుమారి. గాలి దిశలో మార్పులతో ఇసుక ఒక చోట నుంచి మరొక చోట చేరి మేట వేస్తుంది. కొన్నిసార్లు పెన్సింగ్ కింద ఖాళీలు ఏర్పడతాయి. వాటిని పూడ్చేందుకు ప్రొక్లైనర్లను తెప్పిస్తాం. ప్రతికూల పరిస్థితులను ఆసరా చేసుకొని శత్రువులు చొరబాటుకు యత్నిస్తారు. అయితే మేము నిరంతరం అప్రమత్తంగా ఉంటాం అంటారు సబ్ ఇన్స్పెక్టర్ హన్వా పింగోలియా. ఏడారి ఒడగా పిలిచే ఒంటె రవాణా సాధనాలుగా వినియోగించుకుంటారు సైనికులు, అధిక ఉష్ణోగ్రతలు నమోదైనప్పుడు అవి ఇబ్బంది పడతాయి. ఇసుక తిన్నెలు ఏర్పడినప్పుడు ఎత్తుపల్లాల్లో ముందుకు సాగడానికి ఇబ్బంది పడతాయి. అలాంటిది సైనికుల పరిస్థితి ఎలా ఉంటుందో మీరే ఊహించుకోవచ్చు. అయితే సైనికుల క్షేమం కోసం కొన్ని రక్షణ చర్యలు తీసుకుంటారు. డ్యూటీ పాయింట్‌లో వీరు అక్కడ ఉంచుతారు. అయినా అవసరార్థం తమ వెంట ఉల్లి, నిమ్మ కాయలు ఉంచుకుంటారు. అత్యవసరమైతే మెడికల్ ఇన్స్పెక్షన్ రూమ్ కూడా అందుబాటులో ఉంటుంది. ఎవరి సరిహద్దుల్లో ప్రతి రోజూ ప్రతి క్షణం పని చేయడం కష్టసాధ్యమైనా ధీర వనితలు మాత్రం వెనకడుగు వేయ కుండా శత్రువుపై నిత్యం కన్నేసి ఉంచుతారు. మేం సరిహద్దుల్లో ఉన్నంత వరకు పౌరులెవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ధైర్యం చెబుతారు. □

# గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సదుపాయాలు కల్పిస్తూ..



పచ్చని చెట్లు, ఎత్తైన కొండలు, లోతైన లోయలతో చూడడానికి ఎంతో ఆహ్లాదంగా ఉంటుంది. మిజోరాం. ఇదంతా నాణేనికి ఓ వైపే! మరో వైపు ప్రకృతి వైపరీత్యాలకు నెలవు కూడా. ఎడతెరిపిలేని వర్షాలు, వరదలు, కరెంటు కోతలవల్ల సమయానికి వైద్యసేవలు అందక ఎంతోమంది ప్రాణాల్ని కోల్పోయారు. అలాంటి సంఘటనలే మల్సామ్ డాంగ్లియాని కలచివేశాయి. సల్సామ్ డాంగ్లియానిది మిజోరాం హనాహలన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం 30 సంవత్సరాలుగా సేవందిస్తున్నారీమె. ఆరు సంవత్సరాల క్రితం జరిగిన ఓ సంఘటన ఆమెను ఎంతో బాధించిందట. ఏడురోజుల పాటు ఎడతెరిపి లేని వర్షాల వల్ల కొండచరియలు భారీగా విరిగి పడ్డాయి. మేము ఉండే ప్రాంతం పూర్తిగా నీటమునిగింది విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ఓ పాపకి ఆరేళ్లుంటాయి. న్యుమోనియాతో శ్వాస తీసుకోలేకపోతోంది. ఆక్సిజన్ అందించాలి. కానీ, ఎలక్ట్రిసిటీ లేక ఆక్సిజన్ పెట్టలేకపోయాం తన ఊపిరి నా కళ్ల ముందే ఆగిపోవడం నేను ఇప్పటికీ మర్చిపోలేను. ఏమీ చేయలేని నిస్సహాయ స్థితి కోసం, ఆసుపత్రిలోని చిన్న పిల్లల టీకాలన్నీ పాడయ్యాయి. దాంతో టైమ్‌కి అందాల్సిన టీకాలు రెండు వారాలు ఆలస్యం అయ్యాయి అని గుర్తు చేసుకుంది మల్సామ్.





అయితే, ఈ సమస్య మిజోరంతోపాటు ఏడు ఈశాన్య రాష్ట్రాల్లోనూ ఉంది. ఈ ఘటన తర్వాత ఏ ఒక్కరూ వైద్యసేవలు అందక చని పోకూడదు అనుకుందాం. సౌరశక్తితోనే ... పీహెచ్‌సీలు సౌరశక్తితో నడవాలంటే అప్పట్లో వ్యయంతో కూడుకున్నదే. ప్రభుత్వ సాయం లేనిదే అమలు చేయడం కష్టం. కానీ, మల్సామ్ ముందడుగు వేసింది. రాష్ట్రంలోని అన్ని ఆరోగ్య కేంద్రాలు పూర్తిగా సౌరశక్తితోనే నడవాలను కుంది. వీటికోసమే ఏడు ఈశాన్య రాష్ట్రాల్లో సెల్కో ఫౌండేషన్ పని చేస్తోందని తెలుసుకుంది. ఇది లాభాన్ని ఆశించకుండా సౌరవిద్యుత్తు అందించే సంస్థ. వారిని సంప్రదించి సోలార్ ప్యానల్స్ ఏర్పాటుచేసింది. దాదాపు 11 జిల్లాల్లోని 98 ఆరోగ్య కేంద్రాలకు ఈ సహకారం చేరుకుంది. అధిక వర్షాలు, తేమ, మేఘావృతమై ఉన్న ప్రదేశాల్లో కూడా పనిచేసేలా వీటిని తయారు చేశారు. ఆరు రోజులు ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్తు అందించేలా బ్యాటరీలను రూపొందించారు. ఇది తెలుసుకున్న మిజోరాం ప్రభుత్వం ఆరోగ్య కేంద్రాలకు సౌర విద్యుత్ అందించాలని 'ఎనర్జీ ఫర్ హెల్త్‌'ని తీసుకొచ్చింది. అంతేకాదు, ఆమె కృషికి నచ్చిన గ్రామీణ ప్రాంతాల్లోనూ ఆరోగ్య సదుపాయాలు వందశాతం అందరికీ అందేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ ఖర్చు అంతా ప్రభుత్వం మీదే వేయకుండా డాక్టర్లు, టీచర్లు, నర్సులు, రైతులు, గ్రామపెద్దలు అందరూ వీటి ఏర్పాటుకు సాయం అందించారు. బేబీ వార్మర్లు. ఆక్సిజన్ కాన్సంట్రేటర్లు, ఫ్రీజర్లు ఈ సోలార్ ప్యానల్‌లో పనిచేసేలా వాటిని పీహెచ్‌సీల్లో అమర్చింది మల్సామ్. ఒకవేళ నిర్వహించడంలో సమస్యలు వస్తే సూర్య మిత్ర యాప్' ద్వారా పరిష్కరించుకోవడంలోనూ ఆసుపత్రి సిబ్బందికి శిక్షణ ఇస్తోందిమె. □

# పెద్దమ్మాయికి బాధ్యత ఎక్కువ..



చిన్నదానికి దెబ్బ తగిలింది, కూడా ఉన్నావుగా.. చూసుకోలేదా.. అంటూ ఇంట్లో పెద్ద పిల్లలను అజమాయిషీ చేస్తారంతా. తీరా చెల్లెలికన్నా పెద్దమ్మాయిది రెండేళ్ల ఎక్కువ ఉంటుంది. అయినా చిన్నవాళ్ల బాధ్యత పెద్దవాళ్లదే అంటారంతా. దీంతోపాటు పుట్టిన క్రమం పిల్లల వ్యక్తిత్వాన్ని గణనీయంగా ప్రభావితం చేస్తుందంటున్నాయి పలు పరిశోధనలు. సంతానంలో పిల్లలు పుట్టే క్రమం వారి స్వభావం, ప్రవర్తనను ప్రభావితం చేస్తాయంటున్నాయి అధ్యయనాలు. అందరికన్నా పెద్దవాళ్లు కుటుంబం లో బాధ్యతగా, నాయకత్వ స్థానంలో ఉంటాయి. తల్లి దండ్రుల ఏకాగ్రత, అడిగిందల్లా పొందడం వంటివన్నీ ముందుగా వీరికే దక్కుతాయి. దీంతో అందరి ప్రేమ దక్కి తాము కూడా స్నేహభావంతో ఉంటారు. తన తర్వాత పుట్టిన పిల్లల బాధ్యత రావడంతో బాధ్యతాయుతంగా మారతారు. తమ్ముడు అల్లరి చేస్తే తప్పు అని చెప్పాలి కదా అనే తల్లిదండ్రుల మాటలతో తనకన్నా చిన్న వారికి తాను రోల్‌మోడల్‌గా ఉండాలనే వ్యక్తిత్వం వస్తుంది. మధ్యవాళ్లు.. తనకన్నా పెద్దవాళ్లు, చిన్నవాళ్లకు మధ్య సతమతుల్యంగా ఉంటారు. తమకంటూఐ గుర్తింపు పొందడానికి కృషి చేస్తూ, నైపుణ్యాలను పెంచుకుంటారు. తమకన్నా పెద్దవారికి, చిన్నవారికి సహకారానినన అందిస్తూ, వాళ్ల మధ్య వచ్చే విభేదాలకు మధ్యవర్తిత్వం వహిస్తారు. ఇక, చివరి పిల్లలు పుట్టే సమయానికి తల్లిదండ్రులకు పెంపకంలో అనుభవం వస్తుంది. ఒత్తిడికి గురికాకుండా పెంచడంవల్ల ఈ పిల్లల్లో ఆందోళన ఉండదట. అందరి ప్రేమ పొంది గారం గా పెరుగుతారు. నిర్లక్ష్యం వైఖరి వస్తుంది. నియమాలు, నిబంధనలు సడలి సాహసోపేతంగా ఉంటారు.

**ఒకే ఒక్కరైతే...** తల్లిదండ్రుల నుంచి ఎక్కువ ప్రేమ దొరుకుతుంది. పోటీ లేకుండా పెరుగుతారు. మనసుకు నచ్చింది చేస్తారు. అమ్మానాన్నతో ఎక్కువ గడుపుతారు. అయితే అనుకున్నది అందకపోతే తీవ్రమైన ఒత్తిడికి గురవుతారు. ఉన్నతవిద్యను అభ్యసించడంలో, సామాజిక నైపుణ్యాలను పెంపొందించు కోవడంలో ముందుంటారట. పిల్లల వరుసక్రమం ప్రకారం కాకుండా, ప్రతి సంతానం వ్యక్తిగత బలాలను పెంపొందించేలా తల్లిదండ్రులు మద్దతు అందించగలిగితే వాళ్ల వ్యక్తిత్వాన్ని సరైన రీతిలో మలచొచ్చు అంటున్నారు నిపుణులు. □

# కత్తెర ఒక్కటే కానీ..



పరికరాలతో పని తేలికయ్యే మాట నిజమే.. కానీ ప్రతి పనికీ ఒక పరికరాన్ని కొనలేం కదా! ఇదిగో ఈ మల్టీ ఫంక్షనల్ కత్తెర ఒకటి మీ దగ్గర ఉంటే ఐదారు పనులు సులభంగా చేసుకోవచ్చు. రెండు వైపులా పదును ఉండే ఈ కత్తెరతో చికెన్‌ని కావాల్సిన పరిమాణంలో ముక్కలు చేసుకోవచ్చు. చేపపొలుసులు తీసుకోవచ్చు.కాయగూర తొక్కలని వలిచే పీలర్‌గానూ ఉపయోగపడుతుంది. వాల్‌నట్స్ వంటి కఠినమైన గింజలని పగలకొట్టడం తేలిక. వెనుక భాగాన్ని బాటిల్ ఓపెనర్‌గా మలుచు కోవచ్చు. ఎక్కడ పెట్టాం అని వెతుక్కోవాల్సిన అవసరం లేకుండా ఫ్రిజ్‌కి తగిలించుకోవచ్చు. □



# యాకోబు దేవుడు మనకు తోడై ఉన్నాడు..

'సైన్యములకధిపతియగు యెహోవా మనకు తోడై యున్నాడు. యాకోబుయొక్క దేవుడు మనకు ఆశ్రయమైయున్నాడు' (కీర్తనలు 46:7) యాకోబు దేవుడు అని దేవుడు ఎందుకు పిలిపించుకునేందుకు ఇష్టపడుతున్నాడు? అంటే కొంత చరిత్రలోకి వెళ్లాలి. యాకోబు సహోదరుడైన ఏశావు తనను చంపేస్తాడని యాకోబు మిక్కిలి భయపడ్డాడు. అందుకే యబ్బోకు అనే రేవువద్ద రాత్రిసమయంలో యాకోబు ఒక్కడే మిగిలిపోయాడు. ఆ సమయంలో దేవుడు యాకోబును దర్శించాడు. ఒక నరుడు(దేవుడు) యాకోబుతో రాత్రంతా పోరాడాడు. తెల్లవారుతున్నప్పుడు యాకోబు దేవుడితో పోరాడుతున్నాడే తప్ప దేవుడిని వదిలిపెట్టడం లేదు. అప్పుడు దేవుడు తనను వదలమని యాకోబును అడిగినప్పుడు యాకోబు 'నీవు నన్ను ఆశీర్వదించితేనే గాని నిన్ను పోనియ్యననెను' (ఆది 32:26). అప్పుడు దేవుడు నీ పేరు ఏమని అడిగితే యాకోబు తన పేరు 'యాకోబు'గా చెప్పాడు. యాకోబు అనే పేరుకు అర్థం మోసగాడు (ఆది 25:26). యాకోబు తాను మోసగాడినని తనకు తెలుసు. ఎందుకంటే అప్పటికే తన తండ్రిని, అన్నను మోసగించాడు. దేవుడు అడిగినప్పుడు యదార్థంగా తనపేరు యాకోబు అని చెప్పాడు. తన తప్పును ఒప్పుకునేలా చెప్పాడు. దీనితో దేవుడు నీవు దేవుడితోను, మనుష్యులతోను పోరాడి గెలిచితివి గనుక ఇకమీదట నీ పేరు ఇశ్రాయేలు (దేవుడితో పోరాడువాడు) (ఆది 32:28) అని చెప్పాడు. దేవుడితో ఒంటరిగా గడిపి, విజయాన్ని పొందిన యాకోబు పేరు ఇశ్రాయేలుగా మార్చబడింది. ఆ పేరుతో నేడు ఇశ్రాయేలు దేశం ప్రపంచపటంలో మనకు ఉంది. ఒక వ్యక్తి తన బంధం దేవుడితో పెనవేసుకుని ఉండడం వల్ల దేవుడు ఆ వ్యక్తిపేరుతో ఒక దేశాన్ని ఉంచాడు. అంతేకాదు దేవుడు తాను యాకోబు దేవుడిగా పిలుచుకున్నాడు. మనం కూడా మన బలహీనతలను, తప్పిదాలను దేవుడి సన్నిధిలో ఒప్పుకుని, వాటిని విడిచిపెట్టేందుకు ప్రయత్నించినప్పుడు యాకోబు దేవుడు మనకు కూడా తోడైఉంటాడు. అందుకే బైబిల్ లో పలుపర్యాయాలు 'యాకోబు దేవుడు' అని మనకు కనిపిస్తుంది. యాకోబు ఒకప్పుడు మోసగాడే, కానీ తన జీవితాన్ని సరిచేసుకుని, దేవుడికి నమ్మకంగా జీవించి, ప్రభువును ఆరాధిస్తూ మరణించాడు. మనం కూడా దేవుడికి నమ్మకంగా జీవిస్తే యాకోబు ఆశీర్వదించబడి నట్లుగా మనం..మన కుటుంబం కూడా ఆశీర్వదించబడు తుంది. దేవుడు మనసుంచి కోరేది ఒక్కటే, అదే యదార్థత, నమ్మకం. ఆవిధంగా జీవించేందుకు దేవుడు మనకు సాయం చేయునుగాక..



-పి.వాణిపుష్ప

అంతర్వాణి

# కేక్ సమానంగా ..

కేకు కోయడం వరకూ బాగానే ఉంటుంది. కానీ దానిని అందరికీ సమానంగా పంచాల్సి వచ్చినప్పుడే చిక్కొస్తుంది. ఒకటి పెద్దది. ఒకటి చిన్నది. ఇలా జరిగితే పిల్లలు పేచీ పెట్టినా పెడ తారు. ఆ చిక్కు రాకుండా కేక్ ముక్కలని సమానంగా కోయాలంటే ఈ ఈక్వల్ కేక్ స్లైసర్‌ని వాడి చూడండి. మీ పని ఎంత తేలిక అవుతుందో! కేక్‌పై ఈ పరికరానినన ఉంచి, నొక్కి తీయడమే చేతికి అంటు కోకుండానే సమానంగా కోసేయొచ్చు. □



# ఆకుకూరలతో నాన్‌వెజ్ రుచులు

ఒట్టి ఆకుకూరలంటే కష్టమేమో కానీ.. వాటికి సరైన నాన్‌వెజ్ జోడీ దొరికితే అదిరిపోదూ! గోంగూర పచ్చిరొయ్యలు, గోంగూర మటన్ అలాంటి రుచులే. అవేకాదు మరికాస్త భిన్నంగా ఆకుకూర నాన్‌వెజ్ రుచులు ప్రయత్నిద్దాం..

## గోంగూర బోటీ

**కావాల్సినవి :** శుభ్రం చేసిన బోటీ-300గ్రా, గోంగూర కట్టలు-రెండు, నూనె-మూడున్నర చెంచాలు, ఉల్లిపాయలు-రెండు, పచ్చిమిర్చి-నాలుగు, టొమాటోలు-రెండు, అల్లంవెల్లులి పేస్ట్-చెంచా, ధనియాలపొడి-చెంచా, కారం-రెండు చెంచాలు, పసుపు-పావుచెంచా, గరంమసాలాపొడి-చెంచా, ఉప్పు-తగినంత.



**తయారీ :** కుక్కర్‌లో తగినన్ని నీళ్లు, ఉప్పు, పసుపు వేసి బోటీని మెత్తగా ఉడికించుకోవాలి. స్టౌపై కడాయి పెట్టి వేడెక్కాక కొద్దిగా నూనె వేసి అందులో గోంగూరని మెత్తగా మగ్గించుకోవాలి. మరొక కడాయి తీసుకుని అందులో మిగిలిన నూనె పోసి వేడెక్కాకి. ఉల్లిపాయముక్కలు వేసి బాగా వేయించుకోవాలి. తర్వాత టొమాటో ముక్కలు కూడా వేసి మగ్గాక, ఇందులో అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి పచ్చివాసన పోయేంతవరకూ వేగనివ్వాలి. ధనియాలపొడి,గరంమసాలా, ఉప్పు, పసుపు, కారం వేసుకోవాలి. కాసేపటికి నూనె వేరవుతుంది. అప్పుడు ఉడికించిన బోటీని నీళ్లతో సహా వేసుకోవాలి.ఓ పది నిమిషాలకు కూర దగ్గరవుతున్నప్పుడు ఉడికించిన గోంగూర వేసి కలపాలి. మరో ఐదు నిమిసాలకు వేడివేడి గోంగూర బోటీ కూర సిద్ధం.

## మెంతికూర మటన్..

**కావాల్సినవి :** బోన్‌లెస్ మటన్-500గ్రా, ఉల్లిపాయముక్కలు-ఒకటిన్నర కప్పు, టొమాటోలు-మూడు, మెంతాకు-ఒకటిన్నర కప్పు, దాల్చినచెక్క-చిన్నముక్క, లవంగాలు- మూడు, యాలకులు-రెండు, షాజీర-పావుచెంచా, ధనియాలపొడి-అరచెంచా, గరంమసాలా-చెంచా, ఉప్పు-తగినంత, నూనె-మూడు చెంచాలు, కారం-ఒకటిన్నర చెంచా, పసుపు-తగినంత, పచ్చిమిర్చి-నాలుగు అల్లంవెల్లుల్లి పేస్ట్-చెంచాన్నర.



**తయారీ :...** మటన్‌కి ఉప్పు, పసుపు, కారం పట్టించి ఓ అరగంటపాటు పక్కన పెట్టేయాలి. స్టౌ వెలిగించి కడాయి పెట్టి నూనె పోసి దాల్చినచెక్క, యాలకులు, షాజీర, లవంగాలు వేసి తక్కువ మంట మీద వేడిచేశాక ఉల్లిపాయముక్కలు, మిర్చి, ఉప్పు వేసుకుని దోరగా వేయించుకోవాలి. తర్వాత అల్లంవెల్లుల్లి పేస్ట్ వేసి పచ్చిన వాసన పోయాక మెంతాకు వేసుకోవాలి. దానిలో నీరు పోయిదగ్గరకు వచ్చేతవరకూ ఆగి. తర్వాత మారినేట్ చేసి పెట్టుకున్న మటన్ వేసి మూతపెట్టి పదినిమిషాలు ఉడికించుకోవాలి. కూరలోని నీరంతాపోయి పొడిగా అయ్యాక కప్పు నీళ్లు పోసుకుని మెత్తగా ఉడకనివ్వాలి. చివరిగా గరంమసాలా, ధనియాలపొడి వేసుకుంటే రుచకరమైన మేతి మటన్ రెడీ.

## చుక్కకూర చికెన్..

**కావాల్సినవి :** చికెన్-అరకేజీ, చుక్కకూ-నాలుగు కప్పులు, పచ్చిమిర్చి-మూడు, నూనె-ఐదు చిన్నచెంచాలు, కారం-ఒకటిన్నర చెంచా, ఉప్పు-తగినంత, పసుపు- పావుచెంచా, ఉల్లిపాయ-ఒకటి, ధనియాపొడి-ఒకటిన్నర చెంచా, గరంమసాలా-చెంచా, కొత్తిమీర తరుగు-రెండు చెంచాలు, అల్లంవెల్లుల్లి పేస్ట్-రెండు చెంచాలు.



**తయారీ :** చికెన్‌కి అల్లంవెల్లుల్లి పేస్ట్, కారం, పసుపు, ఉప్పు పట్టించి అరగంటపాటు పక్కన పెట్టేయాలి. స్టౌపై కడాయి పెట్టి వేడెక్కాక నూనెపోసుకుని ఉల్లిపాయ ముక్కలు, పచినచమర్చిలను బాగా వేయించుకోవాలి. తర్వాత అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి, వేగాక మారినేట్ చేసి పెట్టుకున్న చికెన్‌ని వేసి అందులోని నీరంతా పోయేతవరకూ ఉడికించుకోవాలి. అప్పుడు కప్పున్నర నీళ్లుపోసి, ఉడుకుతున్నప్పుడు చుక్కకూర ధనియాలపొడి, గరంమసాలా, ఉప్పు వేసుకోవాలి. చివరిగా కొత్తిమీర వేసుకొని దించుకోవాలి.

## సోయకూర లివర్ ఫ్రై ..

**కావాల్సినవి :** తరిగిన సోయకూఠ-కప్పు, మటన్ లివర్-150నరగా, ఉల్లిపాయ-ఒకటి, పచ్చిమిరపకాయలు-మూడు, టొమాటో-1, జీలకర్రపొడి-చెంచా, ధనియాలపొడి-చెంచా, గరంమసాలా-చెంచా, కొత్తిమీర-కొద్దిగా, నూనె మూడు చెంచాలు, ఉప్పు, కారం-తగినంత అల్లం వెల్లుల్లి పేస్ట్-చెంచా, కారం-చెంచా,



**తయారీ :** స్టౌపై కడాయి పెట్టి, వేడెక్కాక అందులో నూనె పోసుకోవాలి. ఉల్లిపాయ ముక్కలు, ఉప్పు వేసి వాటిని బాగా మగ్గనివ్వాలి. ఆ తర్వాత అల్లం వెల్లుల్లి పేస్ట్, పచ్చిమిరపకాయలు వేసుకుని పచ్చి వాసన పోనివ్వాలి. అప్పుడు కాసిని నీళ్ల పోసుకుని దానిలో లివర్ మటన్ వేసుకోవాలి. దాన్ని గరిటెతో కలుపుతూ కారం, ధనియాలపొడి, జీలకర్రపొడి, పసుపు, గరంమసాలా వేసికాసేపు మగ్గనివ్వాలి. అవి కూడా ఉడికాక కొద్దిగా నీళ్లు పోసి, సోయకూరని సన్ననగా తరిగి కూరలో వేసి మూతపట్టేయాలి. మరో ఐదునిమిషాలకు కూర దగ్గరకు వచ్చి సోయకూర లివర్ ఫ్రై రెడీ అవుతుంది.

## తోటకూర కాడలు-రొయ్యల పులుసు ..

**కావాల్సినవి :** తోటకూర కాడలు-రెండు కప్పులు, రొయ్యలు-కప్పు, ఉల్లిపాయలు-రెండు, అల్లం-చిన్నముక్క, వెల్లుల్లి రెబ్బలు- ఎనిమిది, పచ్చిమర్చి- మూడు, కరివేపాకు-రెబ్బ, నూనె-తగినంత, ఉప్పు-తగినంత, ఎండుమిర్చి-రెండు జీలకర్రపొడి-చెంచా, ధనియాలపొడి-చెంచా, గరుంమసాలా-చెంచా, కారం-చెంచా.



**తయారీ :** స్టౌ వెలిగించి కడాయి పెట్టి వేడెక్కాక నూనె పోసి, కరివేపాకు, ఎండుమిర్చిని తుంచి వేసి బాగా వేగనివ్వాలి. అందులో తరిగిన తోట కూర కాడల్ని వేసి మూత పెట్టి బాగా మగ్గనివ్వాలి ఇప్పుడు మిక్సీ.ఆర్‌లో ఉల్లిపాయ ముక్కలు, వెల్లుల్లి రెబ్బలు, అల్లం, గరంమసాలా, జీలకర్రపొడి, ధనియాలపొడి వేసి మెత్తగా మిక్సీ పట్టాలి. ఈ మసాలాని ఉడికిన తోటకూర కాడల్లో వేసుకోవాలి. అవి ఉడకుతున్నప్పుడే ఉప్పు, కారం, పసుపు వేసి బాగా మగ్గనివ్వాలి. ఇందులోనే రొయ్యల్ని వేసుకుని గరిటెతో తిప్పుతూ ఉంటే రొయ్యల నుంచి నీరు వస్తుంది. అది కూడా ఇగిరిపోయేంతవరకూ ఉంచి తర్వాత కొద్దిగా పోసి మూత పెట్టేయాలి. ఐదుపది నిమిషాలకు కూర సిద్ధమవుతుంది. □

ఆట

# ర్యాంకింగ్స్‌లో భారత్ నంబర్ 1గా ప్రజ్ఞానంద

## 2వ స్థానంలో గుకేష్



**న్యూఢిల్లీ:** తాజా ర్యాంకింగ్స్‌లో గ్రాండ్ మాస్టర్ ఆర్ ప్రజ్ఞానంద కొత్త భారత నంబర్ 1కు చేరుకున్నాడు. మరో గ్రాండ్ మాస్టర్ డి గుకేష్ రెండవ స్థానంలో నిలిచాడు. ఇక ప్రపంచ చెస్ రేటింగ్‌లలో, ఆర్ ప్రజ్ఞానంద ఇప్పుడు 2778.3 ఎలో రేటింగ్‌తో నాల్గవ స్థానంలో, డి గుకేష్ ఐదవ స్థానంలో ఉన్నారు. శనివారం విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో ఉజ్బెక్ కప్ మాస్టర్స్‌లో ప్రజ్ఞానంద టైటిల్‌తో, 19 ఏళ్ల అతను లైవ్ క్లాసికల్ చెస్ ర్యాంకింగ్స్‌లో భారతదేశానికి కొత్త నంబర్ 1 అయ్యాడు. అతను చివర రౌండ్‌లో బ్లాక్ పావులతో ఉజ్బెక్ గ్రాండ్ మాస్టర్ నోదిర్బెక్ అబ్దుసత్తోరోవ్‌ను ఓడించి టైటిల్‌ను ఖాయం చేసుకున్నాడు. లైవ్ రేటింగ్‌లలో, ప్రజ్ఞానంద ఇప్పుడు 2778.3 ఎలో రేటింగ్‌తో నాల్గవ స్థానంలోను, గుకేష్ 1776.6 రేటింగ్‌తో ఐదవ స్థానంలో ఉన్నారు. అలాగే మరో భారత్ గ్రాండ్ మాస్టర్ ఎరిగైసి అర్జున్ (2775.7) ఆరో స్థానంలో ఉండగా, నార్వేజియన్ మాగ్నస్ కార్ల్‌సెన్ (2839.2) అగ్రస్థానంలో నిలిచాడు. తరువాత అమెరికన్ బిలియు హికారు నకమురా (2807) మరియు ఫాబియానో కరువానా (2784.2) ఉన్నారు. కాగా భారత్ గ్రాండ్ మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్ (2743.0) టాప్‌టెన్ ర్యాంకింగ్స్‌లో లేడు. ఈ లైవ్ ర్యాంకింగ్స్‌లో 13వ స్థానంలో ఉన్నాడు. అదే భారత విషయానికి వస్తే 4వ స్థానంలో ఉన్నాడు. అదే సమయంలో, అరవింద్ చిదంబరం (2724.0) లైవ్ ర్యాంకింగ్స్‌లో 24వ స్థానంలో, భారత్‌లో 5వ స్థానంలో ఉన్నాడు.

## మల్లోర్కా ఓపెన్ ఫైనల్లో భారత్ డబుల్స్ స్పెషలిస్ట్

# భాంబ్రి, గాలోవే జోడీ ఓటమి



**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మక ఏటిపి 250 మల్లోర్కా ఓపెన్-2025 ఫైనల్లో ఇండోఅమెరికన్ ద్వయం యుకీ భాంబ్రి-గాలోవే ఓటమిచెందింది. శనివారం నాడు హోరాహోరీగా జరిగిన ఫైనల్ పోటీలో గొంజాలెజ్ మరియు క్రాజిసెక్ చేతిలో స్వల్ప తేడాతో ఓడిపోయిన భారత్ డబుల్స్ స్పెషలిస్ట్ యుకీ భాంబ్రీ మరియు అమెరికన్ భాగస్వామి రాబర్ట్ గాల్లోవే 2025 మల్లోర్కా ఛాంపియన్‌షిప్స్ లో రన్నరప్‌గా నిలిచారు. నాల్గవ సీడ్ ఇండోఅమెరికన్ జంట టాప్ సీడ్లు శాంటియాగో గొంజాలెజ్ మరియు ఆస్టిన్ క్రాజిసెక్ చేతిలో 1-6, 6-1 (13-15) తేడాతో ఓడిపోయింది. దీంతో మల్లోర్కా ఓపెన్‌లో ఇండో అమెరికన్ జంట పోరు ముగిసింది. ఒక జట్టుగా తమ తొలి ఏటిపి ఫైనల్ ఆడుతున్న భాంబ్రి మరియు గాల్లోవే, తొలి సెట్‌ను కోల్పోయిన తర్వాత బలంగా కోలుకున్నారు. అయితే నిర్ణయాత్మక సూపర్ టైబ్రేక్‌లో మాత్రం ఓటమిపాలయ్యారు. వారికి మూడు మ్యాచ్ పాయింట్లు ఉన్నాయి. కాని వాటిని గెల్స్‌గా మార్చడంలో విఫలమయ్యారు. చివరికి 13-15 తేడాతో వెనుకబడ్డారు. టోర్నమెంట్ అంతటా ఈ జంట బలమైన ప్రదర్శన కనబరిచారు. క్వార్టర్ ఫైనల్స్‌లో వారు బ్రెజిల్‌కు చెందిన రాఫెల్ మాటోస్ మరియు మార్సెలో మెలోలను 6-2, 6-3 తేడాతో ఆధిపత్య ప్రదర్శనతో ఓడించారు. ఆ తర్వాత వారు సెమీఫైనల్లో ఫ్రెంచ్‌అర్జెంటీనా జట్టు థియో అరిబేజ్ మరియు గైడో ఆండ్రియోజ్జిపై 6-1, 7-6(4) తేడాతో విజయం సాధించారు.




# జావెలిన్ త్రోలో ప్రపంచ నం.1గా నీరజ్ చోప్రా

**న్యూఢిల్లీ:** టోక్యో ఒలింపిక్స్ బంగారు పతక విజేత, భారత్ అథ్లెటిక్ నీరజ్ చోప్రా జావెలిన్ త్రో ర్యాంకింగ్స్‌లో ప్రపంచ నంబర్ 1 స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ప్రపంచ అథ్లెటిక్స్ శనివారం విడుదల చేసిన తాజా జాబితాలో గత ఏడాది సెప్టెంబర్ 17న బ్రస్సెల్స్‌లో జరిగిన డైమండ్ లీగ్ ఫైనల్‌లో గ్రెనేడియన్ అథ్లెట్ విజయం సాధించిన తర్వాత నీరజ్ తన నంబర్ 1 స్థానాన్ని అండర్సన్ పీటర్స్ చేతిలో కోల్పోయాడు. ప్రస్తుతం జావెలిన్ త్రో ర్యాంకింగ్స్‌లో ప్రస్తుతం నీరజ్ చోప్రా 1445 పాయింట్లతో ఉండగా, పీటర్స్ 1431 పాయింట్లతో ఉన్నాడు. పోచెఫ్‌స్ట్రూమ్‌లో జరిగిన ఇన్విటేషనల్ మీట్‌తో నీరజ్ తన సీజన్‌ను ప్రారంభించాడు, అక్కడ అతను 84.52 మీటర్ల త్రోతో స్వర్ణం సాధించాడు. తరువాత దోహాలో జరిగిన డైమండ్ లీగ్ ఓపెనర్‌లో, అతను మొదటిసారిగా 90 మీటర్ల మార్కును 90.23 మీటర్ల త్రోతో అధిగమించాడు. ఈ మైలురాయి ఉన్నప్పటికీ, అతను వెబర్ తర్వాత రెండవ స్థానంతో సరిపెట్టుకోవలసి వచ్చింది. తరువాత, పోలాండ్‌లోని జానుస్జ్ కుసోసిన్స్కి మెమోరియల్‌లో, అతను 84.14 మీటర్ల త్రోతో రెండవ స్థానంలో నిలిచాడు. అతను చివరికి పారిస్ డైమండ్ లీగ్‌లో 88.16 మీటర్ల ఓపెనింగ్ త్రోతో వెబర్‌ను ఓడించాడు. తరువాత ఆస్ట్రావా గోల్డెన్ స్పైక్‌లో 88.16 మీటర్ల త్రోతో సీజన్‌లో తన మూడవ విజయాన్ని సాధించాడు. అదే సమయంలో, జర్మన్ ఏస్ అండర్సన్ పీటర్స్ 1407 పాయింట్లతో మూడవ స్థానంలో, పాకిస్తాన్‌కు చెందిన అర్షద్ నదీమ్ 1370 పాయింట్లతో నాల్గవ స్థానంలో ఉన్నాడు. అతను చివరికి పారిస్ డైమండ్ లీగ్‌లో 88.16 మీటర్ల ఓపెనింగ్ త్రోతో వెబర్‌ను ఓడించాడు. తరువాత ఆస్ట్రావా గోల్డెన్ స్పైక్‌లో 88.16 మీటర్ల త్రోతో సీజన్‌లో తన మూడవ విజయాన్ని సాధించాడు.

# ఆసియా కప్‌లో హైవోల్టేజ్ మ్యాచ్!

## పాకిస్థాన్‌తో భారత్ ఢీ?




**న్యూఢిల్లీ:** భారత్‌లో ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఆసియా కప్ 2025 జరగనుంది. ఈ వరల్డ్ కప్‌కు ఇంకా మూడు నెలలు మాత్రమే సమయం ఉంది. భారత్, పాకిస్తాన్ మధ్య పెరిగిన ఉద్రిక్తల కారణంగా ఆసియా కప్‌పై ఇప్పటికే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఆసియా కప్ గురించి ప్రభుత్వంతో భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) చర్చలు జరుపుతుందని తెలుస్తోంది. పాకిస్తాన్ పాల్గొంటే, వారి మ్యాచ్‌లు శ్రీలంక లేదా దుబాయ్‌లో జరుగుతాయని అంచనా. ఈ సమయంలో ఇటీవలే ఆసియా కప్ అధికారిక ప్రసార సంస్థ ఒక పోస్టర్‌ను విడుదల చేసింది. టీమిండియా, బంగ్లాదేశ్, శ్రీలంక కెప్టెన్‌లను మాత్రమే ఆ పోస్టర్‌లో చూపించారు. పాకిస్తాన్ కెప్టెన్ ఆ పోస్టర్‌లో లేడు. దీంతో ఆసియా కప్‌లో పాకిస్తాన్ పాల్గొనడంపై గందరగోళం నెలకొంది. పాకిస్తాన్ లేకుండా ఆసియా కప్ నిర్వహిస్తారని అంతా అనుకున్నారు. కానీ, తాజాగా బీసీసీఐ ఆసియా కప్ 2025 గురించి భారత ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం నుండి సూచనలు వచ్చిన తర్వాత మాత్రమే ఆసియా కప్‌లో పాక్ ఆడుతుందా లేదా తెలుస్తుంది. అలాగే ఒక వేళ పాక్ పాల్గొంటే ఇండియా వర్సెస్ పాకిస్తాన్ మ్యాచ్ ఎప్పుడనేది కూడా బీసీసీఐ నిర్ణయం తీసుకుంటుంది. కాగా ఏప్రిల్ 22న జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడి తర్వాత, భారతదేశం ఆపరేషన్ సిందూర్‌ను ప్రారంభించి పాకిస్తాన్‌లోని అనేక ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసింది. దీని తర్వాత, రెండు దేశాల మధ్య ఉద్రిక్తత పెరిగింది. రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ ఉన్నప్పటికీ, దాని ప్రభావం క్రికెట్‌పై కనిపిస్తోంది. ఈసారి భారతదేశం ఆసియా కప్ 2025ను నిర్వహించాల్సి ఉంది. ఇటువంటి పరిస్థితిలో పాకిస్తాన్ ఈ టోర్నమెంట్‌లో ఎక్కడ ఆడుతుంది? టోర్నీలో భారత్, పాక్ మ్యాచ్ ఉంటుందా? లేదా? అనేది భారత ప్రభుత్వం నుండి సూచనలు పొందిన తర్వాతే నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుంది. ఒకవేళ పాకిస్తాన్ ఈ టోర్నీలో పాల్గొంటే పాక్ ఆడే మ్యాచ్‌లను కొలంబో లేదా దుబాయ్‌లో నిర్వహించే అవకాశం ఉంది. పాకిస్తాన్ మ్యాచ్‌లను నిర్వహించే అవకాశంపై బీసీసీఐ ఇంకా శ్రీలంక క్రికెట్ లేదా ఎమిరేట్స్ క్రికెట్ బోర్డుతో మాట్లాడలేదు. అక్టోబర్‌లో భారత్ అక్టోబర్ 5న కొలంబోలో జరిగే ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) మహిళల క్రికెట్ ప్రపంచ కప్‌లో పాకిస్తాన్‌తో తలపడనుంది. ఈ టోర్నీని కూడా భారత్ నిర్వహిస్తోంది. పాకిస్తాన్ మ్యాచ్‌లు మాత్రం శ్రీలంకలో జరుగుతాయి.

# శ్రీలంక సూపర్ విక్టరీ

## 78 రన్స్ తేడాతో బంగ్లాదేశ్ ఓటమి

**న్యూఢిల్లీ:** బంగ్లాతో జరిగిన రెండో టెస్టు ఇన్నింగ్స్‌లో 78 పరుగులు తేడాతో శ్రీలంక విక్టరీ సాధించింది. కొలంబో వేదికగా 211 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన బంగ్లాదేశ్ కేవలం 133 పరుగులకే కుప్పకూలింది. దీంతో శ్రీలంక తొలి ఇన్నింగ్స్ స్కోరుకు 78 పరుగు వెనుకబడడంతో బంగ్లాదేశ్ ఓటమిని చవిచూసింది. 115/6 ఓవర్‌నైట్ స్కోరతో నాలుగో రోజు శనివారం ఆటను ప్రారంభించిన బంగ్లాదేశ్ అదనంగా 18 పరుగులు మాత్రమే చేసి తమ ఇన్నింగ్స్‌ను ముగించింది. శ్రీలంక స్పిన్నర్ ప్రభాత్ జయసూర్య 5 వికెట్లు పడగొట్టి బంగ్లా పతనాన్ని శాసించాడు. అంతటితో పాటు, ధనుంజయ డి సిల్వా, రత్నాయకే 2 వికెట్లు సాధించారు. బంగ్లా బ్యాటర్లలో ముష్ఫికర్ రహీమ్ (26) పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలవగా, మిగిలిన ప్లేయర్లంతా దారుణంగా విఫలమయ్యారు. అంతకు ముందు ఓవర్‌నైట్ స్కోర్ 290/2తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన శ్రీలంక చివరకు 116.5 ఓవర్లలో 458 పరుగులకు ఆలౌట్ అయింది. పాథుమ్ నిసాంక (254 బంతుల్లోన 158 పరుగులు, 19 ఫోర్లు) క్రితం రోజు స్కోరుకు మరో 12 పరుగులు జోడించి వెనుదిరగగా, వికెట్ కీపర్ కుశాల్ మెండిస్ (87 బంతుల్లో 84 పరుగులు, 8 ఫర్లు, 2 సిక్స్‌లు) ధనాధన్ హాఫ్ సెంచరీతో అదరగొట్టాడు. కమిందు మెండిస్ (41 బంతుల్లో 33 పరుగులు, 5 ఫోర్లు) ఫర్వాలేదనిపించాడు. బంగ్లాదేశ్ బౌలర్లలో తైజుల్ ఇస్లామ్ 5 వికెట్లు పడగొట్టగా, హసన్ 3 వికెట్లు తీశాడు. తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ జట్టు 247 పరుగులు చేసింది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 2025-27 సైకిల్‌లో శ్రీలంకకు ఇదే తొలి విజయం కావడం విశేషం.

వాణిజ్యం

# ఐటిసి ఎఫ్‌ఎంసిజి ఉత్పత్తుల కొనుగోళ్లు రూ.34వేల కోట్లు

## పెరిగిన కన్స్యూమర్ సెంటిమెంట్...ఐటిసి

ముంబై, జూన్ 28: ఐటిసి పరిధిలో పొగాకే తర ఉత్పత్తుల కొనుగోలు అంటే ఎఫ్ఎంసిజి కేటగిరీలో 2025 ఆర్థిక సంవత్సరంలో వినియోగదారులు సుమారు 34 వేల కోట్లు వ్యయంచేసినట్లు కంపెనీ వార్షిక నివేదికలో వెల్లడించింది. మొత్తం 25 ప్రపంచ స్థాయి భారతీయ బ్రాండ్లను ప్రవేశపెట్టామని, దినవల్ల కస్టమర్లలో కొనుగోలు ప్రక్రియ పెరిగిందని, తమ బ్రాండ్లు సుమారు 26 కోట్ల కుటుంబాలకు చేరువ అయ్యాయని తెలిపింది. ఎఫ్ఎంసిజి బిజినెస్ 2025లో 21,981.57 కోట్లుగా ఉంది. పన్నుల చెల్లింపులకు ముందు 2163.92 కోట్లుగా ఉన్నట్లు తెలిపింది. వార్షికంగా కస్టమర్లు తమ బ్రాండ్లను కొనుగోలుచేసిన విలువరూ.32,500 కోట్లుగా ఉందని కంపెనీ తెలిపింది. గత ఏడాది కంటే కస్టమర్లు కొనుగోళ్లు 4.6శాతం వృద్ధిలో ఉందని వెల్లడించింది. ఐటీసీ కాలంతో పోలిస్తే కొంత మెరుగుపడింది అని తెలుస్తోంది.




ఎఫ్ఎంసిజి రంగంలో కొనుగోళ్లు మందగించిన తరుణంలో ఐటిసి ఎఫ్ఎంసిజి మెరుగుపడటం మంచి పరిణామంగా ఐటిసి చెప్తుంది. కోవిడ్ మహమ్మారి నుంచి బయటపడిన తర్వాత 2023లో 20.8శాతం ఉంటే 2024లో 12.1శాతంగా ఉంది. పట్టణ ప్రాంత మార్కెట్లలో ద్రవ్యోల్బణ ప్రభావం ఉంది. రానురాను గ్రామీణ ప్రాంతాల్లోను డిమాండ్ పికప్ అయిందని, మంచి రుతుపవనాలు రావడం వంటిల దిగుబడులు పెరగడం కూడా ఇందుకుకారణమని చెప్తుంది. పట్టణప్రాంతాల డిమాండ్ కూడా ద్రవ్యోల్బణం స్థిరంగా ఉండటంతో కొంత మెరుగుపడుతోందని కంపెనీ వివరించింది. ఐటిసి కొత్తగా 100 కొత్త ఎఫ్ఎంసిజి ఉత్పత్తులను ఈ ఏడాది ప్రవేశపెట్టింది. హెల్త్, న్యూట్రిషన్, ఆరోగ్యం, పరిరక్షణ, ప్రయాణాలకు అవసరమైన ఉత్పత్తులు ఎక్కువ ఉన్నాయి. గడచిన నాలుగేళ్లుగా మార్చి 22 వేల కోట్లు ఉన్న కన్స్యూమర్ కొనుగోళ్లు 2025నాటికి 34 వేల కోట్లకు పెరగడం కంపెనీపట్ల కస్టమర్లకు ఉన్న ఆదరణ అని ఐటిసి యాజమాన్యం ప్రకటించింది.

# బ్రాండ్ వాల్యూలో టాటా గ్రూప్ టాప్

## 13వ ర్యాంక్‌లో అదానీ

**ముంబయి, జూన్ 28:** భారత కంపెనీల్లో అత్యంత విలువలు కలిగిన బ్రాండ్‌గా అదానీగ్రూప్ నిలిచింది. బ్రాండ్ ఫైనాన్స్ విడుదల చేసిన ఇండియా 100 ర్యాంకింగ్స్‌లో అదానీగ్రూప్ బ్రాండ్ విలువలు 6.46 బిలియన్ డాలర్లుగా ఉంది. 2024లో 3.55 బిలియన్ డాలర్లనుంచి 2.91 బిలియన్ డాలర్లు వృద్ధిని నమోదు చేసింది. ఈ ర్యాంకింగ్స్‌తో గ్రూప్16వ స్థానంనుంచి 13వ స్థానానికి చేరుకుంది. అదానీగ్రూప్ భారత మార్కెట్లలోనే అత్యంత శరవేగంగా 82శాతం పెరిగాయి. గ్రూప్ వృద్ధి కూడా సమీకృత మౌలికవసరుల కల్పనపైనే ఫోకస్ పెంచడంతో భారీ వృద్ధిని నమోదుచేసింది. హరిత ఇంధనం, బ్రాండ్ ఈక్విటీ విలువలు పెరగడమే ఇందుకు కీలకమని బ్రాండ్ ఫైనాన్స్ నివేదిక తెలిపింది. లండన్ కేంద్రంగా పనిచేస్తున్న కన్సల్టెన్సీ సంస్థ బ్రాండ్ ఫైనాన్స్ బ్రాండ్ సూచి పటిష్టత, బ్రాండ్ ప్రభావం, రాబడుల అంచనాల వంటి వాటిని పరిగణనలోకి తీసుకుని ర్యాంకింగ్స్ ఇస్తుంది. మొత్తం టాప్ 100 భారత బ్రాండ్ల విలువలు ప్రస్తుతం 236.5 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు 2025 నివేదికలో తెలిపింది.టాటాగ్రూప్ ఈజాబితాలో అగ్రస్థానంలో నిలిచింది. బ్రాండ్ విలువలు 10శాతం పెరిగి 31.6 బిలియన్ డాలర్లకు చేరాయి. బహుళరంగాల్లో టాటా ఆధిపత్యం ఎలక్ట్రానిక్స్, ఈవీలు, సెమీకండక్టర్లు, ఏఐ, పునరుత్పత్తి ఇంధన వనరుల్లో కేటాయింపులు వంటివి కంపెనీ వృద్ధికి దోహదం చేశాయి. ఇన్ఫోసిస్ రెండోస్థానంలో నిలిచింది. 15శాతం బ్రాండ్ విలువలు పెరిగి 16.3 బిలియన్ డాలర్లకు చేరాయి. హెచ్‌డిఎఫ్‌సిగ్రూప్ 37శాతం పెరిగి 14.2 బిలియన్ డాలర్లుగా ఉంటే జీవితబీమా సంస్థ 35శాతం పెరిగి 13.6 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు బ్రాండ్‌ఫైనాన్స్ వెల్లడించింది. వృద్ధిచెందుతున్న బ్రాండ్‌గా నిలిచింది. బ్రాండ్ విలువలు కూడా




# ఇకపై పోస్టాఫీసుల్లోనూ డిజిటల్ చెల్లింపులు

**ముంబై, జూన్ 28:** భారతదేశంలోని తపాలాసేవలు అనేక దశాబ్దాలుగా నేరుగా ప్రజల జీవితాలకు అనుసంధానమై ఉన్నాయని చెప్పాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వ రంగ సంస్థలు కూడా సాంకేతికతను ఉపయోగించడం వేళ, తపాలా శాఖ ఒక నూతన దిశగా అడుగులు వేస్తోంది. దేశవ్యాప్తంగా పోస్టాఫీసుల్లో నగదు చెల్లింపుల విధానానికి స్వస్తి పలికి, యూపీఐ ఆధారిత డిజిటల్ చెల్లింపులను మార్గం సుగమం అవుతోంది. 2025 ఆగస్టు నాటికి భారతదేశంలోని అన్ని తపాలా కార్యాలయాల్లో లావాదేవీకి ప్రత్యేకంగా ఒక డైనమిక్ క్యూఆర్ కోడ్ జనరేట్ అవుతుంది. వినియోగదారులు దాన్ని స్మార్ట్‌ఫోన్లతో ఈ కోడ్‌ను స్కాన్ చేసి, ఎలాంటి ఇబ్బంది లేకుండా చెల్లింపులు పూర్తి చేయవచ్చు.ఈ యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్) ఆధారిత చెల్లింపులు ప్రవేశపెట్టేందుకు తపాలా శాఖ సన్నాహాలు చేస్తోంది. ఈ ఆధునిక మార్పుతో వినియోగ దారులు పోస్టల్ సేవలను సులభంగా, సురక్షితంగా క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లింపులు చేయవచ్చు. పోస్టాఫీసుల్లో ప్రస్తుతం ఉన్న సాంకేతికవ్యవస్థకు యూపీఐ తో అనుసంధానం లేదు.నాగల్ కోట్ హెడ్ పోస్టాఫీసులతో పాటు ఈ సమస్యను అధిగమించేందుకు తపాలా శాఖ తమ ఐటి ఇన్ఫ్రాస్ట్రక్చర్‌ను ఐటీ 2.0 (ఐటీ) వ్యవస్థను ఐటీ 2.0 పేరుతో అప్‌గ్రేడ్ చేస్తోంది. ఈ కొత్త టెక్నాలజీ ద్వారా ప్రతి నూతన విధానాన్ని అమలు చేయడానికి ముందు, కర్నాటకలోని మైసూరు, బాగల్‌కోట్ హెడ్ పోస్టాఫీసులతో పాటు పలు చిన్న కార్యాలయాల్లో పైలట్ ప్రాజెక్టును విజయవంతంగా నిర్వహించారు. ఈ ప్రయోగంలో భాగంగా మెయిల్ ప్రొడక్టుల బుకింగ్ కోసం క్యూఆర్ కోడ్ చెల్లింపులను విజయవంతంగా పరీక్షించారు. ఈ ఫలితాల ఆధారంగా రానున్న రోజుల్లో దేశవ్యాప్తంగా అన్ని పోస్టాఫీసుల్లో ఈ సౌకర్యాన్ని అందుబాటులోకి తేనున్నారు. గతంలో స్టాటిక్ క్యూఆర్ కోడ్‌లను ఉపయోగించిన డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించేందుకు తపాలా శాఖ ప్రయత్నించింది.


# పొదుపు పథకాల ఖాతాదారులకు ఆర్‌బిఐ ఝలక్

**న్యూఢిల్లీ, జూన్ 28:** కేంద్ర ప్రభుత్వం సోమవారం పీపీఎఫ్, ఎన్ఎస్‌సీ, సుకన్య సమృద్ధి యోజన, ఇతర చిన్న పొదుపు పథకాలపై వడ్డీ రేట్లను సమీక్షించనుంది. సవరించిన రేట్లు ఏవైనా ఉంటే ఆర్థిక సంవత్సరం 2025 26 జూలై-సెప్టెంబర్ త్రైమాసికానికి వర్తిస్తాయని నిపుణులు చెబుతున్నారు. 2025లో ఇప్పటివరకు ఆర్థిక మంత్రిత్వ శాఖ చాలా పోస్టాఫీసు పొదుపు సాధనాల్లో వడ్డీ రేట్లను మార్చలేదు. కానీ బాండ్ దిగుబడిలో గణనీయమైన తగ్గుదల, భారత రిజర్వ్ బ్యాంక్ వరుస రెపో రేటు కోతలతో రాబోయే సమీక్షలో ఈ వడ్డీ రేట్లను సవరించే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఆర్‌బిఐ ఇటీవల కీలక రెపో రేటును 50 బేసిస్‌పాయింట్లు తగ్గించడంతో రెపో రేటు 5.5 శాతానికి చేరింది. రెపో రేటు కోతలతో పాటు బాండ్ ఈల్డ్‌లు కూడా తగ్గాయి. జూన్ 26, 2025 నాటికి, 10 సంవత్సరాల ప్రభుత్వ బాండ్ ఈల్డ్ 6.269 శాతం వద్ద ఉంది. చిన్న పొదుపు రేట్లు పరోక్షంగా ప్రభుత్వ బాండ్ల రాబడికి అనుసంధానించి ఉండటం వల్ల ఈ తగ్గుదల తప్పనిసరి అని నిపుణులు భావిస్తున్నారు. మార్చి 24 నుంచి ఇప్పటివరకు సగటు 10 సంవత్సరాల జీసెక్ రాబడి 6.325 శాతం వద్ద ఉంది. ప్రామాణిక 25 బీపీఎస్ స్ప్రెడ్‌ను జోడిస్తే పీపీఎఫ్ రేటు ఫార్ములా ద్వారా కచ్చితంగా సర్దుబాటు చేస్తే 6.575 శాతానికి తగ్గుతుంది. కానీ ఈ రేటు ప్రస్తుతం 7.10 శాతంగా ఉంది. ఈ లెక్కింపు ప్రకారం మార్కెట్ రేట్ల తగ్గుదలకు అనుగుణంగా చిన్న పొదుపు రేట్లను తగ్గించాలి. అయితే తుది నిర్ణయం ప్రభుత్వ చేతిలో ఉంటుంది. ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకునే ముందు ఇతర స్థూల ఆర్థిక, రాజకీయ అంశాలను పరిగణనలోకి తీసుకుంటుంది. చిన్న పొదుపు పథకాల్లో కింది స్థాయి ప్రజలకు కీలకమైన పొదుపు సాధనంగా పనిచేస్తాయి కాబట్టి ఈ నిర్ణయం విషయంలో ప్రభుత్వాలు అతితూచి వ్యవహరిస్తాయి. 2026 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో చిన్న పొదుపు వడ్డీ రేట్లలో తగ్గింపు ఉండే అవకాశం ఉందని నిపుణులు పరిస్థితులు సూచిస్తున్నప్పటికీ తుది నిర్ణయాన్ని ఆర్థిక మంత్రిత్వ శాఖ జూన్ 30న ప్రకటిస్తుంది.



# దిగివస్తున్న పసిడి ధరలు

**న్యూఢిల్లీ, జూన్ 28:** బంగారం ధరలు తగ్గుముఖం పట్టాయి. ఈ మధ్య కాలంలో బంగారం కొనుగోలు చేయాలా వద్దా అనే సందేహంలో ఉన్నవారికి తాజా పరిణామాలు శుభవార్తను అందిస్తాయి. జూన్ 14న ఆల్‌టైమ్ గరిష్టానికి తాకిన తర్వాత బంగారం ధరలు భారీగా పడిపోయాయి. జూన్ 28వ తేదీ శనివారం బంగారం ధరలను మనం పరిశీలిస్తే.. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ.97,420 వద్ద ట్రేడ్ అవుతోంది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.89,300 వద్ద ట్రేడ్ అవుతోంది. ఇక 18 క్యారెట్ల బంగారం ధర రూ.73,070 వద్ద ట్రేడ్ అవుతోంది. భవిష్యత్తులో బంగారం ధరలు ఇంకా తగ్గే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. డాలర్ బలహీనపడటం, ప్రపంచ వ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్న రాజకీయ పరిస్థితులు, పశ్చిమాసియా దేశాల్లో తగ్గిన ఉద్రిక్తతలు వంటి వాటితో బంగారం ధరలు ఈ సారి తగ్గే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. మరోవైపు మొక్క కారణం పెట్టుబడిదారులు లు యూఎస్ డాలర్ మీద పెట్టుబడులకు ఆసక్తి చూపడమేనని చెప్తుకోవచ్చు. హైదరాబాద్ నగరంలో నేడు బంగారం ధరలను పరిశీలించినట్లయితే 10గ్రాముల 24 క్యారెట్ల బంగారం రూ.97,420 దగ్గర ట్రేడ్ అవుతోంది. అలాగే 10గ్రాముల 22 క్యారెట్ల బంగారందర రూ.89,300 పలుకుతోంది. ఇక 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర రూ.73,070గా నమోదైంది. విజయవాడలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారందర రూ.97,420 దగ్గర ట్రేడ్ అవుతోంది.అలాగే 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ. రూ. రూ.89,300 పలుకుతోంది. ఇక 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర రూ.73,070 గా నమోదైంది. చెన్నైలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.97,420 దగ్గర ట్రేడ్ అవుతోంది.అలాగే 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ. రూ. రూ.89,300 పలుకుతోంది. ఇక 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర రూ.73,600 గా నమోదైంది. ముంబైలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.97,420 దగ్గర ట్రేడ్ అవుతోంది.అలాగే 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ. రూ. రూ.89,300 పలుకుతోంది. ఇక ఢిల్లీలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.97,570 దగ్గర ట్రేడ్ అవుతోంది.అలాగే 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ.89,450 రూపాయలు పలుకుతోంది.ఇక 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర 73,190 నమోదైంది.విశాఖపట్నంలో బంగారం ధరలను పరిశీలించినట్లయితే 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.97,420 దగ్గర ట్రేడ్ అవుతోంది.



# ఐపిఓకు 19 కంపెనీలు రెడీ

**ముంబై, జూన్ 28:** ప్రైమరీ మార్కెట్‌లో మళ్లీ ఐపీఓల సందడి మొదలైంది. మార్కెట్ ఒడుదొడుకుల నేపథ్యంలో కొంతకాలం పాటు స్తబ్దత నెలకొనగా.. మళ్లీ మార్కెట్‌లో పబ్లిక్‌ఇష్యూ కోసం పలు కంపెనీలు క్యూకట్టాయి. ముఖ్యంగా జూలై చివరి వారంలో ఈ సందడి మరింత ఎక్కువగా కనిపించింది. వాటికి మంచి ఆదరణ కూడా దక్కింది. హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్, కల్పతరు, ఎలెన్‌బ్యారీ ఇండస్ట్రియల్ గ్యాసెస్, సంభవ్ స్టీల్ ట్యూబ్స్, గ్లోబ్ సివిల్‌ప్రాజెక్ట్స్ లిమిటెడ్ సంస్థలు సంయుక్తంగా రూ.15,600 కోట్లు సమీకరించేందుకు సబ్‌స్క్రిప్షన్‌కు రాగా.. రూ.1.85లక్షల కోట్ల విలువైన షేర్లకు బిడ్లు దాఖలవడం బట్టి మార్కెట్ వీటికున్న క్రేజ్‌ను అర్థం చేసుకోవచ్చు. దీంతో వచ్చేవారం మార్కెట్‌లో కొత్త ఐపీఓల కంటే లిస్టింగ్‌ల సందడి ప్రధానంగాకనిపించనుంది. స్టాక్‌ఎక్స్ఛేంజీల్లో వచ్చేవారం మొత్తం 19 కంపెనీలు లిస్ట్ కానున్నాయి. ఇందులో ఆరు మెయిన్‌బోర్డు కాగా.. 13ఎస్ఎంఈ విభాగానికి చెందినవి ఉన్నాయి. మెయిన్‌బోర్డు నుంచి వస్తున్న వాటిలో కల్పతరు (2.26 రెట్ల సబ్‌స్క్రిప్షన్), ఎలెన్‌బ్యారీ ఇండస్ట్రియల్ గ్యాసెస్ (22.19 రెట్లు), గ్లోబల్ సివిల్ ప్రాజెక్ట్స్ (86.04 రెట్లు)సంస్థలు జూలై 1న మంగళవారం లిస్ట్ కానున్నాయి. మోగా ఐపీఓగా వచ్చిన హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ (16.69 రెట్లు), సంభవ్ స్టీల్ ట్యూబ్స్ (31.82 రెట్లు) జూలై 2న స్టాక్ మార్కెట్లోకి ఎంట్రీ ఇవ్వనున్నాయి. ఇండో గల్ఫ్ క్రాప్ సైన్స్ షేర్లు జూలై 3న లిస్ట్ కానున్నాయి. వీటితో పాటు ఏజీస్ జువెల్ మానుఫాక్చర్స్, శ్రీ హరేకృష్ణ స్పాంజ్ ఐరన్, ఎలాన్ ఫెరిలిటీ బటర్స్, ఆగ్రో ఫుడ్స్, సూపర్ టెక్ ఈవీ, సినటిక్ ఇన్ఫ్రా వంటి 13 సంస్థలు ఎస్ఎంఈ కేటగిరీలో లిస్ట్ కానున్నాయి. వచ్చేవారంలో బీబీఏ ఎక్స్‌పెడిషన్ ఫ్లాట్‌ఫామ్ క్రియేట్, ట్రావెల్ ఫుడ్ సర్వీసెస్ ఐపీఓకు వస్తున్నాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.